# శ్రీతులసిదివ్యమహిమలు


*రచయిత్రి*

**డా॥ డి. ఉమాదేవి**



**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2019**

# SRI TULASI DIVYAMAHIMALU

By
**Dr. D. Umadevi**

T.T.D. Religious Publication Series No: 1376
All Rights Reserved

*First Edition : 2019*

Copies: 500

*Published by :*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

## ముందుమాట

**యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతాః ।**
**యదగ్రే సర్వవేదా శ్చ తులసీం త్వాం నమామ్యహమ్ ॥**

మూలభాగంలో సకలతీర్థాలు, మధ్యభాగంలో సకలదేవతలు, అగ్రభాగంలో సకలవేదాలు నివసిస్తుండే తులసీదేవికి నమస్కరిస్తున్నాను.

మనపూర్వీకులు ఏది చెప్పినా, ఏ కట్టుబాటు చేసినా దానివెనుక ప్రత్యక్షంగా ఆధ్యాత్మిక కారణం, పరోక్షంగా వైజ్ఞానికకారణం దాగి ఉంటాయి.

సాధారణంగా చెట్లు ఉదయంపూట ఆక్సిజన్‌ను రాత్రిపూట కార్బన్–డై ఆక్సైడును విడుదలచేస్తాయి. కానీ తులసి, రావి మాత్రం 24 గంటలు ఆక్సిజన్‌ను విడుదలచేస్తాయి. పర్యావరణాన్ని సంరక్షిస్తాయి. వృక్షజాతిలో ఎన్నో విశిష్టలక్షణాలు ఉన్నది తులసి. తులసి ఔషధాల ఖని. తులసి ఆకు మొదలు వేరువరకు ప్రతిభాగము ఆయుర్వేద ఔషధమే. కనుకనే తులసి వాసన వ్యాపించినంతమేరకు దోమలబెడదకూడా ఉండదు. అందుకే పూర్వం ప్రతి ఇంటికి ముందు భాగంలోనూ, పెరటిలోను తులసికోటలు ఉండేవి. తులసిలో విద్యుచ్ఛక్తి ఉందని ఇటీవలే శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ విషయం మన పురాణాలలోనే ఉంది. అందుకే తులసి హైందవుల పవిత్రవృక్షం అయ్యింది.

పూర్వం మన పెద్దలు ప్రతిరోజు తులసికి నీరుపోసి, తులసిని పూజించి, తులసికోట చుట్టు ప్రదక్షిణం చేయమని, తులసితీర్థం తీసుకొమ్మని నిర్దేశించారు. తద్వారా తులసిలోని విశేషమైన ఆ శక్తి మన శరీరంలో ప్రవేశించడం వల్ల శరీరరుగ్మతలన్నీ తొలగిపోతాయి. ఆరోగ్యం చేకూరుతుంది. ప్రతిరోజు తులసిని తినడంవల్ల కంఠసంబంధ వ్యాధులు పూర్తిగా తొలగిపోతాయి. అందుకే తులసిని తులసీదేవి అనీ, తులసిమాత అనీ పిలుస్తున్నాము.

మహాశివునికి బిల్వపత్రం ఎంత ప్రీతిపాత్రమో అంతకంటే ఎక్కువ శ్రీహరికి ప్రీతిపాత్రమైనది తులసి. ఎంత వైభవంగా బంగారు వజ్ర వైడూర్యాదులతో పూజచేసినా తులసిలేని పూజ శ్రీహరిని సంతృప్తి పరచలేదని పురాణాలు చెబుతున్నాయి. తులసి లేకపోయినా కేవలం 'తులసి' అన్న నామాన్ని ఉచ్చరించినాకూడా శ్రీహరి సంతృప్తుడౌతాడు.

శ్రీహరి అలంకారప్రియుడు. ఆయన అలంకారంలో లేదా పూజలో పుష్పాలు లేకపోయినా ఫరవాలేదుకానీ తులసిమాత్రం ఉండితీరవలసినదే. అందుకే గోవింద నామాలలో 'తులసీవనమాల గోవింద' అన్నారు. దీనిని బట్టికూడా విష్ణువు ఆరాధనలో తులసికి ఎంతటి విశిష్టమైన స్థానమున్నదో అర్థమవుతుంది.

**"శ్రీతులసిదివ్యమహిమలు"** అనే ఈగ్రంథంలో తులసీదేవి ఆవిర్భావానికి సంబంధించి పురాణాలలో చెప్పబడిన ఇతివృత్తాలతోపాటు తులసిఅర్చన, తులసి కల్యాణం, తులసీదళ మాహాత్మ్యం, తులసిదేవి ఆరాధన విధానం, తులసి అష్టోత్తర శతనామావళి మొదలైన అనేక విషయాలను సవివరంగా అందించారు రచయిత్రి డా॥ డి.ఉమాదేవిగారు.

ఇటువంటి ఉత్తమ గ్రంథాన్ని భక్త మహాశయులైన పాఠకులు ఆదరిస్తారని మనసారా ఆశిస్తూ...

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


1. పరిచయం 1
2. తులసిఆవిర్భావం - 1 2
3. తులసిఆవిర్భావం - 2 4
   - జననం 4
   - తపస్సు 7
   - పూర్వజన్మవృత్తాంతం 7
4. శంఖచూడుడు 9
   - బ్రహ్మవరాలు 11
   - తులసిని కలుసుకొనుట 12
   - వివాహం 14
   - పూర్వజన్మవృత్తాంతం 15
   - శివుడు దూతను పంపుట 16
   - తులసికి జ్ఞానబోధ 18
   - యుద్ధం 19
   - పాతివ్రత్యభంగం 25
   - శాపవిముక్తి 26
5. సాలగ్రామాలు 30
   - సాలగ్రామభేదాలు 30
   - సాలగ్రామమహిమ 32
6. పురాణాలలో తులసిమహిమ 34
   - శివుడు పార్వతికి చెప్పినతులసిమహిమ 34
   - కుమారుడికి చెప్పినతులసిమహిమ 36
   - విష్ణువు బ్రహ్మకు చెప్పినతులసిమహిమ 38
   - హరిభక్తివిలాసం - తులసిమహిమ 39
   - ఏకాదశీమాహాత్మ్యం - తులసిమహిమ 40
   - మరణసమయంలో తులసి - పద్మపురాణం 41
   - గరుడపురాణం 42

7. తులసీమహిమ – (పురాణ)గాథలు 43

విష్ణుదాసుడు 43

శునకానికి విష్ణులోకప్రాప్తి 46

గోపికలు – తులసి 47

భగవంతునితో సరితూగుతుంది 49

కృష్ణభక్తిప్రదం 51

8. తులసిమందిరాలు – కుజదోషనివృత్తి 53

9. తులసిమహిమ – పురాణవచనాలు 54

10. అర్చనలో తులసి 60

తులసిదళం 60

తులసిగంధం 62

తులసిమాల 63

తులసివనం 63

తులసిసంగ్రహణవిధానం 63

11. తులసిఆరాధన 68

తులసి ఆరాధనవిధానం 68

తులసి అష్టోత్తరశతనామావళి 69

తులసి ప్రదక్షిణం 72

తులసి ప్రణామం 72

సౌభాగ్యవ్రతం – క్షీరాబ్ధిద్వాదశి 72

వ్రతఫలం 74

12. తులసిసంరక్షణ 75

తులసి నాటడం 75

తులసిపోషణం 75

విదేశాలలో తులసి 79

తులసి నామాలు 79

తులసి – ఆరోగ్యగుణాలు 80


# 1. పరిచయం

భారతదేశంలో ప్రతి గృహం ప్రాంగణంలో మనం 'తులసి' అనే దివ్య వృక్షాన్ని చూస్తుంటాం. ప్రతి తల్లి, తండ్రి తమపిల్లలకు చిన్నవయసునుండే తులసిచెట్టుకి నమస్కరించమని నేర్పిస్తూ ఉంటారు. శాస్త్రాలలో మనజీవితం లోని ప్రతిక్షణం తులసితో ముడిపెట్టబడింది. "తులాం సాదృశ్యం స్యతి నాశయ తీతి తులసీః" తులసిని ప్రపంచంలోని ఏవస్తువుతో కూడా పోల్చలేం.

జీవుడు అనంతబ్రహ్మాండంలోని భౌతికసుఖాలను అనుభవించాలన్న కోరికతో ఎల్లప్పుడూ మనస్సుతోనూ, నియంత్రణ లేని ఇంద్రియాలతోనూ పోటీపడుతూ ఉంటాడు. ఆవిధంగా కృష్ణుని నుండి విముఖులైన జీవులను తిరిగి శ్రీకృష్ణునితో కలుపుతుంది తులసి. గోలోకంలో నివసించే శ్రీమతి తులసీదేవి కృష్ణునియొక్క ప్రాణ ప్రేయసి. అనేక శాస్త్రాలలో ఈమె మహిమ వర్ణించబడిఉంది. బృహద్ ధర్మ పురాణం 'శ్రీమతి తులసీదేవి సుందరమైన వదనం కలిగింది. మరియు శ్వేత వస్త్రాలను ధరించింది. ఆమె భగవంతుని భక్తులకు సర్వోత్తమమైన సిద్ధిని ప్రసాదిస్తుంది.' అని చెప్పింది.

భగవంతుని ఆంతరంగిక శక్తియొక్క విస్తార రూపమే ఈజడజగత్తులో తులసి వృక్షంగా ఆవిర్భవించి వివిధవర్ణాలను ధరిస్తున్నది. ఉదాహరణకు హరితవర్ణం, కృష్ణ (నలుపు) వర్ణం, అక్కడక్కడ మిశ్రితవర్ణరూపంలో లభ్యమవుతుంది. జగత్తులో ఏరూపంలో ప్రకటితమైనా, ఎల్లప్పుడూ ఆమె శ్రీకృష్ణభక్తురాలు. ప్రపంచంలో భగవంతునిపట్ల ఆమెభక్తికి సమానమైనది వేరొకటి లేదు.

'తులసి'కి సంబంధించి ముఖ్యంగా రెండు కథలు పురాణాలలో చెప్పబడినవి. మొదటిది క్షీరసాగరమథనసమయంలో అమృతం నుండి తులసియొక్క ఆవిర్భావం (స్కాందపురాణం 2.4.8) కథ. రెండవది

శంఖచూడుని భార్య తులసికథ. ఈకథలను గురించి ఇప్పుడు మనం క్లుప్తంగా తెలుసుకుందాం.

## 2. తులసి ఆవిర్భావం - 1

అత్యంతప్రాచీనకాలంలో కాశ్మీరం అనేప్రదేశంలో సుమేధుడు, హరిమేధుడు అనే ఇద్దరు బ్రాహ్మణులు నివసించేవారు. వారు సుశీలురై, ధార్మిక ప్రవృత్తి కల్గి ఉండేవారు. వారు ఇరువురు ఒకసారి తీర్థయాత్రకు బయలుదేరారు. ఆ తీర్థయాత్రలో వారు ఒక మనోహరమైన, తులసి వృక్షాలతో నిండినవనాన్ని చూశారు. సుమేధ బ్రాహ్మణుడు వెంటనే ఆతోటకు ప్రదక్షిణం చేసి శ్రీతులసీదేవికి నమస్కరించాడు. ఆతోటకు ప్రదక్షిణం చేసిన తరువాత హరిమేధుడు, అతనిని ఇలా ప్రశ్నించాడు– 'సుమేధా! నీవు చాలా శ్రేష్ఠుడివి, మహాతీర్థానికి సమానమైనవాడివి అయి ఉండీ కూడా తులసితోటకు ఎందుకు ప్రదక్షిణం చేస్తున్నావు?' అపుడు సుమేధుడు దగ్గరలో నున్న ఒకమర్రిచెట్టు నీడలో కూర్చొని హరిమేధుడికి శ్రీతులసీదేవి మహిమను చెప్పసాగాడు.

'ఒకసారి దేవరాజైన ఇంద్రుడు దుర్వాసునిశాపంవలన తనఐశ్వర్యాన్ని కోల్పోయాడు. తరువాత భగవంతుని ఆదేశానుసారం దేవతలూ, రాక్షసులూ కలిసి క్షీరసాగరమథనం చేశారు. ఆక్షీరసాగరమథనంలో అనేకమైన వస్తువులు కల్పవృక్షం, చంద్రుడు, శ్రీలక్ష్మీదేవి, ధన్వంతరి మొదలగునవి, చివరిలో అమృతకలశం పుట్టుకొచ్చాయి.

విష్ణుభగవానుడు ఆఅమృతకలశం చూసి అత్యంతప్రసన్నుడైనాడు. ఆస్వామికనులనుండి వెలువడిన ఆనందాశ్రువులలో కొన్నిబిందువులు ఆ అమృతంపై పడినాయి. వెంటనే మండలాకారంలో 'తులసివృక్షం' ఉద్భవించింది.

అపుడు దేవతలందరూ సర్వశుభలక్షణసంపన్నురాలు మరియు దివ్య ఆభరణాలతో అలంకృతురాలూ ఐన తులసీదేవిని విష్ణుభగవానునికి



అర్పించారు. విష్ణుభగవానుడు ఆదరసత్కారాలతో ఆమెను స్వీకరించాడు. అప్పటినుండి తులసీదేవిని విష్ణుభగవానునితో సమానంగా అందరూ పూజించసాగారు. విష్ణుభగవానుడు ఈసంపూర్ణజగత్తుకు మంగళకర్త. శ్రీతులసీదేవి అతని అనన్యప్రేయసి. హరిమేధా! ఈకారణంగానే నేను శ్రీ తులసికి ప్రణామం చేశాను.

ఈవిధంగా సుమేధుడు తులసిమహిమను వర్ణిస్తూ ఉండగా దూరంనుండి ఒక దివ్యవిమానం నేరుగా ఆ వటవృక్ష సమీపానికి వచ్చింది. వెంటనే ఆవటవృక్షం విరిగిపోయింది. దానినుండి ఇద్దరు దివ్యపురుషులు బయటికి వచ్చారు. సుమేధ, హరిమేధులు వారిని ఎవరని అడిగారు. ఈ ప్రశ్న విని వారిలో ఒకరు ఈవిధంగా సమాధానమిచ్చారు. 'నాపేరు ఆస్తికుడు. నేను దేవలోకంలో నివసిస్తూ ఉండేవాడిని. ఒకరోజు సౌందర్యవతి అయిన ఒకఅప్సరసతో కలిసి మదోన్మత్తుడనై నందకాననంలో సంచరిస్తూ ఉన్నాను. అక్కడే లోమశముని తపస్సు చేస్తూ ఉన్నాడు. ఆయన నా ప్రవర్తన చూసి కోపంతో – 'నీవు బ్రహ్మరాక్షసుడివై వటవృక్షంలో నివసించు." అని శాప మిచ్చాడు. నేను మునికాళ్ళపై పడి క్షమించమని వినయంగా ప్రార్థించాను. నాప్రార్థనను మన్నించి మునిశాపవిమోచనం చెప్పాడు – "నీవు ఎవరైనా బ్రాహ్మణుని నోటినుండి శ్రీతులసీమాహాత్మ్యం విననట్లైతే ఈశాపం పోతుంది" అన్నాడు. ఆ ముని శాపకారణంగా చాలాకాలం నుండి నేను ఈవటవృక్షంలో నివసిస్తున్నాను. దైవవశాత్తు ఈరోజు మీనోటినుండి శ్రీతులసిమహిమ విని శాపవిముక్తుడనయ్యాను. నాతో ఉన్న ఈవ్యక్తి గురువుఆదేశాన్ని అగౌరవ పరిచినకారణంగా బ్రహ్మరాక్షసుడిగా మారిపోయాడు. మీఅనుగ్రహం వలన ఇతడు కూడా శాపవిముక్తుడైనాడు. బ్రాహ్మణులారా! మీ తీర్థయాత్రలఫలితం కూడా ఇక్కడే మీకు దక్కింది. అంతేగాక భగవంతునిపట్ల మీభక్తి దినదినమూ పెరుగుతూ ఉంటుంది" అని పలికి ఆఇరువురు సుమేధునకు, హరిమేధునకు నమస్కరించి ఆదివ్య విమానం ఎక్కి తమతమస్థానాలకు వెళ్లిపోయారు.

## 3. తులసి ఆవిర్భావం - 2

నారదమునీంద్రులు ఒకనాడు భగవంతుడు అయిన నారాయణఋషిని "భగవంతుడా! పరమపవిత్రమైన తులసీదేవి మీభార్య ఎలా అయింది? ఆమె ఎక్కడ పుట్టింది? పూర్వజన్మంలో ఆమె ఎవరు? ఏవంశానికి సంబంధించినది? మిమ్ము భర్తగా పొందుటకు ఏమి తపస్సు చేసింది? ఏవిధంగా వృక్షం అయింది? దయచేసి నాసందేహాలను నివృత్తి చేయండి స్వామీ" అని కోరాడు.

### జననం

భగవంతుడైన నారాయణ ఋషి ఇలా వర్ణించసాగాడు – 'దక్షసావర్ణి మనువు విష్ణుభగవానుని అంశ. ఆయన సద్గుణ సంపన్నుడు. తనను తాను భగవంతునికి అర్పించుకున్నాడు. సత్కార్యాలు చేయడంలో సుప్రసిద్ధుడు. దక్షసావర్ణి పుత్రుడు ధర్మసావర్ణి. అతడు కూడా అత్యంత గుణవంతుడు. ధర్మసావర్ణి పుత్రునిపేరు విష్ణుసావర్ణి. ధర్మపరాయణుడు. ఆయనపుత్రుడు గొప్ప వైష్ణవభక్తుడు రాజసావర్ణి.

రాజసావర్ణిపుత్రుడు వృషధ్వజుడు, గొప్ప శివభక్తుడు. శివుడు వృషధ్వజునిఇంట మూడు దేవయుగాలవరకు ఉన్నాడు. అతనిని తన పుత్రులకంటే అధికంగా ప్రేమించాడు. వృషధ్వజునికి నారాయణుడు, లక్ష్మి లేక ఇతర దేవతలపైన కొంచెం కూడా శ్రద్ధాభక్తు లుండేవి కావు. ఎవరినీ గౌరవించేవాడు కాదు. విష్ణుభగవానుని గౌరవార్థం చేసే యజ్ఞయాగాదులలో లేదా పూజలో కూడ పాల్గొనడు. పైగా భగవంతుని కఠోరంగా నిందించేవాడు.

శివునిభయంవలన దేవతలు వృషధ్వజుని శపించలేదు. కాని సూర్యదేవుడు కోపాన్ని ఆపుకోలేక – "ఓ రాజా! నీవు కేవలం శివారాధన మాత్రమే చేస్తున్నావు. ఇతర దేవతలను గౌరవించడం లేదు. అందువలన నీవు నీసంపదను, సమృద్ధిని కోల్పోతావు." అని శాపం ఇచ్చాడు.



ఈశాపం గురించి తెలిసి శివుడు కోపించాడు. త్రిశూలం ఎత్తి సూర్యుని వెనుకపడ్డాడు. భయపడినసూర్యుడు తండ్రి కశ్యపమునితో కలిసి బ్రహ్మను శరణుకోరడంకోసం బ్రహ్మలోకానికి పోయాడు. కాని శివుడు అక్కడికి కూడా వెనుకే వచ్చాడు. శివునిభయంతో బ్రహ్మ కూడా వారినిద్దరినీ వెంట బెట్టుకుని ఆధ్యాత్మికలోకమైన వైకుంఠాన్ని చేరాడు. శరణుకోరి అందరూ నారాయణునికి నమస్కరించారు. నారాయణుని స్తుతించి, తమభయానికి కారణం వివరించారు.

నారాయణుడు వారితో ఇలా చెప్పాడు. మీరు శివునికి భయపడ నవసరం లేదు. బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా ఆయన మనసెపుడూ నన్ను ధ్యానిస్తూ ఉంటుంది. నిరంతరం నాధ్యానంలో రాత్రింబగళ్లూ నిమగ్నమై ఉంటాడు. అదే సమయంలో శివుడు అక్కడికి చేరాడు. ఆయనకళ్లు ఎర్రగా ఉన్నాయి.

శివుడు మొదట నారాయణుడికి నమస్కరించి తదుపరి బ్రహ్మకు ప్రణామం చేశాడు. సూర్యదేవుడు, కశ్యపముని వినమ్రతతో శివునికి నమస్కరించారు. శివుడు నారాయణుని కీర్తించాడు. నారాయణుడు అత్యంత సంతుష్టుడైనాడు. మీరు ఏ కారణంతో ఇక్కడికి ఏతెంచారు అని ప్రశ్నించాడు. శివుడు ఇలా చెప్పాడు. "భగవంతుడా! వృషధ్వజరాజు నాకు పరమభక్తుడు. సూర్యుడు అతనికి శాపమిచ్చినకారణంగా నాకు సూర్యునిపై కోపం వచ్చింది. రాజుపై గల ప్రేమతో సూర్యుని చంపాలనుకునేంతలో సూర్యుడు బ్రహ్మదేవుని ఆశ్రయించాడు. ఇప్పుడు వారిద్దరూ మీసంరక్షణలో ఉన్నారు. మీఆశ్రయం పొందినవారిని గురించి నేనేమీ మాట్లాడను. మీస్మరణ చేసేవారు అన్ని సంకటాలనుండి విముక్తులు అవుతారు. స్వామీ! నాభక్తునిపరిస్థితి ఏమిటి? సూర్యునిశాపంవలన సంపదను, సమృద్ధిని కోల్పోయాడు.

విష్ణుభగవానుడు ఈవిధంగా సెలవిచ్చాడు, 'శివా! ఇక్కడ వైకుంఠంలో అరగంట గడిచింది. అనగా భూలోకంలో 21 దేవయుగాలు గడిచాయి.

అందువల్ల వృషధ్వజుడు తనకష్టసమయాన్ని అనుభవించి స్వర్గస్థుడైనాడు. ఆయనకుమారుడు హంసధ్వజుడు కూడా పరమపదించాడు. హంసధ్వజునికి, కుశధ్వజునికి సర్వశ్రేష్ఠగుణాలు కలిగినపుత్రులు జన్మించారు. వారిరువురు గొప్ప విష్ణుభక్తులు, కాని సూర్యుని శాపంవలన దురదృష్టవంతులైనారు. వారు తమ సంపద, సమృద్ధితో రాజ్యాన్ని కూడా కోల్పోయారు. ఇప్పుడు వారు లక్ష్మీదేవిని ఆరాధిస్తున్నారు. ఆమె కూడా వారిభక్తికి ప్రసన్నురాలైంది. అందువలన లక్ష్మీదేవి వారిసంతానంగా భూమిపై అవతరించడానికి అంగీకరించింది. లక్ష్మీదేవికృపవలన ధర్మధ్వజుడు, కుశధ్వజుడు సంపదను, ఐశ్వర్యాన్ని, బలాన్ని పొంది గొప్పవాళ్లవుతారు. శివా! మీ భక్తుడైన వృషధ్వజుడు మరణించాడు. కావున మీరు మీలోకానికి తిరిగి వెళ్లండి." శివుడు, మిగిలినదేవతలు వారివారినివాసస్థానాలకు వెళ్లిపోయారు.

ధర్మధ్వజుడు, కుశధ్వజుడు కఠోరతపస్సు, లక్ష్మీదేవిఆరాధన చేసిన తరువాత, ఆమెకృపవలన తిరిగి భూలోకానికి రాజులయ్యారు. గొప్ప ఆధ్యాత్మికగుణాలను సంపాదించుకున్నారు. ధర్మధ్వజునివివాహం 'మాధవి' అనేకన్యతో జరిగినది. కొంతకాలం తరువాత లక్ష్మీదేవి అంశతో మాధవి గర్భం దాల్చింది. ఆశిశువు మాధవిగర్భంలో నూరు దేవసంవత్సరాలవరకు ఉండిపోయింది.

దినదినమూ మాధవి కాంతి పెరుగుతూ వచ్చింది. కార్తికపూర్ణిమ శుక్రవారంరోజు ఆమె అద్భుతసుందరి యైనకన్యకు జన్మనిచ్చింది. సంపదకు నిలయమైన లక్ష్మీదేవి వారికి కన్యరూపంలో అవతరించింది. ఆసుందర కన్య పాదంలో కలువపూలచిహ్నాలున్నాయి. ఆమెముఖం శరత్కాలచంద్రుని బోలి ఉన్నది. ఆమెకనులు వికసించినకలువపూలవలె ఉన్నాయి. మొత్తంమీద ఆమెసౌందర్యం అద్వితీయమైనది, అసాధారణమైనది. సాధుపురుషులు ఆమెకు 'తులసి' అని నామకరణం చేశారు.



## తపస్సు

తులసి నారాయణుని పతిగా పొందవలెనని నిశ్చయించుకొని తపస్సు చేయుటకు బదరీనాథపర్వతప్రదేశానికి వెళ్లవలెనని సంకల్పించింది. చాలా మంది ఆమెను ఆపడానికి ప్రయత్నించారు, కాని ఎవ్వరివల్ల సాధ్యం కాలేదు. శ్రీకృష్ణభగవానుడు ప్రత్యక్షమై తనకు భర్త కావడానికి అంగీకరించేంతవరకు తపస్సు చేయా లని ఆమె దృఢనిశ్చయంతో ఉన్నది. ఒకలక్షదేవసంవత్సరాలు చాలా ధైర్యంగా తపస్సు చేసింది.

ఎండాకాలంలో నాల్గువైపులా అగ్నిని రగిలించుకుని మధ్యలో తాను నిలబడింది. చలికాలంలో శరీరాన్ని మంచువంటి చల్లనినీటిలో ముంచి ఉంచింది. వర్షాకాలంలో శ్మశానంలో భయంకరమైన వర్షంలో నిలబడింది. 20,000 సంవత్సరములు పండ్లు, నీటిపై ఆధారపడి జీవించింది. 30,000 సంవత్సరాలు ఎండుటాకులు తిని బతికింది. 40,000 సంవత్సరాలు కేవలం వాయువుపైన ఆధారపడింది. 10,000 సంవత్సరములు ఏమీ తినలేదు, అంతేకాక ఒంటికాలిపై నిలుచుని తపస్సు చేసింది.

చిట్టచివరికి బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. తులసి ప్రణామాలు చేసింది. బ్రహ్మ ఇలా అన్నాడు – 'తులసీ! భగవంతునిపట్ల ప్రేమతో కూడినభక్తి కావలెనా! లేక జరామరణాలనుండి ముక్తియా! ఏమి కావాలో కోరుకో అన్నాడు. అప్పుడు తులసి "బ్రహ్మదేవా! అలాగే కోరుకుంటాను కానీ దయచేసి నామనవి వినండి.

## పూర్వజన్మవృత్తాంతం

నాపేరు తులసి. నేను గోలోకంలో ఒకగోపికను. అక్కడ నేను శ్రీకృష్ణుని ప్రేయసియైన రాధారాణికి సేవ చేసేదాన్ని. నేను రాధారాణికి అతిప్రియమైన స్నేహితురాలను కూడా. కాని ఒకరోజు రాసనృత్యసమయంలో కృష్ణుడు నాకు చాలా సన్నిహితుడైనాడు. అది చూసి రాధారాణి నన్ను భూలోకంలో

జన్మించమని శపించింది. అప్పుడు కృష్ణుడు నాతో 'నీవు భరతభూమిలో జన్మించి తపస్సు చేయి, బ్రహ్మ నీకు వరమిస్తాడు. నారూపమైన చతుర్భుజ నారాయణుడు నిన్ను వివాహమాడుతాడు'. అన్నాడు.

"అందువలనే నేను ఈలోకమున జన్మించితిని. సుందర, శాంత స్వభావు డైననారాయణుని నేను భర్తగా పొందవలెనని కోరుకుంటున్నాను దయచేసి నాకు ఆవరాన్ని ప్రసాదించండి." అని వేడుకొంది.

బ్రహ్మ ఈవిధంగా బదులిచ్చాడు, "తులసీ! సుధాముడు కృష్ణునియొక్క గోలోకంలో కృష్ణుని స్నేహితులైన గోపబాలురలో ఒకడు. రాధారాణి ఇచ్చిన శాపంవలన ప్రస్తుతం అతడు రాక్షసుడుగా జన్మించాడు. పేరు శంఖచూడుడు. చాలా ఉత్సాహవంతుడు, తేజస్సు కలవాడు, బలశాలి. గోలోకంలో ఉన్నపుడు నీపై మనస్సుపడ్డాడు. నిన్ను వివాహమాడదలచాడు. కాని అతనికి రాధారాణి అంటే భయం. అందువలన నీఎదుట ప్రస్తావించ లేదు. శంఖచూడుడు కూడా నిన్ను పొందాలనే పూర్వజన్మలోనికోరికను స్మరించుకుంటూ, నిన్ను భార్యగా పొందుటకు ఘోరమైన తపస్సు చేశాడు. కావున సుందరీ! అతనిని వివాహమాడు."

దేవతలసహకారంతో తరువాత కాలంలో నీకు నారాయణుడు భర్తగా లభిస్తాడు. ఆయన నీకు శాపమిస్తాడు. అప్పుడు నీవు ఈజగత్తును పవిత్రం చేయగలిగే తులసిమొక్కరూపం ధరిస్తావు. అన్నింటిలోనూ శ్రేష్ఠురాలివిగా ఉంటావు. నారాయణుడికి ప్రాణంకంటే ఎక్కువగా ప్రీతిపాత్రురాలివి కాగలవు. భగవంతునిపూజ నీపత్రాలు లేకుండా సంపూర్ణం కాదు. నీవు బృందావనంలో ఒక వృక్ష రూపంలో ఉండి 'బృందావని' అనేపేరుతో ప్రసిద్ధి చెందుతావు. గోపబాలురు గోపికాస్త్రీలు మాధవుని నీపత్రాలతో ఆరాధిస్తారు. తులసిమొక్కరూపంలో – గోపబాలురలలో శ్రేష్ఠుడైనశ్రీకృష్ణుడితో కలిసి విహారం చేసేఆనందాన్ని ఎప్పుడూ నీవు అనుభవిస్తావు.



తులసీదేవి అత్యంతసంతోషంగా బ్రహ్మతో ఇలా అన్నది – 'ఓ తండ్రీ! నేను సత్యమే చెబుతాను. నాకు చతుర్భుజనారాయణునిపై కన్నా ద్విభుజుడైన కృష్ణునిపట్ల ప్రేమ, భక్తి ఎక్కువ. నేను ఆయనకోసం ఉవ్విళ్లూరుతున్నాను. ఇప్పుడు నేను మీదయవలన ఖచ్చితంగా శ్రీకృష్ణుని పొందగలనని ఆశిస్తున్నాను. లేకపోతే ఆయనను పొందటం అత్యంతదుర్లభం. బ్రహ్మదేవా! దయచేసి మీరు నామనసులో రాధారాణిపట్ల నున్నభయాన్ని తొలగించే వరాన్ని ప్రసాదించండి.'

అప్పుడు బ్రహ్మ – "తులసీ! నేను నీకు పదహారు అక్షరాలు గల రాధా మంత్రాన్ని ఉపదేశిస్తాను. దీనివలన రాధారాణికి నీవు ప్రాణసఖివి కాగలవు. శ్రీకృష్ణునితో నీకు గల సంబంధాలకు కూడా ఆమె అనుమతి లభిస్తుంది." అన్నాడు.

బ్రహ్మ పదహారు అక్షరాలమంత్రాన్ని, శ్రీరాధాస్తుతి మరియు ఆమె పూజావిధానాన్ని తులసీదేవికి ఉపదేశించాడు. పిమ్మట తులసిని ఆశీర్వదించి అదృశ్యుడైనాడు. బ్రహ్మ చెప్పినప్రకారం తులసి 12 సంవత్సరములు శ్రీమతి రాధారాణిని ఆరాధించింది. మరెవ్వరికీ లభ్యంకానివరాలను పొందగలిగింది.

## 4. శంఖచూడుడు

కశ్యపప్రజాపతి మరీచికుమారుడు. బ్రహ్మదేవునిమనుమడు. గొప్ప పండితుడు. కశ్యపమునిభార్యలలో ఒకరైన దనువు అత్యంత పవిత్ర ఐనది. సుందరి. కశ్యపముని ప్రేమనిష్ఠలతో ఆమెపట్ల అత్యంతధ్యానం చేసేవాడు. దనువు బలవంతులైన అనేకమంది పుత్రులకు జన్మనిచ్చింది. అందులో విప్రచిత్తి అత్యంతశక్తిశాలి మరియు సాహసవంతుడు. అతనికుమారుడు దంభుడు గొప్ప విష్ణుభక్తుడు. పుత్రసంతానం లేనందువలన చింతిస్తూ

ఉండేవాడు. అందుకోసం పుష్కరప్రాంతపుఅడవికి వెళ్లి లక్షసంవత్సరాలు కృష్ణమంత్రాన్ని జపిస్తూ ఘోరమైనతపస్సు చేశాడు.

ఆసమయంలో ఒకపెద్దకాంతిపుంజం దంభునితలపైనుండి వేగంగా వచ్చి నలుదిశలా వ్యాపించింది. దానివేడికి సమస్తదేవతలు, సాధుపురుషులు వాడిపోసాగారు. ఇంద్రునినాయకత్వంలో అందరూ బ్రహ్మదేవునిఆశ్రయం కోసం వెళ్లారు.

అందరూ బ్రహ్మలోకానికి వెళ్లి బ్రహ్మదేవుని స్తుతిస్తూ తమస్థితిని తెలియపర్చారు. బ్రహ్మదేవుడు అంతా విని విష్ణుభగవానునికి ఈసమస్య వివరించవలెనని, అందరినీ తీసుకొని వైకుంఠానికి తరలివెళ్లాడు. అక్కడ రెండుచేతులూ జోడించి మూడులోకాలకు రక్షకుడైన విష్ణుభగవానుని శ్రద్ధాభక్తులతో స్తుతించాడు. దేవతలందరూ ఆయనను ఇలా ప్రార్థించారు – "స్వామీ! ఎవరికారణంగా ఇలా జరిగిందో దయచేసి చెప్పండి. మేము ఇలా వాడిపోవటానికి కారణమైన ఆవెలుగు ఏమిటి?"

విష్ణుభగవానుడు చిరునవ్వు నవ్వి ప్రేమగా ఇలా చెప్పాడు. 'దేవతలారా! భయపడకండి. శాంతంగా, స్థిరంగా ఉండండి. వరదలు రావు, ప్రళయం వచ్చేసమయమూ కాదు. నాభక్తులలో ఒకడైన దంభుడను అసురుడు పుత్రుడికోసం తపస్సు చేస్తున్నాడు. అతనికి తొందరలోనే నేను వరమివ్వ దలచాను, దానితో అతడు శాంతిస్తాడు.'

ఇది విని సంతోషంతో దేవతలు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లారు. విష్ణుభగవానుడు దంభుడు తపస్సు చేస్తున్న పుష్కరవనానికి వెళ్లాడు. దంభుడు భగవంతునినామజపం చేస్తున్నాడు. భగవంతుడు అతనిని ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు.

దంభుడు భగవంతునికి నమస్కరించి ఇలా కీర్తించాడు. 'కమలనయనా! లక్ష్మీపతీ! త్రిలోకాధిపతీ! నన్ను కనికరించండి. బలశాలి, సాహసి ఐన



పుత్రుని ఇవ్వండి. అతడు మీభక్తుడై ఉండాలి. ముల్లోకాలను జయించ గలిగేవాడై ఉండాలి.'

విష్ణుభగవానుడు అలాగే అని చెప్పి, అతనితపస్సును ఆపమని, ఆశీర్వదించి అదృశ్యుడైనాడు. భగవంతుడు అదృశ్యుడైనదిశకు దంభుడు నమస్కరించి గృహానికి తిరిగి వచ్చాడు. కొలదికాలంలోనే అతనిభార్య గర్భం దాల్చింది. ఆమెనుండి వెలువడేకాంతివలన ఆమెనివాసస్థానంలోని గదులన్నీ ప్రకాశవంతమైనవి. ఆమెగర్భస్థశిశువు ఆత్మ కృష్ణభగవానునికి ఇష్టులైన గోపబాలురలో ఒకరైన సుధాముడే.

దంభునిభార్య ప్రసన్నవదనుడైన బాలునికి జన్మ నిచ్చినవెంటనే దంభుడు సాధువులను ఆహ్వానించి శిశుజన్మ అనంతరం చేయవలసినకార్యాలన్నీ నిర్విఘ్నంగా జరిపించాడు. అతనికి శంఖచూడు డని నామకరణం చేశాడు.

శంఖచూడుడు బాల్యంలోనే సమస్తసంప్రదాయాలు, ఆచారాలు, నియమాలు, సుగుణమార్గాలు అన్నీ నేర్చుకున్నాడు, అతడు ఎంతో తేజస్సుతో ప్రకాశించేవాడు. బాల్యక్రీడలతో తల్లితండ్రులనే గాక సమస్తపరిచారకులకు సంతోషాన్ని కల్గించేవాడు.

## బ్రహ్మవరాలు

శంఖచూడుడు బ్రహ్మనుండి వరం పొందుటకు పుష్కరప్రాంతానికి వెళ్లి, మనసును కేంద్రీకరించి, ఇంద్రియాలను నిగ్రహించి, తనగురువు జైగీషవ్యుడు ఉపదేశించినమంత్రం జపిస్తూ, చాలాకాలం తపస్సు చేశాడు. చివరికి బ్రహ్మ ప్రత్యక్షమై శంఖచూడుడిని ఏమి వరం కావాలో కోరుకో మన్నాడు.

బ్రహ్మదేవుడిని చూసి వినయంగా నమస్కరించి, ప్రియమైనవాక్కులతో స్తుతించి, 'దయచేసి నన్ను దేవతలకు అజేయుడుగా మరియు తులసిని వివాహమాడుటకు యోగ్యునిగా చేయండి' అన్నాడు.

బ్రహ్మదేవుడు 'తథాస్తు' అని దీవించి శంఖచూడునికి కృష్ణభగవానుని దివ్యకవచాన్ని ప్రసాదించాడు. సర్వమంగళమయమని పిలువబడే ఆకవచం ప్రపంచంలో ఉండే మంగళకరమైన వస్తువులన్నింటిలోనూ అత్యధిక మంగళకరమైనది. ఆకవచం ఎల్లప్పుడూ విజయాన్ని చేకూరుస్తుంది. ఇప్పుడు నీవు బదరికాశ్రమానికి వెళ్లు. తులసి అక్కడ తపస్సు చేస్తున్నది అని చెప్పి బ్రహ్మదేవుడు అదృశ్యుడైనాడు.

శంఖచూడుడు తపస్సు ఫలితంగా లభించినకవచాన్ని ధరించి సంతోషంగా, బదరికాశ్రమానికి బయలుదేరాడు. అచ్చట తపస్సు చేస్తున్న తులసిని చూశాడు.

**తులసిని కలుసుకొనుట**

శంఖచూడుడు ఇలా అన్నాడు – 'సుందరీ! నీవు ఎవరి పుత్రికవు? ఈ అడవికి ఎలా వచ్చావు? నీవు అత్యంతభాగ్యవంతురాలిగా, సౌభాగ్యశాలిగా కన్పిస్తున్నావు.'

సుందరనేత్రములు కల తులసి ఈవిధంగా అన్నది – 'నేను ధర్మధ్వజ రాజుపుత్రికను. తపస్సు చేయుటకు ఇక్కడకు వచ్చితిని.'

శంఖచూడుడు చిరునవ్వు నవ్వి, "ఒక గుణవంతుడైనవ్యక్తి ప్రజల సమక్షంలో కాని, ఏకాంతంలో కాని, వేరొకరిభార్యతో ప్రేమగా వ్యవహరించడు. అప్రియఫలితములు ఇచ్చే ఏపని చేయడు. నేను బ్రహ్మ ఆదేశం అనుసరించి నిన్ను గాంధర్వపద్ధతిలో వివాహమాడుటకై వచ్చాను. నాపేరు శంఖచూడుడు. పూర్వజన్మలో నేను గోలోకంలో నివసించే సుధాముడనే గోపబాలుడను. శ్రీకృష్ణుడిసేవకులందరిలోనూ నేను శ్రీకృష్ణుడికి ప్రియమిత్రుడను. ప్రసిద్ధమైనఅష్టగోపబాలురలో నేనూ ఒకడిని. శ్రీమతి రాధారాణి నన్ను భరతఖండంలో ఒకరాక్షసకుటుంబంలో జన్మించమని శాప మిచ్చింది." అని చెప్పాడు.



అప్పుడు తులసి చిరునవ్వు నవ్వి, ప్రసన్నచిత్తంతో ఇలా అన్నది – "మీరు ఈప్రపంచంలో చాలా ప్రసిద్ధమైనవారు. మంచిస్త్రీలు మీలాంటి వారిని భర్తగా కావాలని కోరుకుంటారు. మీరు ఎంత జ్ఞానవంతులో తెలుసుకోవడానికే నేను పరీక్ష చేశాను. పురుషునిగుణగణాలు మరియు దోషాలు పరీక్షచేసినతరువాతనే స్త్రీ అతనిని భర్తగా ఎంచుకోవాలి. ఒకవేళ ఎవరైన తమపుత్రికవివాహం యోగ్యత లేనివాడు, ముసలివాడు, అజ్ఞాని, పేదవాడు, చదువు లేనివాడు, రోగిష్ఠి, కురూపి, క్రోధి, కఠినాత్ముడు, దయ లేనివాడు, గుడ్డివాడు, కుంటివాడు, చెవిటివాడు, మూగవాడు, నపుంసకుడు మొదలగు వారికిచ్చి చేసినట్లైతే బ్రహ్మహత్య చేసినపాపం వస్తుంది. కాని యోగ్యుడు, శాంతస్వభావము కలవాడు, యౌవనవంతుడైన వైష్ణవునికిచ్చి చేసినట్లైతే దశ అశ్వమేధయజ్ఞాలు చేసినఫలితం దక్కుతుంది. కూతురిని పెంచి, పెద్దచేసి, దురాశతో లాభానికి అమ్మినవారు కుంభీపాకనరకానికి వెళతారు. అక్కడ అలాంటిపాపులు ఇంద్రునికి 14 జీవనకాలాలతో సమానమైన కాలంవరకు తనపుత్రికమూత్రాన్ని తాగవలసిఉంటుంది, మలాన్ని తినవలసి వస్తుంది. అంతేకాకుండా కాకులు, కీటకాలు కరుస్తాయి. శిక్షాకాలం పూర్తి అయిన తరువాత రోగిష్ఠిరూపంలో జన్మనెత్తి, మాంసం అమ్ముకుంటూ జీవనం గడపవలసిఉంటుంది'.

తులసీదేవి మాట్లాడటం పూర్తికాగానే బ్రహ్మ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. శంఖచూడుడు, తులసీదేవి చేసినగౌరవసత్కారాలు స్వీకరించినపిదప బ్రహ్మ ఇలా అన్నాడు.

'శంఖచూడా! నీవు తులసితో మాట్లాడుతూ నీసమయాన్ని ఎందుకు వ్యర్థం చేస్తున్నావు. గాంధర్వవిధిలో ఇప్పుడే ఆమెను వివాహమాడు. నీవు పురుషులలో రత్నం. ఆమె కూడా స్త్రీలలో అందమైన, గుణవంతురాలైన, అమూల్యమైన గొప్పరత్నం. నేర్పరులు, బుద్ధిమంతులైన స్త్రీపురుషుల కల్యాణం జరిగితే వారికలయిక సంతోషంగా ఉంటుంది.

అటువంటిసంతోషం ప్రాప్తిస్తే దానిని ఎవరు వదులుకుంటారు. ఆ వ్యక్తి జంతువుకంటే హీనుడు. తులసీ! దేవదానవులను ఓడించగల శ్రేష్ఠ గుణములుగల యోగ్యు దైనవ్యక్తిని ఎందుకు పరీక్షిస్తున్నావు? లక్ష్మి నారాయణుడిని, రాధిక కృష్ణుడిని, సరస్వతి నన్ను, శచీదేవి ఇంద్రుని, అదితి కశ్యపమునిని వివాహమాడినవిధంగా నీవు శంఖచూడుని పెళ్లి చేసుకో. చాలాకాలం అతనితో కలిసి వివిధప్రదేశాలు ప్రయాణం చేయి. శంఖచూడుడు శరీరాన్ని త్యజించగనే నీవు గోలోకానికి వెళ్ళి శ్రీకృష్ణుని భర్తగా పొందుతావు, అంటూ బ్రహ్మ వారిని ఆశీర్వదించి తనస్థానానికి తిరిగి వెళ్లిపోయాడు.

## వివాహం

శంఖచూడుడు గాంధర్వవిధిలో తులసిని వివాహం చేసుకున్నాడు. ఆవివాహసమయంలో దేవతలు మృదంగాలను వాయించారు. పూలవర్షం కురిపించారు.

తులసి చాలా తేలికగా భర్తహృదయాన్ని ఆకర్షించింది. అదేవిధంగా శంఖచూడుడు కూడా తులసిహృదయాన్ని ఆకర్షించాడు. తులసి తనపతికి పారిజాతపుష్పాలహారాన్ని మెడలో వేసింది. అమూల్యమైన రత్నాలు పొదిగిన ఉంగరాన్ని అతనివ్రేలికి తొడిగింది. అంతేగాక అసామాన్యమైన, దుర్లభమైన సుందర మణిరత్నాలను కానుకగా సమర్పించింది.

శంఖచూడుడు చిరునవ్వు నవ్వి తాను వరుణునిదగ్గరినుండి తెచ్చిన వస్త్రాలను, విలువైన రత్నాలహారాన్ని తులసికి ఇచ్చాడు. స్వాహాదేవి (అగ్నిదేవునిభార్య) నుండి తెచ్చిన కేయూరం, ఛాయ (సూర్యదేవునిభార్య) నుండి పొందినకేయూరం, రోహిణి (చంద్రునిభార్య)నుండి లభ్యమైన కర్ణకుండలాలు, రతి (కామదేవునిభార్య) నుండి పొందిన అంగులీయకాలు, విశ్వకర్మనుండి ప్రాప్తించినభూషణాలు మరియు ముత్యాలు, రత్నాలచే అలంకృతమైన ఉత్తమమైన శయ్య కూడా ఇచ్చాడు.



వారిద్దరూ తమకుటీరాన్ని వదిలి విభిన్నప్రదేశాలకు విహారయాత్రకు బయలుదేరారు. పర్వతాలు, ఉద్యానవనాలు, గుహలు, సముద్రం, నదీతీరాలు, అడవులు దర్శించారు.

ఒకమన్వంతరం తర్వాత శంఖచూడుడు సమస్తదేవతలు, దానవులు, గంధర్వులు, కిన్నరులు, రాక్షసులపైన అధికారాన్ని సాధించాడు. దేవతల రాజ్యాన్ని కైవసం చేసుకున్నాడు. ఆరాధనకు సంబంధించిన సమస్త అధికారాలనుండి వారిని దూరం చేశాడు. వారిఅస్త్రశస్త్రాలను కైవసం చేసుకున్నాడు. ఫలితంగా వారు బ్రహ్మాండంలో బిచ్చగాళ్ళవలె అటూ ఇటూ తిరుగసాగారు. చివరికి అందరూ కలిసి బ్రహ్మదేవునిదగ్గరికి వెళ్లారు. శంఖచూడుడు చేసేఅత్యాచారాలను వివరించారు. బ్రహ్మదేవుడు వారందరిని శివలోకానికి తోడ్కొని వెళ్లి, ఈవిషయాన్ని శివునికి వివరించాడు.

శివుడు వారందరినీ వైకుంఠానికి తీసుకువెళ్లాడు. బ్రహ్మ మరియు దేవతలు విష్ణుభగవానునికి ప్రణామాలు సమర్పించుకున్నారు. అప్పుడు వారికన్నులనుండి నీరు కారసాగింది. భావావేశంతో గొంతు బొంగురు పోయింది. అపుడు బ్రహ్మదేవుడు రెండుచేతులు జోడించి శంఖచూడుడు చేసేఅకార్యాలను వారికి వివరించాడు.

## పూర్వజన్మవృత్తాంతం

అపుడు హరి చిరునవ్వుతో – 'బ్రహ్మదేవా! నాకు అన్నీ తెలుసు. అతను పూర్వజన్మలో నాకు గొప్పభక్తుడు. అతనిపేరు సుధాముడు. నాకు ముఖ్యసేవకుడు. గోలోకంలో రాధ ఇచ్చినశాపం ఫలితంగా ఇప్పుడు అతడు రాక్షసుడు అయ్యాడు.

ఒకసారి నేను రాధను వదిలి, విరజ అనేగోపికతో రాసనృత్యానికి వెళ్లాను. నేను విరజతో చేసినప్రేమకలాపం ఒకగోపిక ద్వారా రాధకు తెలిసింది. అది నిజమా, అబద్ధమా అని తెలుసుకొనేందుకు వెంటనే రాధ

తనపరిచారికలతో కలిసి అక్కడకు వచ్చింది. నిజమని తెలిసి విరజను ఒక నది రూపంలోకి మార్చివేసింది. నేను అక్కడినుండి అదృశ్యమైనాను.

అపుడు రాధ నన్ను ఎక్కువగా నిందించినా నేను శాంతంగా ఉండటం సుధాముడు చూశాడు. ఇది సుధాముడికి నచ్చక, నాసమక్షంలోనే రాధను నిందించాడు. అలా నిందించడంవల్ల ఆమెప్రతిష్ఠకు భంగం కల్గింది. కనులు ఎర్రబడ్డాయి. అప్పుడు రాధపరిచారికలు సుధాముడిని అక్కడనుండి వెళ్లగొట్టడానికి ప్రయత్నించారు, అతడు వెళ్లకుండా తిరిగి రాధను నిందించసాగాడు. అపుడు రాధ అతనికి "ఒకరాక్షసస్త్రీగర్భములో జన్మించెదవు గాక" అని శాపమిచ్చింది.

దేవతలారా! కుశలుడు, యోగి అయిన శంఖచూడుడు గోలోకానికి తప్పక తిరిగి వస్తాడు. మీరు నా త్రిశూలాన్ని భూలోకానికి తీసుకొని వెళ్లండి. మహాశివుడు ఆరాక్షసుడిని త్రిశూలంతో వధిస్తాడు. కాని రాక్షసుడు తన కంఠంలో శుభకరమైన, మంగళమయమైన కవచాన్ని ధరించిఉన్నాడు. అతనికి "విశ్వవిజేత" అని పేరు. నాకవచాన్ని ధరించినంతకాలం అతనిని ఎవరూ చంపలేరు. అందువలన నేను ఒకబ్రాహ్మణునివేషంలో అతనిదగ్గరకు వెళ్లి కవచాన్ని భిక్షగా కోరతాను.

దేవతలు ఇలా అన్నారు – 'అతనిభార్య పాతివ్రత్యం భంగం కానంతవరకు అతనికి మరణం లేదని మీరే వరమిచ్చితిరి కదా.' భగవంతుడు ఇలా చెప్పాడు. "ఇది నేను మనసులో ఉంచుకున్నాను. తప్పకుండా అతనికి మృత్యువు ప్రాప్తిస్తుంది. అతనిభార్య తనదేహాన్ని త్యాగం చేసినవెంటనే నాకు అత్యంతప్రీతిపాత్రురా లైనభార్య అవుతుంది", అని చెప్పి నారాయణుడు తనత్రిశూలాన్ని శివునికి సమర్పించాడు. బ్రహ్మ, మిగిలినదేవతలు తమ తమనివాసస్థలాలకు తిరిగివెళ్లారు.

## శివుడు దూతను పంపుట

దేవతలకు విజయాన్ని సాధించడంకోసం శివుడు ఒకసుందరమైన అంజీరవృక్షం క్రింద, పుష్పభద్రనదీతీరాన విడిది చేశాడు. గంధర్వులకు నాయకుడైన పుష్పదంతుడిని దూతగా శంఖచూడునిదగ్గరకు పంపాడు. పుష్పదంతుడు శంఖచూడునిరాజధానికి వచ్చి చూడగా అది ఇంద్రునిరాజ్యం కంటే అందంగా, కుబేరునిరాజ్యంకంటే వైభవంగా, సమృద్ధిగా ఉన్నది. అక్కడ రాజదర్బారుమధ్యలో మంచివ్యక్తిత్వం కల అందమైనరాక్షసుడు బంగారుసింహాసనంపై కూర్చొనిఉన్నాడు. ఒకసేవకుడు రాజుకు రత్నాల గొడుగును పట్టగా, మిగిలినసేవకులు వింజామరలు వీస్తున్నారు. అనేకమంది రాక్షసులు అతనిని చుట్టిఉన్నారు. ద్వారపాలకులు అటూ ఇటూ తిరుగుతున్నారు. శంఖచూడుడు దేవతావస్త్రాలను, హారాలను ధరించి సుగంధలేపనంతో అత్యంతసుందరంగా ఉన్నాడు.



దూతగా వచ్చినపుష్పదంతుడు ఇదంతా చూసి ఆశ్చర్యపడ్డాడు. "మీరు దేవతలకు వారిరాజ్యాన్ని, అధికారాన్ని తిరిగి ఇస్తే మంచిది. విష్ణుభగవానుడు తనత్రిశూలాన్ని శివునికి ఇచ్చి అవసరమైతే యుద్ధం చేయమని ఆదేశించాడు. ఇప్పుడు శివుడు పుష్పభద్రనదీతీరంలో ఒకఅంజీరవృక్షంక్రింద విడిది చేసి ఉన్నాడు. మీరు దేవతలసంపదను వారికి ఇవ్వండి, లేదా శివునితో యుద్ధానికి సన్నద్ధులు కండి." అని చెప్పాడు.

అసురుడు అట్టహాసం చేసి 'నీవిక్కడ నుండి వెళితే మంచిది. రేపు ఉదయాన నేను శివుణ్ణి కలుస్తాను' అన్నాడు.

ఆదూత శివునిదగ్గరికి వెళ్లి అసురసందేశాన్ని వినిపించాడు. అంతలో కార్తికేయుడు, నంది, మహాకాలుడు, బాణుడు, మణిభద్రుడు, అష్టభైరవులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ద్వాదశ ఆదిత్యులు, ఇంద్రుడు, అగ్నిదేవుడు, చంద్రుడు, విశ్వకర్మ, అశ్వినీకుమారు లిరువురు, కుబేరుడు, యముడు, జయంతుడు, నలకూబరుడు, వాయుదేవుడు, వరుణదేవుడు, బుద్ధుడు, మంగళ, ధర్మ, ఉగ్రచండి, శని, కుఠారి, సహస్రభుజాలు కలిగిన భద్రకాళి మరియు తదితరదేవతలందరూ శివునియెదుట ప్రత్యక్షమైనారు.

మహాబలుడైన శంఖచూడుడు తనరాణివాసమునకు వెళ్లి, సమీప భవిష్యత్తులో జరుగబోయేయుద్ధం గురించి తులసికి వివరించాడు. ఇది విని తులసి చాలా బాధపడింది.

## తులసికి జ్ఞానబోధ

రాజు తనభోజనానంతరం తులసికి జీవితసత్యాన్ని వివరిస్తూ ఇలా అన్నాడు – 'నారాణీ, మనిషికి పూర్వజన్మఫలం అనుభవించేసమయం ఆసన్న మైనపుడు అతనికి మంచి–చెడు, సుఖము–దుఃఖము, ఆనందము–బాధ యొక్క అనుభవం కలుగుతుంది. మొక్క మొలవడం, శాఖలు ఏర్పడడం, పూలు వికసించడం ఫలములు రావడం అన్నీ సమయానికే జరుగుతాయి. ఫలములతో నిండినవృక్షమైనా సమయానికి నశిస్తుంది. అదేవిధంగా సమయం వచ్చినప్పుడే సృష్టికర్త సృష్టించడం, సంరక్షకుడు సంరక్షించడం, వినాశకర్త నాశనం చేయడం వంటిది జరుగుతుంది. ఇదే సృష్టి, సంరక్షణ, వినాశనాలనియమం. అందువలన నీవు ఎల్లప్పుడూ కృష్ణభగవానునియందు శ్రద్ధాభక్తులను, ప్రేమను కలిగిఉండాలి. ఎందుకంటే ఆయన సృష్టికర్త, పాలకుడు మరియు సంహారకుడు. ఆయనకు అంతం కానీ, ఆరంభం కానీ లేవు. కృష్ణభగవానుడు తనకోరికవల్లనే ఈప్రకృతిని, చరాచరజగత్తును సృష్టించాడు.

గడ్డిపోచ మొదలుకొని బ్రహ్మవరకు అన్నీ కృత్రిమమైనవి, అశాశ్వత మైనవి, సమయానికి వృద్ధిచెందటం మరియు నాశనమవడం జరుగుతుంది. కనుక నీవు రాధారాణి ప్రేమికుడైన కృష్ణభగవానుని అధికముగా ప్రేమించు. ఆయన ప్రకృతిపరమైన త్రిగుణాలకు అందనివాడు, అందరిమనసులో పరమాత్మగా నివసించేవాడు. అందరికీ స్వామి.

ఆయనఆజ్ఞ ననుసరించే వాయువు వేగంగా వీస్తున్నది, సూర్యుడు వేడినీ, ఇంద్రుడు వర్షాన్నీ ఇవ్వడం, మృత్యువు మనుష్యులదరికి చేరడం, అగ్ని ప్రజ్వలించడం, చంద్రుడు ఆకాశంలో కన్పించడం జరుగుతున్నవి.



మృత్యువుకు మృత్యువు, సమయానికి సమయం, సృష్టికర్తను సృష్టించేవాడు, సంరక్షకునికి రక్షణ ఇచ్చేవాడు, సంహారకర్తను సంహరించేవాడు అయినటువంటి కృష్ణభగవానునిఆశ్రయం కోరు. ప్రియురాలా! ఎవరూ ఎవరికీ మిత్రులు కారు. కాని కృష్ణభగవానుడు అందరికీ మిత్రుడే. కావున **హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే! హరే రామ హరే రామ రామ రామ హరే హరే!!** అనేమంత్రంద్వారా ఆయననే ప్రార్థించు, అతనికే సేవ చేయి.

ప్రేయసీ! నేనెవరో, నీవెవరో. మనకర్మల ననుసరించి భగవంతుడే మనలను కలిపాడు. ఆయనే మనలను వేరు చేస్తాడు. ఆపద వచ్చినప్పుడు మూర్ఖులు చింతిస్తారు. బుద్ధిమంతులు ఎప్పుడూ చలించరు. సుఖం, దుఃఖం అనేవి చక్రంవలె ఎప్పుడూ తిరుగుతూ ఉంటాయి. నారాయణుని పతిగా పొందుటకు నీవు బదరికాశ్రమం పోయి, తపస్సు చేయి. నీవు తప్పకుండా ఆయనను పొందుతావు. నేను కూడా నిన్ను భార్యగా పొందుటకు అనేకమార్లు తపస్సు చేశాను. బ్రహ్మదేవుడికృపవలన నేను నిన్ను పొంద గలిగాను. అతిశీఘ్రంగా నీవు గోవిందుడిని గోలోకబృందావనంలో పొంద గలవు. అప్పుడు నేను కూడా ఈరాక్షసదేహాన్ని త్యజించి అక్కడికే వస్తాను. అక్కడ మనం ఎల్లప్పుడూ ఒకరినొకరు చూసుకుంటూ ఉందాం. రాధశాపం వలన నేను భారతదేశంలోని ఈస్థలంలో జన్మించాను. కాని గోలోకానికి తిరిగి వెళతాను. కావున ప్రేయసీ! నాకోసం చింతపడవద్దు. నీవు కూడా దేహాన్ని త్యజించినపిమ్మట ఒకఆధ్యాత్మికరూపం ధరించి భగవంతునిదరికి చేరుకుంటావు. కావున బాధపడవలసినఅవసరం లేదు."

## యుద్ధం

బ్రహ్మముహూర్తంలో (సూర్యుడు ఉదయించక మునుపే) నిద్ర లేచి శంఖచూడుడు శుద్ధజలంలో స్నానం చేసి, కొత్తవస్త్రాలను ధరించాడు. నుదుటిమీద తిలకం ధరించాడు. అవసర మైనపనులన్నీ ముగించుకొని

దేవునికి పూజ చేశాడు. తరువాత పెరుగు, నేయి, తేనె, వేయించినబియ్యం మొదలగు శుభకరము లైనవస్తువులను చూశాడు. ఎప్పటిమాదిరిగా బ్రాహ్మణులకు మణి, రత్నాలను, స్వర్ణాన్ని, వస్త్రాలను దానం చేశాడు. యుద్ధంలో తనకు జయం కలగడానికి తనగురువుకు ముత్యాలు, మణి రత్నాలు, పేదవారికి గుర్రాలు, ఏనుగులు, ఆవులను కానుకగా ఇచ్చాడు. తనకుమారుడు సుచంద్రుడిని తాత్కాలికంగా రాజుగా చేశాడు. కుటుంబాన్ని, రాజ్యాన్ని, కోశాగారాన్ని, ధనసంపదలను, భండారగృహాన్ని, వాహనాలను చూసే కార్యభారాన్ని కూడా అతనికి అప్పజెప్పాడు.

శంఖచూడుడు విల్లు, బాణాలను ధరించి యుద్ధానికి సన్నద్ధమైనాడు. తనసైన్యం నంతటినీ ఏకం కమ్మని ఆజ్ఞాపిస్తూ తానే స్వయంగా మూడు లక్షలగుర్రాలను, ఒకలక్ష ఏనుగులను, పదివేలరథాలను, మూడుకోట్లత్రిశూల ధారులను యుద్ధానికి తయారుచేశాడు. సైనికదళాన్ని ఎన్నుకొనిన తరువాత మూడు అక్షౌహిణులసైన్యానికి సేనాపతిగా ఒకమహారథిని నియమించాడు. సైన్యాన్ని యుద్ధనగారా వాయించమని ఆజ్ఞ ఇచ్చి, హరినామస్మరణ చేసి యుద్ధశిబిరంనుండి బయటికి వచ్చాడు. శంఖచూడుడు ఒకశ్రేష్ఠరథంపై కూర్చొని గౌరవనీయులైన గురుజనుల, వయోవృద్ధుల నాయకత్వంలో శివుని దగ్గరికి బయలుదేరాడు.

ఆసమయంలో శివుడు సిద్ధునిఆశ్రమంలో పుష్పభద్రానదీతీరంలో విడిదిచేసిఉన్నాడు. సాధువులకు చాలా సరళంగా యోగసిద్ధి ప్రాప్తించేస్థలం అది. ఇక్కడే కపిలభగవానుడు కూడా తపస్సు చేశాడు.

అసురుడు అక్కడికి చేరేసమయానికి శివుడు అంజీరవృక్షంక్రింద యోగసమాధిలో ఉన్నాడు. వేలసూర్యులవలె ప్రకాశిస్తూ శివుడు మందస్మిత వదనుడైఉన్నాడు. త్రిశూలధారియైన శివునిమెడచుట్టూ పాములు వ్రేలాడుతూ



ఉన్నాయి. ఆయన మృత్యువుకు మృత్యువు. విశ్వసంహారం చేసే శక్తిమంతుడు. ఆయనముఖం శాంతంగా, సుందరంగా ఉన్నది.

శివుని చూసి శంఖచూడుడు రథం దిగి, తనసమస్తసైన్యంతో సహా శిరస్సు వంచి నమస్కరించాడు. శివుడు ప్రసన్నుడై ఇలా అన్నాడు – "నీవు నీవు పూర్వజన్మంలో గోలోకంలో అత్యంతధార్మికుడివి, కృష్ణభగవానుని ప్రధాన గోపబాలురలో ఒకడివి. రాధారాణిశాపంవలన ఇక్కడ రాక్షసులరాజు వయినా, నీవు కూడా ఒక వైష్ణవుడివి. వైష్ణవుడు గడ్డిపోచ మొదలుకొని బ్రహ్మపదవి కూడా మాయే అనుకుంటాడు. ఒకవేళ అతనికి నాలుగు రకాలైన ముక్తి – సాలోక్య, సార్ష్టి, సామీప్యం మరియు సారూప్యం అనునవి ప్రసాదించినా కూడా లెక్కచేయడు. ఇంద్ర, కుబేర లేదా బ్రహ్మ పదవి కూడా తుచ్ఛమైనవిగా భావిస్తాడు. అతడు కేవలం కృష్ణభగవానుని సేవ లేదా ఆరాధన చేయడానికే ఇష్టపడతాడు. నీవు నిజమైన కృష్ణభక్తుడివి. ఎందుకు నీవు దేవతలకు సంబంధించినవాటిని కోరుకుంటున్నావు. అవి నీకు మిథ్యలు. నీవు దేవతలరాజ్యాన్ని దేవతలకు తిరిగి ఇచ్చి నన్ను ప్రసన్నుని చేసుకో. నీవు నీరాజ్యాన్ని సంతోషంగా పాలించుకో. "రాజా! దేవతలకు వారిరాజ్యం తిరిగి ఇస్తే నీప్రతిష్ఠకు భంగం కల్గుతుందనుకుంటే, ఏదీ శాశ్వతం కాదని కూడా నీవు అర్థం చేసుకోవాలి."

ఈవిధంగా శంఖచూడునికి శివుడు అనేకఉపదేశాలను చేశాడు.

శంఖచూడుడు శివునిపలుమార్లు స్తుతించి వినయంగా ఇలా అన్నాడు – 'మీరు చెప్పినదంతా నిజమే. కానీ బంధువులతో యుద్ధం చేయడం చాలా పెద్ద పాపమని ఇప్పుడే మీరు అన్నారు. మరి బలిచక్రవర్తి సమస్త సంపదను దేవతలు ఎందుకు లాగుకున్నారు? అతనిని పాతాళలోకానికి ఎందుకు పంపించారు? భగవంతుడు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, శుంభుడు మొదలైన అనేకరాక్షసులను ఎందుకు వధించాడు? చాలాకాలం

క్రితం దేవదానవులు సముద్రమథనంద్వారా అమృతం పొందటానికి చాలా కృషి చేశారు. కాని భగవంతుడు అమృతాన్ని దేవతలకు మాత్రమే ఎందుకు ఇచ్చాడు? ఈబ్రహ్మాండం అంతా కృష్ణభగవానునిక్రీడాస్థలం. దేవదానవులకు ప్రతిరోజూ యుద్ధం జరుగుతూనే ఉన్నది. గెలుపు, ఓటములు కూడా ఇద్దరికీ సమానంగా వస్తూ ఉంటాయి. కాబట్టి మాయుద్ధంలో మీరు కలుగ జేసుకోవడం సరికాదు. మహిమలు గల స్వామీ! దేవదానవు లిరువురూ మీకు మిత్రులు, ఆప్తులు. మీదృష్టిలో ఇరువురూ సమానులే. మీరు గొప్ప గుణవంతులు. కావున మీరు విరోధిపక్షంలో ఉండటం, లేదా దేవతలను సమర్థించడం సమంజసమే. యుద్ధాన్ని గెలిచినమీకు గొప్పకీర్తి లభిస్తుంది. కాని మేము గెలిస్తే కీర్తి మీకు లభించదు. మేము మిమ్మల్ని ఓడించినట్లైతే మీకు కలిగేఅపకీర్తి మరియు కళంకం అంతకు మించిఉంటుంది. ఎందుకంటే మేము చాలా చిన్నవాళ్లము, మీరు చాలా గొప్పవాళ్లు.'

అపుడు శివుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు – 'రాజా! నీవు ఒక బ్రాహ్మణకులంలో జన్మించావు. కనుక నీచేతుల్లో నేను ఓడిపోతే సిగ్గుపడ వలసినఅవసర మేమున్నది. పూర్వకాలంలో భగవంతుడు మధుకైటభుల తోనూ, హిరణ్యకశిపునితోనూ, హిరణ్యాక్షునితోనూ యుద్ధము చేయగా, నేను త్రిపురాసురుడితో యుద్ధము చేశాను. దుర్గాదేవి శుంభుడితోనూ తదితర రాక్షసులతోనూ యుద్ధం చేసింది. కాని వారితో మీకు పోలిక లేదు. నీవు కృష్ణభగవానునిసేవకులలో అత్యంతశ్రేష్ఠుడివి. దేవతలకు విష్ణుభగవానుని రక్షణ ఉన్నది. కనుక ఆయన తనస్థానంలో నన్ను నీదగ్గరికి పంపించారు. ఒకవేళ నేను నీఅంతటిగొప్పవాడిచేతిలో ఓడిపోతే కళంకితుడను ఎలా అవుతాను. కాని నీద్వారా అపకీర్తి, కళంకంవంటిమాటలు విని, ఆశ్చర్య చకితుడ నైనాను. వ్యర్థవార్తాలాపంవలన లాభ మేమీ లేదు. కనుక దేవతలకు వారి రాజ్యం వారికి తిరిగిఇవ్వు. లేదా నాతో యుద్ధానికి సన్నద్ధుడివి కమ్ము. నేను నాసంకల్పంలో స్థిరంగా ఉన్నాను.'



శంఖచూడుడు త్వరగా లేచి శివునికి నమస్కరించి తనమంత్రులతో కలిసి రథంపై వెనుతిరిగాడు. శివుడు తనసైన్యాన్ని యుద్ధానికి సిద్ధం కమ్మని ఆదేశించాడు. శంఖచూడుడు కూడా అపనే చేశాడు. అధికారికంగా యుద్ధం ప్రారంభంగూర్చి ప్రకటిస్తూ వాద్యయంత్రాలు కర్కశధ్వనితో మోగాయి.

దేవదానవులమధ్య గొప్పయుద్ధం ఆరంభమైనది. రహస్యమైన అలౌకిక శస్త్రాలు వేగంగా విసిరివేయబడసాగాయి. అనేకసంఖ్యలో రాక్షసులు చనిపోయారు. యుద్ధం ఒకసంవత్సరం జరిగింది. మేఘాలు భూమిపైన వర్షం కురిపించినవిధంగా వీరు లందరూ ఒకరిపై నొకరు ఉగ్రప్రచండ రూపంలో బాణాలు కురిపించారు. శివుడు, దానవరాజు మధ్యలో జరిగే యుద్ధానికి స్వర్గలోకం, భూలోకం, పర్వతాలు, సముద్రాలు, నదులు చలించి వణికి పోసాగినాయి. శివుడు శంఖచూడుని వేలకొలదిబాణాలను ఏవిధంగా ముక్కలు ముక్కలు చేశాడో, అదే విధంగా రాజు కూడా శివునిబాణాలను తునాతునకలు చేశాడు. అప్పుడు శివుడు కోపంతో శంఖచూడుని తన త్రిశూలంతో గాయపరిచి అచేతనుణ్ణి చేశాడు. కాని అతడు శీఘ్రంగా చైతన్యవంతుడై ధనుస్సు తీసుకొని కొన్నిబాణాలు వేశాడు. ఒకమంత్రం ద్వారా అసురుడు పదివేలచేతులను సృష్టించుకొని వేగంగా పదివేలచక్రాల ద్వారా శివుని నాలుగువైపులా చుట్టుముట్టాడు. కాని శివుడు ఒకఅద్భుతమైన, ఆశ్చర్యకర మైనబాణం వదిలి వాటన్నిటినీ తునాతునకలు చేశాడు. తరువాత శంఖచూడుడు ఒక పెద్దసైన్యాన్ని తీసుకొని శివుడిని చంపాలని అతడిపై దాడిచేశాడు. కాని శివుడు అతనిగదను తునాతునకలు చేశాడు. శంఖచూడుని సైన్యంలో చాలావరకు చనిపోయారు. మరి కొందరు భయంతో పిరికివాళ్ల మాదిరిగా యుద్ధస్థలం నుండి పారిపోయారు. కాని శంఖచూడుడు అక్కడే స్థిరంగా నిలబడి శివునితో 'నేను ఇక్కడ ఉన్నాను. మీతో యుద్ధం చేయడానికి సిద్ధం' అన్నాడు.

శంఖచూడుడు శివునిపై రహస్య మైనఅస్త్రాలను వదిలాడు. ఇది చూసి శివుడు తనఅలౌకికమైన మహేశ్వర అస్త్రాలను వదిలి మాయనంతా విచ్ఛిన్నం చేశాడు. అప్పుడు శక్తిమంతుడైనశివుడు శంఖచూడుని చంపడానికి త్రిశూలాన్ని తీసుకున్నాడు. ఆత్రిశూలం ధాటికి గొప్పగొప్పవ్యక్తులు కూడా తట్టుకోలేరు. కాని అతనిని ఆపడానికి ఆకాశవాణి ఇలా ధ్వనించింది – 'శివా! త్రిశూలం ప్రయోగించకు. నాప్రార్థన మన్నించు. నీవు ఈబ్రహ్మాండాన్ని ఒకక్షణంలో నాశనం చేయగలవు. అందులో ఎటువంటిసందేహం లేదు. ఇక ఈశంఖచూడుని నాశనంచేయటంలో కష్టం ఏమి ఉంటుంది. కాని నీవు వేదనియమాలను ఉపేక్షించకూడదు. మహాపురుషుడా! బ్రహ్మ చెప్పిన ప్రకారం శంఖచూడుడు విష్ణుభగవానునికవచం ధరించిఉన్నంతవరకూ, అతనిభార్య పాతివ్రత్యానికి భంగం రానంతవరకూ అతనికి చావు లేదు. అతడు ఈవరానికి అధీనుడు. కనుక దయచేసి బ్రహ్మవరాన్ని ఉల్లంఘించకు.' శివుడు 'అలాగే అగుగాక' అన్నాడు.

అదే క్షణాన శివుడు విష్ణుభగవానుని చూడాలనుకున్నాడు. వెంటనే విష్ణుభగవానుడు అక్కడ ప్రత్యక్షమైనాడు. శివుడు అతనితో తనకోరిక వివరించాడు. విష్ణుభగవానుడు అతనికి సహాయం చేయడానికి అంగీకరించాడు.

ముసలిబ్రాహ్మణుడివేషంలో విష్ణుభగవానుడు శంఖచూడునిదగ్గరికి వెళ్లి ఇలా ప్రార్థించాడు – 'ఓ రాక్షసరాజా! నీవు సంపదలన్నింటినీ దానంగా ఇస్తూ ఉంటావు. నాకు మీనుంచి ఒకదానం కావాలి. కాని మొదట నాకు మాట ఇచ్చినతరువాతనే నేను నాకోరికను తెలుపుతాను.'

శంఖచూడుడు 'మీరు ఏది కోరుకుంటే అది ఇస్తాను' అని మాట ఇచ్చాడు. వెంటనే బ్రాహ్మణుడు చాలా స్నేహపూర్వకంగా 'నాకు మీకవచం కావాలి' అన్నాడు. బ్రాహ్మణులహితం కోరువాడు, సత్యవంతుడు అయిన శంఖచూడుడు మారువేషంలో వచ్చినవిష్ణువుకు తనదివ్యకవచాన్ని ఇచ్చాడు.



## పాతివ్రత్యభంగం

తరువాత విష్ణుభగవానుడు శంఖచూడునిరూపం దాల్చి తులసీదేవి భవనానికి చేరాడు. ఇంటిలోపలికి ప్రవేశించేసమయంలో విజయోల్లాసంతో అందరూ డోలు వాయించి, 'జయహో' అని అరవసాగారు.

తులసీదేవి ఆశబ్దం విని రాజవీధి వైపు ఉండే కిటికీనుండి ఉత్సాహంగా తొంగిచూసింది. తనభర్త తిరిగివచ్చాడని తెలిసినవెంటనే ఆమె పనులు ముగించుకొని బ్రాహ్మణులకు కానుకలు సమర్పించింది. తరువాత అలంకరించుకొని తనసౌందర్యాన్ని ఇనుమడింపజేసుకుంది.

భర్తపాదాలు కడిగి నమస్కరించింది. రత్నఘటితసింహాసనంపై కూర్చొండబెట్టి శుభకరం, మంగళకరం అయిన కర్పూరసుగంధభరితమైన తమలపాకులను అతనికి అందించింది. 'ఈరోజు నాజీవితం ఆనంద మయం అయింది. ఎందుకంటే నాభర్త నాఇంటికి తిరిగివచ్చాడు' అని తులసి మనసులో సంతోషించింది.

భర్త అంతకుముందు ప్రదర్శించేప్రేమకు, ఇపుడు ప్రదర్శిస్తున్న ప్రేమకు వ్యత్యాసం కనబడింది. ఈవ్యక్తి తనభర్తయేనా అని తులసికి సందేహం కల్గింది. అతనివైపు అవిశ్వాసంగా చూస్తూ, "నాభర్త మీరు కాదు! కాదు" అన్నది. ఆమె హృదయాంతరాళంలో అతను తనభర్త కాదని తెలుస్తున్నది. తులసి చాలా కోపంతో – 'నీవు ఎవరు? నేను ఇప్పుడే తెలుసుకోవాలి. నీవు నావినయాన్ని, అమాయకత్వాన్ని ఉపయోగించుకొని నాకు ఆగ్రహాన్ని, దుఃఖాన్ని కలిగించావు. నీకు శాపం ఇస్తాను.'

తులసిమాటలను విని శంఖచూడునిరూపంలో ఉన్నవిష్ణుభగవానుడు తన నిజమైనసుందరరూపం ధరించాడు. తొలిసారి వర్షాన్నిచ్చే నవీన మేఘములమాదిరి అతను నీలవర్ణంతో ఉన్నాడు. అతనినేత్రాలు శరదృతువు లోని తామరపూలమాదిరిగా ఉన్నాయి. రత్నభూషణాలతో అలంకృతుడై ఉన్నాడు. చిరునవ్వుతో ఆయనముఖారవిందం అత్యంతభవ్యంగా దయ

కురిపిస్తున్నది. పీతవస్త్రములను ధరించిఉన్నాడు. వాసుదేవుని అందమైన రూపం చూసి తులసి స్పృహ తప్పింది. కొద్దిక్షణాలతరువాత మేల్కొని ఇలా అన్నది – 'భగవంతుడా! ప్రభూ! మీరు హృదయం లేనివారు, కఠినమైనవారు. మోసంతో నాపాతివ్రత్యాన్ని భంగం చేశారు. నాభర్తను చంపివేశారు. స్వామీ! మీరు కఠినమనస్కులు. ఇది నిజం, మీహృదయం రాతితో సమానం. అందువలన మీరు రాయిగా మారమని శాపం ఇస్తున్నాను. మీభక్తుడు ఏతప్పు చేయకున్నా ఇతరులకొరకు అతనిని ఎందుకు చంపుతున్నారు?'

అత్యంతదుఃఖంతో, నిరాశతోనూ తులసి గట్టిగా ఏడుస్తూ ఉంది. దయాసాగరుడైననారాయణుడు ఆమెదుఃఖాన్ని చూసి ఓదారుస్తూ ఇలా అన్నాడు – తులసీ! నీవు నన్ను భర్తరూపంలో పొందుటకు చాలాకాలం తపస్సు చేశావు. అదే విధంగా శంఖచూడుడు కూడా నిన్ను భార్యగా పొందుటకు చాలాకాలం తపస్సు చేశాడు. ఆతపస్సు ఫలితంగానే అతడి కోరిక నెరవేరింది. ఇపుడు నీకోరిక తీర్చేసమయం ఆసన్నమైంది. అందువల్లనే నేను ఇలా చేశాను.

ఇపుడు నీవు నీశరీరాన్ని త్యజించి, ఆధ్యాత్మికశరీరం పొంది నన్ను పెళ్లి చేసుకో. నీదేహం పవిత్రమైన ఈభరతభూమిపై శుద్ధమైన, నిర్మలమైన 'గండకీనది' పేరుతో ప్రసిద్ధమవుతుంది. నీకేశాలు పవిత్ర మైనవృక్షంగా మారుతాయి. ఆవృక్షములఉత్పత్తి నీమూలంగా జరుగుతుంది. అందువలన అవి 'తులసీవృక్షాలు' అని పిలువబడుతాయి. త్రిలోకాలలో నివసించు వారందరూ ఈవృక్షం ఆకులతో, పూలతో, భగవంతునిఅర్చనలను చేస్తారు. కావున తులసీ! నీవు వృక్షాలలోనూ, పుష్పాలలోనూ శ్రేష్ఠమైనదిగా విరాజిల్లుతావు.

## శాపవిముక్తి

ఈసారి శంఖచూడుడు యుద్ధక్షేత్రంలో కవచం లేకుండా శివునివద్దకు వచ్చాడు. శివుడు ప్రకాశిస్తున్న త్రిశూలం పైకి ఎత్తాడు. త్రిశూలం పేరు విజయుడు. అది గ్రీష్మఋతువులో వందసూర్యులు ప్రకాశిస్తున్నట్లు ఉన్నది.



దాని ముందుభాగంలో నారాయణుడు, మధ్యలో బ్రహ్మ, క్రిందిభాగంలో శివుడు అధిష్ఠించిఉన్నారు. విశ్వం అంతమయ్యే సమయంలో ప్రళయం వచ్చినపుడు ఉత్పన్న మయ్యేఅగ్నివంటితేజస్సు కలిగిఉన్నది. తనలక్ష్యాన్ని సాధించుటలో నిర్ణయం, ఆకర్షణ కలిగిఉండేదానిని నిరోధించడం అసంభవం. స్థిరంగా, సంహారశక్తిగా కన్పిస్తున్నది. తేజస్సుతో సుదర్శన చక్రంతో సమానంగా ఉంది. సమస్తఅస్త్రశస్త్రాలలో సర్వశ్రేష్ఠమైంది. విష్ణుభగవానుడు లేదా శివుడు తప్ప దానిని ఇంకెవరూ పట్టుకోలేరు. ప్రయోగించనూ లేరు. అది ఎక్కడనుండి, ఎలా వచ్చిందో వారికి మాత్రమే తెలుసు. ఆత్రిశూలం సమస్తజగత్తును యథేచ్ఛగా నాశనం చేయగలదు.

శివుడు త్రిశూలం శంఖచూడునివైపు గురిపెట్టి విసిరాడు. త్రిశూలం తనవైపుకు రావడం చూసి శంఖచూడుడు విల్లమ్ములను క్రిందపెట్టి, మనసును నియంత్రించుకొని, యోగముద్రలో కూర్చొని, అత్యంతభక్తిభావంతో కృష్ణభగవానునిచరణకమలాలలో మనసును లగ్నంచేశాడు. త్రిశూలం ఒక్కక్షణం శంఖచూడునితలను నాలుగువైపులా చుట్టి, శివునిఆదేశానుసారం అతని తలను తాకింది. వెంటనే అతడు, అతనిరథం కాలి భస్మమైంది. తరువాత త్రిశూలం శివునిదగ్గరికి తిరిగివచ్చి అక్కడినుండి మనోవేగంతో వాయుమార్గంలో ప్రయాణించి చివరికి నారాయణభగవానుని చేరుకుంది.

స్వర్గవాసులు డోళ్లు వాయించారు, కిన్నరులు, గంధర్వులు గానం చేశారు, సాధుపురుషులు, దేవతలు కీర్తించారు, యౌవనవంతులు నృత్యం చేశారు. శివునిమీద పూలవర్షం కురిసింది. విష్ణుభగవానుడు, బ్రహ్మ, ఇంద్రుడు మొదలైనదేవతలు అతనిని పొగిడారు. శివుడు దయతో శంఖచూడుని అస్థికలను సముద్రంలో విసిరాడు. అవి శంఖాలుగా మార్పు చెందాయి. ఈశంఖములే భగవంతునిపూజలో అత్యంతపవిత్రంగా ఉపయోగిస్తారు. శంఖంలో ఉన్ననీళ్లు అత్యంతపవిత్రమైనవి. శంఖం ఊదిన

చోట లక్ష్మీదేవి సంతోషంగా నివసిస్తుంది. శంఖం ఉపయోగించి భగవంతునికి అభిషేకం చేసినవారికి పవిత్రనదులన్నింటిలో స్నానం చేసిన పుణ్యం లభిస్తుంది. శంఖం ఉంచినచోట లక్ష్మీనారాయణు లిద్దరూ నివసిస్తారు. అమంగళవస్తువులన్నీ ఆప్రదేశం వదలివెళ్లిపోతాయి.

తరువాత శివుడు తనవాహన మైనవృషభం ఎక్కి సమస్తపరివారంతో కలిసి తనలోకానికి వెళ్లిపోయాడు. శివుడు శంఖచూడునికి శాపవిముక్తిని కలిగించాడు. ఈవిధంగా అతను తిరిగి గోపబాలుడిగా నిజరూపాన్ని పొందాడు. ఆకాశంనుంచి ఒకదివ్యరథం వచ్చింది. శంఖచూడుడు గోలోక బృందావనానికి తిరిగి వెళ్లిపోయాడు. అక్కడ సుధాముడు శ్రీమతి రాధారాణిని శ్రీకృష్ణుడిని చూసి వారిచరణకమలాలను ప్రేమతో భక్తిపూర్వకంగా స్పృశించాడు. ఆదివ్యదంపతులహృదయం అతనిపట్ల ప్రేమతో నిండింది.

నారాయణుడు తులసికి ఇలా వివరించాడు – 'అందరినీ పవిత్రం చేసి, పాపాలనుండి విముక్తి కలిగించేతులసి వృక్షం – గోలోకంలో విరజానది ఒడ్డున రాసనృత్యం జరిగేస్థలంలోనూ, బృందావనం, భాండీరం, చంపక మరియు చందనపుఅడవులలోనూ, మాధవీ, కేతకీ, కుంద, మల్లిక, మాలతీ వనాలలోనూ జన్మిస్తుంది. పవిత్రమైననదులన్నీ తులసీవృక్షమునకు అభిముఖంగా ఉండి అక్కడే నివసిస్తాయి. సమస్తదేవతలు అక్కడ కింద పడుతున్న తులసిపత్రాలకోసం ఎదురుచూస్తూ ఉంటారు.

ఒకతులసిపత్రం సమర్పించిన మాత్రంచే విష్ణుభగవానుడు ఎంతగానో ప్రసన్నం అవుతాడు. జలం నిండిన వేలకొలది పాత్రలు సమర్పించినా అంత ప్రసన్నం కాడు. ఒకతులసీపత్రం సమర్పించుటవల్ల కలిగే ఫలితం వేలకొలది గోవులను అర్పిస్తే లభించేపుణ్యంతో సమానం. కార్తికమాసంలో తులసీదళం సమర్పించిన ఇంకను విశేషమైనఫలితాలు సిద్ధిస్తాయి.



మృత్యుసమయంలో తులసీదళం కలజలాన్ని (తులసితీర్థం) పుచ్చుకున్న వాడు చేసినపాపాలన్నీ పటాపంచలైపోతాయి. గంగానదిలో స్నానంచేసిన పుణ్యం లభిస్తుంది. ప్రతిదినమూ తులసీదళజలాన్ని పుచ్చుకున్నవాడు మరణానంతరం వైకుంఠానికి వెళ్తాడు. మృత్యుసమయంలో తులసీదళ జలాన్ని గ్రహించినవారు రత్నఘటితవిమానంలో వైకుంఠానికి వెళతారు. ప్రతిదినమూ తులసీదళంతో ఆరాధించినవారికి ఒకలక్ష అశ్వమేధయజ్ఞాలు చేసినఫలితం దక్కుతుంది. చేతిలో తులసీదళాన్ని పట్టుకొని దేహాన్ని త్యజించినవారు సమస్తపాపాలనుండి విముక్తి పొందుతారు. తులసికొమ్మతో తయారుచేసినకంఠమాలను ధరించినవారు వేసే ప్రతిఅడుగుకి అశ్వమేధ యజ్ఞం చేసినఫలితాన్ని పొందుతారు.

శ్రాద్ధం, వ్రతం, దానం, ప్రతిష్ఠ మరియు దేవతార్చనకొరకు పాత తులసీదళం కూడా ఉపయోగించవచ్చు, ఎందుకంటే మూడు రాత్రులవరకు అది పవిత్రంగానే ఉంటుంది. భూమిపైన కాని, జలములో కాని పడిన తులసీదళం, విష్ణుభగవానునికి సమర్పించినతులసీదళం కడిగి వేరే కార్యాలకు ఉపయోగించినా అది పవిత్రమే.

తులసీదళాన్ని చేతిలో పట్టుకొని మాట తప్పినవారు సూర్యచంద్రులు ఉన్నంతవరకూ కాలసూత్ర మనేనరకంలో పడిఉంటారు. తులసీదళం ఎదురుగా తప్పుడు సాక్ష్యం చెప్పినవారు పదునాలుగుమంది ఇంద్రుల జీవితకాలానికి సమానమైనకాలంవరకు కుంభీపాకనరకంలో పడిఉంటారు.

తులసీ! నీవు గోలోకధామంలో తులసియొక్క అధిష్ఠానదేవతగా నా అంశ అయినశ్రీకృష్ణునితో కూడా నిరంతరం క్రీడిస్తూ ఉంటావు. నీదేహం నుండి ఉత్పన్నమై, భూలోకంలో పరమపవిత్ర మైననదిగా ఉండి నాఅంశయైన క్షీరసముద్రానికి భార్యవు అవుతావు. నీవు స్వయంగా మహాసాధ్వివి. తులసి రూపంలో వైకుంఠంలో నాకు సన్నిహితంగా నివసిస్తావు. అక్కడ నీవు

లక్ష్మిమాదిరిగా గౌరవింపబడతావు. గోలోకరాసలీలలో కూడా నీవు పాల్గొంటావు, ఇందులో ఎటువంటిసందేహం లేదు.

## 5. సాలగ్రామాలు

నేను నీశాపమును సత్యం చేయుటకు భూలోకంలో సాలగ్రామం రూపంలో ఉంటాను. గండకీనదిలో నివసిస్తాను. అక్కడ నివసించే కోట్లకొలది విశిష్టక్రిములు తమదంతాలనే ఆయుధాలతో కొరికి – కొరికి ఆసాలగ్రామంపై నాచక్రపుచిహ్నం ఏర్పరుస్తాయి. అందులో ఒకటి ద్వారక చిహ్నం ఉంటుంది, వనమాలతో అలంకరించబడిననాలుగుచక్రాలుంటాయి.

### సాలగ్రామభేదాలు

1. కొత్తమేఘాల శ్యామవర్ణశిల 'లక్ష్మీ – నారాయణు'ల రూపం.

2. ఒకద్వారం, నాలుగుచక్రాలచిహ్నాలుండి, వనమాలయొక్క రేఖలుండక, కొత్తమేఘాలను తలపించే శ్యామవర్ణం కల సాలగ్రామాన్ని 'లక్ష్మీజనార్దనుడు' అంటారు.

3. రెండు ద్వారాలు, చక్రం మరియు ఆవుగిట్టలచిహ్నం ఉండి, వనమాల చిహ్నం లేకుండా ఉండేసాలగ్రామశిలను "రాఘవేంద్రభగవానునిమూర్తి" యని భావించాలి.

4. రెండు చిన్నచక్రాలుండి, కొత్తమేఘాలమాదిరి కృష్ణవర్ణంలో ఉన్న శిల 'దధివామనుడు'. అది గృహస్థులకు సర్వసౌఖ్యములు కలిగిస్తుంది.

5. అత్యంతం చిన్నచక్రాలుండి, వనమాలతో అలంకరించబడిన సాలగ్రామశిల 'శ్రీధర' భగవానునిరూపం.

6. స్థూలంగా, గుండ్రంగా ఉండి, వనమాలచిహ్నం లేకుండా, రెండుచక్రాలు అత్యంతస్పష్టంగా కనిపించినసాలగ్రామశిలకు 'దామోదరుడు' అని పేరు.



7. మధ్యమశ్రేణికి చెంది, వర్తులాకారంగా ఉండి, అందులో రెండు చక్రాలు, విల్లు, బాణం చిహ్నములు కలిగిన లేక బాణంతో కోయబడిన చిహ్నం కలిగినసాలగ్రామాన్ని యుద్ధరంగంలో శోభించే 'రణరామ' భగవానుడిగా గ్రహించాలి.

8. మధ్యమశ్రేణికి చెందినశిల ఏడుచక్రాలతో ఉండి, ఛత్రం, విల్లు గుర్తులుంటే 'రాజేశ్వరుడు'.

9. పదునాలుగు చక్రాలు కలిగి, కొత్తమేఘాలమాదిరివర్ణం కలిగిన సాలగ్రామం 'అనంతుడు'. ఈసాలగ్రామాన్ని పూజించడంవల్ల ధర్మ, అర్థ, కామ, మోక్షాలు కల్గుతాయి.

10. చక్రంమాదిరిగా ఉండి, అందులో రెండు చక్రాలు, శ్రీ మరియు గోవుగిట్టలచిహ్నంతో కొత్తమేఘవర్ణంలో ఉన్నశిల 'మధుసూదనుడు'.

11. కేవలం ఒకచక్రం కలిగినది 'సుదర్శనుడు'

12. గుప్తచక్రచిహ్నం కలిగినది 'గధాధరుడు'.

13. రెండుచక్రాలు కలిగి, అశ్వముఖాకృతి కలిగినసాలగ్రామం 'హయగ్రీవుడు'.

14. విశాలమైనముఖం ఉండి, రెండు చక్రాలు కలిగి భయంకరంగా ఉన్నశిల 'నరసింహభగవానుడు'. అది మనుష్యులకు శీఘ్రమే వైరాగ్యాన్ని ప్రసాదిస్తుంది.

15. ద్వారంవద్ద రెండుచక్రాలు కలిగి, శ్రీచిహ్నం స్పష్టంగా కనిపించు సాలగ్రామం 'వాసుదేవుడు'.

16. సూక్ష్మచక్రం కలిగి, కొత్తమేఘం వంటి శ్యామవర్ణం కలిగి, ముఖంపై చిన్న చిన్న ఛిద్రములు కలిగినసాలగ్రామం 'ప్రద్యుమ్నుడు'. దీనిప్రభావంవలన గృహస్థులు సుఖంగా ఉంటారు.

17. రెండుచక్రాలు ఒకదానికొకటి దగ్గరగానూ, పృష్ఠభాగం విశాలంగానూ ఉన్నశిల 'సంకర్షణ' భగవానుడు. ఇది గృహస్థులకు నిరంతరం సుఖాన్ని ప్రసాదిస్తుంది.

18. అందమైనగోళాకారంలో పసుపువర్ణం కలిగి ఉన్నసాలగ్రామం 'అనిరుద్ధుడు'. గృహస్థులకు ఇది సుఖం ప్రసాదిస్తుంది.

## సాలగ్రామమహిమ

సాలగ్రామశిల ఉన్నచోట శ్రీహరి భగవానుడు విరాజిల్లుతాడు. సమస్త తీర్థాలతో కూడి లక్ష్మి అక్కడ కొలువై ఉంటుంది. బ్రహ్మహత్యాపాతకం మొదలుకొని ఎన్ని పాపాలయినా సాలగ్రామాన్ని పూజిస్తే పటాపంచలవుతాయి. వ్రతం, దానం, ప్రతిష్ఠ, శ్రాద్ధం మొద లైనసత్కార్యాలు సాలగ్రామ సన్నిధిలో చేసిన అవి సర్వోత్తమమైనవి అవుతాయి. తమపైన సాలగ్రామ శిల స్పర్శించినజలం చల్లుకున్నవారికి సమస్తతీర్థాలలో స్నానం చేసినపుణ్యం, సమస్తయజ్ఞాలు చేసినఫలితం దక్కుతుంది. అంతేకాదు సమస్తయజ్ఞాలు, తీర్థాలు, వ్రతాలు, తపస్సు మొదలైనవాటిఫలితానికి అతను అధికారి అవుతాడు. తులసీ! నాలుగు వేదాలను చదవడం, తపస్సు చేయడంవలన కలిగేఫలం సాలగ్రామశిలకు పూజచేయడంవలన దక్కుతుంది. నిరంతరం సాలగ్రామశిలను జలంతో అభిషేకం చేసినవాడు సమస్తదానాలు చేసిన పుణ్యానికీ, భూమిని ప్రదక్షిణం చేసినఫలితానికీ అధికారి అవుతాడు. సాలగ్రామశిలయొక్క అభిషేకజలం నిరంతరం పానంచేసినయెడల దేవతలు కూడా కోరుకునేలాభాన్ని పొందుతారు, జరామరణాలనుండి ముక్తిని పొందుతారు. సమస్తతీర్థాలు ఆపుణ్యాత్మునిస్పర్శను కోరుకుంటాయి. జీవన్ముక్తుడైన మహాపవిత్రవ్యక్తి సాక్షాత్తుగా శ్రీహరిభగవానునిసేవకు అర్హుడౌతాడు. వైకుంఠంలో భగవంతునితో కూడా అసంఖ్యాకప్రళయాల వరకు ఉండేఅర్హతను పొందుతాడు. అక్కడికి చేరుతూనే భగవంతుడు అతనిని తనదాసుని చేసుకుంటాడు. ఆవ్యక్తిని చూసి బ్రహ్మహత్యతో సమానమైన



పాపాలన్నీ కూడా, గరుడుని చూసి పాములు పారిపోయినవిధంగా పారిపోతాయి. ఆవ్యక్తి చరణధూళిని తాకి భూమాత కూడా పవిత్రురాలు అవుతుంది. అటువంటివ్యక్తి జన్మించగానే అతని లక్షలపితరులు ఉద్ధరించబడతారు. మృత్యుసమయంలో సాలగ్రామశిలాజలాన్ని పానం చేసిన వాడు, సమస్తపాపాలనుండి ముక్తుడు అయి, విష్ణులోకానికి చేరుకుంటాడు.

సాలగ్రామాన్ని, తులసిని, శంఖాన్ని జాగ్రత్తగా ఒకటిగా ఉంచిన వారిని శ్రీహరిభగవానుడు ఎక్కువగా ప్రేమిస్తాడు.

శకటం ఆకృతి గలసాలగ్రామంవలన దుఃఖం, శూలం వంటి మొన కలిగిన ఆకారం ఉంటే మృత్యువు కలుగుతాయి.. వికృతముఖం ఉంటే దరిద్రం, పింగళవర్ణం కల్గిన హాని, చక్రం సరిగా లేకపోయిన వ్యాధి, విరిగిన సాలగ్రామంవలన మృత్యువు సంభవిస్తుంది.

సాలగ్రామాన్ని చేతిలో ఉంచుకొని అసత్యం ఆడినవాడు కుంభీపాక నరకానికి వెళ్లి బ్రహ్మ ఆయుష్య కాలంవరకు అక్కడే ఉంటాడు. సాలగ్రామాన్ని పట్టుకొని చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చనివాడు, లక్ష మన్వంతరాలవరకు 'అసిపత్ర' మనే నరకంలో పడిఉంటాడు. ఓ కాంతామణీ! సాలగ్రామంపై నుండి తులసీదళం వేరుచేసినవాడికి, మరొకజన్మలో భార్య తోడుగా నిలవదు. శంఖంతో తులసీదళం ఛేదించినవారు భార్యాహీనులుగానూ, ఏడుజన్మల వరకు రోగులుగానూ ఉంటారు.

నారదమునికి ఈవృత్తాంతం వివరించినతరువాత నారాయణఋషి ఇలా అన్నారు. ఓ నారదా! ఈవిధంగా శ్రీహరి తులసీదేవికి చెప్పి మౌనంగా ఉండిపోయాడు. వెంటనే తులసీదేవి తనశరీరం త్యజించి దివ్యరూపాన్ని పొంది శ్రీహరి వక్షస్థలంపై చేరింది. కమలాపతి శ్రీహరి ఆమెను తీసుకొని వైకుంఠానికి వెళ్లాడు. అదే సమయంలో తులసిదేహంనుండి గండకీనది ఉద్భవించింది, భగవంతుడు శ్రీహరి కూడా అదే నదిలో పుణ్యప్రదమైన

సాలగ్రామశిలగా మారిపోయాడు. అక్కడ ఉన్నవిశిష్టక్రిములు శిలలను కొరికి – కొరికి అనేకరూపాలుగా తయారుచేస్తున్నాయి.

ఆశిలలు నదిలో పడి మేఘవర్ణం దాల్చినపుడు శుభఫలితాలు అందజేస్తాయి. ఒకవేళ ఆశిలలు భూమిమీద పడితే సూర్యునికిరణాల కారణంగా బూడిదరంగులోకి మారుతాయి. అవి పూజకు పనికిరావు.

## 6. పురాణాలలో తులసిమహిమ

### శివుడు పార్వతికి చెప్పినతులసిమహిమ

కైలాసపర్వతం అత్యంతసుందరంగానూ అందరిని ఆకర్షించే టట్లుగానూ ఉంటుంది. అక్కడ ఎల్లపుడూ మంచిసుగంధం నాలుగువైపులా వ్యాపించిఉంటుంది. రకరకాలైన పుష్పాలకారణంగా ఆకాశం ఎప్పుడూ సుగంధభరితంగా ఉంటుంది. అక్కడ ఈజగత్తును పావనం చేసేమునులు ఎల్లప్పుడూ ఆత్మకళ్యాణం, జగత్‌కళ్యాణంలో నిరంతరం నిమగ్న మైఉంటారు. అటువంటిప్రదేశంలో శివపార్వతులు సుఖంగా నివసిస్తూ ఉంటారు. శివుడి అనుచరులు కూడా ఆనందంగా స్వామిచరణాలను ఆశ్రయించుకుని ఉంటారు.

ఒకరోజు శివునితో పార్వతీదేవి ఇలా అన్నది – 'ప్రాణనాథా! నేను అత్యంతరహస్య మైనప్రశ్న ఒకటి అడగాలనుకుంటున్నాను. శ్రీహరిపూజ కొరకు ప్రతిరోజూ నాచెలికత్తెలు అత్యంతసుగంధం గలపుష్పాలను తీసుకుని వస్తారు, కాని మీరు స్వహస్తాలతో తులసీదళాన్ని ఎన్నుకొని, మనసారా భగవంతునికి అర్పించి పూజ చేస్తారు. దయచేసి మీరు నాకు తులసీదళం ఎన్నికమహిమను, మరియు కారణాన్ని తెలపండి'.

పార్వతిప్రార్థనను విని శివుడు ఇలా అన్నాడు – సీమంతినీ! నేను చెప్పేది శ్రద్ధగా విను. శ్రీమతి తులసీమహారాజ్ఞిమహిమను, నాపంచముఖాలతో



వర్ణించినా కూడా అంతం పొందుట అసంభవం. అయినా నీప్రశ్నకు జవాబు ఇచ్చేప్రయత్నం చేస్తాను, ఏకాగ్రచిత్తంతో విను.

తులసీవనం ఉన్నచోట రోగం, శోకం, త్రితాపం మొదలైనవాటిప్రభావం ఉండదు. తులసిసుగంధం నాసికలో ప్రవేశించినవ్యక్తికి అమంగళగ్రహాలన్నీ దూరంగా పారిపోతాయి. బుద్ధిమంతురాలా! తులసిసుగంధం, ఆతులసి గుణాలు వినపడేంతదూరంవరకు ఉన్నప్రదేశమంతా పవిత్ర మవుతుంది. తులసిచరణాలవద్ద ప్రాణం వదిలిపెట్టినవ్యక్తిని ఆధ్యాత్మికజగత్తుకు తీసుకు వెళ్లడానికి విష్ణుదూతలు వస్తారు. అటువంటివ్యక్తులు వైకుంఠంలో శాశ్వతంగా నివసిస్తారు. దీనిగురించి సకలశాస్త్రాలు వర్ణించాయి. శ్రీకృష్ణ భగవానునిచరణకమలాలకు తులసి అర్పించినవ్యక్తిపై కృష్ణుడు అనురక్తు డౌతాడు. సుందరీ! విశిష్టమైన తులసిగుణాలను కొన్ని మాత్రమే నేను వర్ణించాను. అందువలన నీవు ప్రతిదినమూ భక్తిపూర్వకంగా తులసిని సేవించు".

ఈవిధంగా పార్వతీదేవి శివునివలన తులసిమహిమను వినినతరువాత తులసిచరణాలకు ప్రణామం చేసింది. ఆమె ప్రతిదినం సప్తసముద్రాలనుండి జలం తీసుకొని వచ్చి శ్రీతులసికి అభిషేకం చేయసాగింది. శాస్త్రాలలో వర్ణించబడినవిధానం ప్రకారం తులసిమూలంవద్ద యోగాసనంలో కూర్చొని మనసారా శ్రీహరికి పూజ చేయసాగింది. స్వహస్తాలతో తులసీదళాన్ని ఎంచుకొని, ద్వాదశిరోజు తులసీదళానికి సుగంధంతో కూడిన శ్వేతచందనం పూసి శ్రీహరియొక్క శ్రీచరణాలకు సమర్పించి భగవంతుని ప్రార్థించసాగింది. ఈవిధంగా తులసీదళంతో శ్రీహరిని పూజించినకారణంగా భగవంతుడు చాలా సంతోషించాడు.

ఒకరోజు పార్వతీదేవి భగవంతునినామస్మరణ చేస్తున్నది. ఆ సమయంలో శ్రీహరి ఆమెసమక్షంలో ప్రత్యక్ష మైనాడు. పార్వతీదేవి శ్రీహరిని దర్శించింది. భగవంతుడు పార్వతీదేవిని సంబోధిస్తూ ఇలా అన్నాడు –

'పార్వతీ! నీసేవకు నేను అత్యంత ప్రసన్నుడ నైనాను. నీకు తులసీదేవి అష్టోత్తరశతనామాలను ప్రసాదిస్తాను.' అని శ్రీహరి పార్వతీదేవికి అష్టోత్తర శతనామం ప్రసాదించి అదృశ్యుడైనాడు. పార్వతీదేవి ఆనామాలను ఉచ్చరిస్తూ దివ్యానందాన్ని పొందింది.

**కుమారుడికి చెప్పినతులసిమహిమ**

పద్మపురాణంలో శివ - కార్తికేయసంవాదంలో తులసిమహిమ చెప్పబడింది. ఒకసారి కార్తికేయుడు (స్కందుడు) చాలా కుతూహలంతో తనతండ్రి శివుని ఇలా ప్రశ్నించాడు - చెట్లఆకులు, పూలు కూడా ఈ సంసారసాగరంనుండి ముక్తిని ప్రసాదించగలవా? అటువంటివృక్షం ఏదైనా ఈజగత్తులో ఉన్నదా! దీనిని గూర్చి మీద్వారా వినాలనుకుంటున్నాను. అని అడిగాడు. పుత్రునిజిజ్ఞాసను, అత్యధికకుతూహలాన్ని చూసి మహాదేవుడు ఉత్సాహంతో శ్రీతులసీదేవిమహిమను ఈవిధంగా వివరించాడు.

'కుమారుడా! అన్ని రకాలపుష్పాలలోనూ, పత్రాలలోనూ తులసియే సర్వశ్రేష్ఠం. ఆమె పరమమంగళకారి. సమస్త ఆధ్యాత్మిక మైనకోరికలను నెరవేర్చునది. నిర్మలమైనది. శ్రీకృష్ణునికి అత్యంతప్రియమైనది. ఆమెకు 'వైష్ణవి' అనేపేరు కూడా ఉంది. పూర్వకాలంలో విష్ణుభగవానుడు సంపూర్ణ జగత్తుకు శుభం చేయుటకుగాను తులసివృక్షం నాటాడు.

**'యథా విష్ణోః ప్రియా లక్ష్మీ, ర్యథాహం ప్రియ ఏవ చ ।**
**త థేయం తులసీదేవీ, చతుర్థో నోపపద్యతే ॥ (పద్మపురాణం 5.58.112)**

'శ్రీమహావిష్ణువుకు లక్ష్మీదేవి, నేను (శివుడు) ఎలా ఇష్టమో, తులసీదేవి కూడా అలాగే అత్యధికప్రియమైనది. మేము తప్ప విష్ణువుకు ప్రియమైన నాలుగవవస్తువు లేదు.'

కార్తికేయా! తులసీదళం కాకుండా వేరే ఏపుష్పాలు, ఫలాలు, దళాలతో పూజించినా కూడా భగవంతుడు సంతోషపడడు. ప్రతిదినమూ తులసితో



భగవంతునిపూజ చేసినవారు దానం, యజ్ఞం, అన్ని వ్రతాలు పరిపూర్ణంగా చేసినట్లే. తులసీదళంతో భగవంతునిపూజ చేసినట్లైతే కాంతి, సుఖం, భోగం, సామగ్రి, కీర్తి, జ్ఞానం, వేదం, వేదాంగం, శాస్త్రం, పురాణం, తంత్రం, సంహిత మొదలైనవి అన్నీ అతనిచేతికి సులభంగా దక్కుతాయి.

స్కందా! గంగానదిలాగా తులసి అన్నిశుభాలు కల్గిస్తుంది.

పూలు కలిగినతులసీదళములద్వారా భగవంతుని పూజ చేసినఎడల దానిమహిమను వర్ణించడం అసంభవం. తులసీవనం ఉన్నచోట కృష్ణ భగవానుడు ఉంటాడు. అంతటిమహత్తు కలిగినస్థానంలో బ్రహ్మ, లక్ష్మి ఎప్పుడూ కొలువైఉంటారు. అందువలన మనకు సమీపస్థానంలో తులసీ దేవిని నాటి పూజ చేయాలి. తులసిదగ్గర స్తోత్రం, పూజ మొదలైనవి చేసినట్లైతే అనేకమైన మంచిఫలితాలు కలుగుతాయి.

భూత, ప్రేత, పిశాచాలు, బ్రహ్మరాక్షసులు, దైత్యులు మొదలైనవారు తులసివృక్షానికి దూరంగా పారిపోతారు. భగవంతునికి అర్పించినతులసిని గ్రహించినట్లైతే వారు ఆభగవంతుడినే పొందగల్గుతారు.

**పూజనే కీర్తనే ధ్యానే, రోపణే ధారణే కలౌ ।**
**తులసీ దహతే పాపం, స్వర్గం మోక్షం దదాతి చ ॥**
**(పద్మపురాణం 5.58.131)**

కలియుగంలో తులసికి పూజ, కీర్తనం, ధ్యానం, నాటడం, ధరించడం చేస్తే అది సర్వపాపాలను దహించివేస్తుంది, భౌతికజగత్తునుండి ముక్తిని ప్రసాదిస్తుంది.

తులసిమహిమను ఇతరులకు వర్ణించేవాడు, స్వయంగా హృదయ పూర్వకంగా తులసితో పూజచేసేవాడు, కృష్ణ భగవానునిధామం (నివాసం) పొందగలడు.

కార్తికేయా! విష్ణుభగవానునికి ప్రియమైనవస్తువే, నాకు కూడా ప్రియం. తులసికి సేవ చేసినచో గురువును, తీర్థాలను, బ్రాహ్మణులను, దేవతలను సేవించినట్లు అవుతుంది. అందువలన స్కందా! నీవు కూడా తులసితో పూజ చేయి. ఒక్క తులసి పత్రముతో పూజ చేసినా, వైష్ణవత్వాన్ని పొందుతారు. తులసికొమ్మతో, కోమల మైనదళాలతో కృష్ణభగవానుని పూజ చేసినవారికి పునర్జన్మ ఉండదు. కోమలమైనదళములతో ప్రతిదినమూ భగవంతుని పూజ చేసినవానితరాలు వందలకొలదీ, వేలకొలదీ పవిత్రం అవుతాయి. కార్తికేయా! నేను తులసిగుణములు ముఖ్యమైనవి కొన్ని మాత్రమే తెలిపాను. ఎందుకంటే సంపూర్ణంగా వర్ణించడం అసంభవం. ఈవిధంగా పరమవైష్ణవు డైన శివుని నోటినుండి తులసిదేవిమహిమను విని కార్తికేయుడు సంతోషించాడు.

## విష్ణువు బ్రహ్మకు చెప్పినతులసిమహిమ

స్కాందపురాణంలోని వైష్ణవఖండంలో తులసిమహిమ గురించి వర్ణిస్తూ భగవంతుడు ఇలా చెప్పాడు – 'బ్రహ్మా! తులసిమొక్కను నాటి దానిఆకులతో నాకు పూజ చేసినవారు నానివాసస్థానమైన శ్వేతద్వీపంలో పరమఆనందాన్ని అనుభవిస్తారు. తులసీదళంతో లక్ష్మీపతి అయిననన్ను ప్రతిదినమూ పూజ చేసినవారిమహాపాతకాలు కూడా నాశనమవుతాయి. ఇక చిన్నచిన్నపాపాల గురించి చెప్పవలసిన దే మున్నది.

ఉపయోగించినపూలు, నీరు పూజ కనర్హం. కాని తులసీదళం మరియు గంగాజలం ఉపయోగించినవే అయినప్పటికీ తిరిగి ఉపయోగించవచ్చు.

**'దర్శనం నర్మదాయా స్తు, గంగాస్నానం విశాంవర ।**
**తులసీదళసంస్పర్శః, సమ మేతత్త్రయం స్మృతమ్ ॥**
**(పద్మపురాణం 6.244.5)**

నర్మదానదిదర్శనం, గంగానదిలో స్నానం, తులసీదళంస్పర్శనం– వీటిమహిమ సమానం.



**గవా మయుతదానేన, యత్ఫలం లభతే నరః ।**
**తులసీపత్రదానేన, తత్ఫలం కార్తికే సతి ॥**
**(బ్రహ్మవైవర్తం 2.21.42)**

సతీ! లక్ష గోవులను దానం చేస్తే కలిగేఫలితం, కార్తికమాసంలో ఒక తులసీదళం దానం చేయడంవల్ల లభిస్తుంది.

**'మణికాంచనపుష్పాణి, తథా ముక్తాఫలాని తు ।**
**తులసీపత్రదానస్య, కలాం నార్హంతి షోడశీమ్ ॥**
**(పద్మపురాణం 6.244.8)**

మణులు, స్వర్ణము, పుష్పములు, ముత్యములు మొదలగువానిని దానం చేయడంవల్ల కలిగేపుణ్యం తులసీదళదానఫలంలో 16వ భాగానికి కూడా సమానం కాదు.

బిల్వపత్రం, శమీ(జమ్మి)పత్రం, మల్లెపత్రం (చమేలీ) తామర, కౌస్తుభ మణికన్నా తులసీదళం నాకు అత్యంతప్రియం. మంజరితో కూడి, తెగని లేదా విరుగనితులసీదళం నాకు లక్ష్మితో సమానంగా ప్రియమైనది. నాకు కృష్ణపక్షంలోనూ, శుక్లపక్షంలోను వచ్చేఏకాదశివలె రామతులసి, కృష్ణతులసి రెండూ ప్రియమైనవి. నాపూజకోసం అడిగినవాళ్ళకూ, ఇతరభక్తులకూ, తులసీదళం సమర్పించినవారు శాశ్వతమైన నాధామాన్ని పొందుతారు.

## హరిభక్తివిలాసం – తులసిమహిమ

శ్రీహరిభక్తవిలాసంలోని అగస్త్యసంహితలో ప్రస్తావించబడినప్రకారం తులసిని నాటడం, సేవించడం, దర్శించడం, స్పృశించడం, మనసార పూజించడంవలన వ్యక్తి పవిత్రతను పొందుతాడు. ప్రతిదినమూ తులసికి ప్రదక్షిణం మరియు ప్రణామం చేసినఎడల పాపాలనే కల్మషాలన్నీ వెంటనే నశిస్తాయి. ప్రతిరోజు తులసికి పూజార్చనలు జరిగేగృహంలో ఎల్లపుడూ మంగళకర మైనగుణాలు నివాసం చేస్తాయి. కలియుగంలో కృష్ణభగవానుడు

తీర్థక్షేత్రాలను విడిచిపెట్టి, తులసీవనంలోనే ప్రతిరోజూ కొలువై ఉంటాడు. తులసీవనాన్ని నాటినవారికి దివ్యపరమపదం ప్రాప్తిస్తుంది. తులసివృక్షాన్ని నాటినచోటు లేదా తులసి ఉన్నచోటు కృష్ణధామంతో సమానం. చైత్ర మాసంలో వచ్చేసంక్రమణంనుండి వైశాఖమాసంలోనిసంక్రమణం వరకు తులసికి జలాన్ని, నీడను ప్రదానం చేసినవారికి పరమగతి ప్రాప్తిస్తుంది.

## ఏకాదశీమాహాత్మ్యం – తులసిమహిమ

ఏకాదశీమాహాత్మ్యంలో ఈవిధంగా చెప్పబడింది – 'విధివిధానంగా తులసీవృక్షాన్ని నాటినవారివంశంలో మరణించినవారూ, ప్రస్తుతం జీవించి ఉన్నవారూ, భవిష్యత్తులో జన్మించేవారూ, అందరూ కల్పాంతంవరకు శ్రీహరి ధామంలో నివసిస్తారు. తులసిసుగంధం వాయువుద్వారా వ్యాపించినంతమేర జీవరాశు లన్నీ పవిత్రం అవుతాయి. తులసీవనంలో తులసివిత్తనాలు క్రిందపడినచోట, పితృగణాలకు పిండప్రదానం చేసినవారు స్వయంగా వైకుంఠం చేరుకుంటారు. ప్రతిదినమూ తులసిని దర్శించడం, స్పృశించడం, నాటడం, చింతనం, కీర్తనం, ప్రణామం, గుణశ్రవణం, అర్చనం, సేవనం మొదలగునవి చేసినవారిసర్వపాపాలు భస్మీపటలమై కృష్ణభగవానుని నివాసాన్ని పొందుతారు. తులసీజలంతో పవిత్రం అయినగృహంసమీపానికి యమదూతలు కూడా రారు. కరక్కాయ రోగాలను నయం చేసినవిధంగా తులసి దారిద్ర్యాన్ని నాశనం చేస్తుంది. తులసిసమీపంలో ప్రాణత్యాగం చేసినమాత్రంచేత వ్యక్తి భగవంతునిదగ్గరకు చేరుకుంటాడు. నిద్ర లేచి స్నానం చేసినవెంటనే తులసిదర్శనం చేసుకున్నవారికి ఆరోజు రాత్రి, పగలు చేసినపాపాలు వెనువెంటనే నాశనం అవుతాయి. ప్రతిదినమూ తులసికి జలం అర్పించినవారు నిశ్చయంగా శ్రీహరిధామంలో నివసిస్తారు. ప్రళయం అన్నింటినీ దహించివేసినవిధంగా వ్యక్తిసర్వపాపాలు తులసిమహిమను వినడంద్వారా, దర్శించడంద్వారా, నాటడంద్వారా, జలం సేవించడంద్వారా, ప్రణామాలు చేయడంద్వారా దగ్ధమైపోతాయి.



## మరణసమయంలో తులసి – పద్మపురాణం

పద్మపురాణంలో శివుడు నారదునికి తులసి మహిమ గురించి చెప్తూ ఇలా అన్నాడు. – 'నారదా! కేవలం తులసి దివ్యగుణాలను వినినంత మాత్రంచే జన్మనుండి మృత్యువువరకు చేసిన సర్వపాపాలనుండి ముక్తుడవుతాడు.

**పత్రం పుష్పం ఫలం మూలం, శాఖా త్వక్ స్కంధసంజ్ఞితమ్ ।**
**తులసీసంభవం సర్వం, పావనం మృత్తికాదికమ్ ॥**
**(పద్మపురాణం 6.24.2)**

పత్రం, ఫలం మూలం, శాఖలు, బెరడు, చెట్టు, బోదె, మట్టి మొదలుగా తులసికి సంబంధించినవి అన్నీ పవిత్రమైనవి.

నారదా! చనిపోయినవ్యక్తి ఎంతటిఘోరపాపాలు చేసినప్పటికీ తులసీ కాష్ఠంఅగ్నివలన పునీతుడు అవుతాడు. ఆవ్యక్తి సంపూర్ణశరీరాన్ని ఎండిన తులసికట్టెలు కప్పి దహనసంస్కారం చేసినవాడు కూడా సంపూర్ణపాపరాశుల నుండి ముక్తుడవుతాడు. మృత్యుసమయాన భగవన్నామసంకీర్తనం, అనంతరం తులసికట్టెలతో దహనం జరిగినవారికి పునర్జన్మ ఉండదు.

**య ద్యేకం తులసీకాష్ఠం, మధ్యే కాష్ఠస్య తస్య హి ।**
**దాహకాలే భవే న్ముక్తిః, కోటిపాపయుతస్య చ ॥ (పద్మపురాణం 6.24.7)**

'ఒకవేళ దహనసంస్కారసమయంలో మిగిలినకట్టెలలో ఒక్కతులసీ కాష్ఠం(కట్టె) ఉన్నా, ఆమనిషి కోట్లకొలది పాపాలుచేసినా ముక్తు డౌతాడు! తులసికాష్ఠంవలన మిగిలినకట్టెలు కూడా పవిత్రమవుతాయి. చనిపోయిన వ్యక్తిని తులసికాష్ఠంఅగ్నితో దహనం చేస్తే విష్ణుదూతలు స్వయంగా వచ్చి అతనిని వైకుంఠానికి తీసుకొనిపోతారు. స్వయంగా జనార్దనుడే ఆవ్యక్తి చేతులు పట్టుకొని తనధామానికి తీసుకొనిపోతాడు. నేతితో తులసికాష్ఠంఅగ్ని ప్రజ్వలితమై శ్మశానానికి వెళ్లినమాత్రంచే ఆవ్యక్తి పాతకాలన్నీ భస్మీపటలం అవుతాయి.

## గరుడపురాణం

గరుడపురాణంలో 9వ మరియు 10వ అధ్యాయంలో గరుడుడు భగవంతునితో – 'శ్రీహరీ! మృత్యువుకొరకు చేసేఅనుష్ఠానాలగురించి నాకు తెలపండి' అంటాడు. అపుడు పురుషోత్తముడైన భగవంతుడు ఇలా అన్నాడు – 'తార్క్ష్యుడా! శరీరాన్ని త్యాగం చేసేఅనుష్ఠానాలను గురించి, మనుష్యులకు మృత్యువు అనంతరం మంచిపరిస్థితులను కలిగించేఅనుష్ఠానం గురించి వర్ణిస్తా విను.

తులసివృక్షం సమీపంలో ఆవుపేడతో గుండ్రంగా అలికి, తరువాత నువ్వులు జల్లి, దానిపై దర్భలు పరచవలెను. ఆపవిత్రభూమిపైన సాలిగ్రామ శిలను ఉంచాలి. ఆసాలిగ్రామశిలవద్ద మరణించినవారు ఈభౌతికజగత్తు నుండి ముక్తులౌతారు, సమస్తపాపకర్మలనుండి దూరమవుతారు.

జీవుడిబాధలను దూరంచేసే తులసివృక్షపునీడలో మరణించినవ్యక్తి ఈసంసారంనుండి శాశ్వతంగా ముక్తుడౌతాడు. అది సొంతపుత్రుల ద్వారా కూడా లభ్యం కాదు.

తులసివృక్షం పూజింపబడుతున్నగృహానికి యమకింకరులు కూడా రాలేరు. అటువంటిగృహం తీర్థస్థానంతో సమానం.

మరణసమయంలో నోట్లో తులసీదళం ఉన్నవ్యక్తి వేలకొలది పాపాలు చేసినప్పటికీ యమరాజు ఆధర్మాత్ముడిసమీపానికి కూడా వెళ్లలేడు.

నోటిలో తులసీదళం ఉంచుకొని, దర్భలు, నువ్వుల ఆసనంపై మరణించినవాడు పుత్రులు లేకపోయినా నిశ్చయంగా భగవంతునిధామానికి చేరుకుంటాడు. నువ్వులు, దర్భ, తులసీదేవి – ఈమూడూ అత్యంతపవిత్ర వస్తువులు. ఇవి రోగగ్రస్తులకు కలిగే దుఃఖ, కష్టదాయకస్థితినుండి వారిని కాపాడుతాయి.



# 7. తులసీమహిమ – (పురాణ)గాథలు

## విష్ణుదాసుడు

కాంచీపురంలో ఒకానొకసమయంలో చోళుడు అనేచక్రవర్తి ఉండేవాడు. అతనిఅధీనంలో ఉండేప్రతిదేశం అతనిపేరుమీదుగానే చోళదేశం అని పిలువబడేది. అతనిపరిపాలనకాలంలో రాజ్యంలో ఎవరూ కూడా దరిద్రులు, బాధితులు లేరు. పాపకార్యాలు చేసేవారు కాదు. రోగగ్రస్తులు లేరు. ఒకసారి చోళరాజు అనంతశయనం, అనంతపద్మనాభం మున్నగుప్రదేశాలకు తీర్థయాత్రకై వెళ్లాడు. అక్కడ విష్ణుభగవానుడు యోగనిద్రలో శయనించి ఉన్నాడు. ఆస్వామిని రాజు యథావిధిగా మణులు, మాణిక్యాలు, స్వర్ణంతో చేసినసుందరపుష్పములతో పూజ చేసి, సాష్టాంగంగా నమస్కరించాడు. అదే సమయంలో అతనిదృష్టి భగవంతునిదగ్గరకు వస్తున్న ఒకబ్రాహ్మణునిపై పడింది. అతడు కాంచీపురనివాసి. పేరు విష్ణుదాసుడు. అతడు భగవంతుని పూజకోసం చేతిలో తులసీదళం, జలం పట్టుకొని వస్తున్నాడు. ఆబ్రహ్మర్షి విష్ణుసూక్తం చదువుతూ దేవాదిదేవు డైనభగవంతునికి అభిషేకం చేసి, తులసి మంజరులు, తులసీదళాలతో విధిపూర్వకంగా పూజచేశాడు. చోళరాజు మొదట రత్నాలతో చేసినపూజ అంతా తులసిపూలతో, తులసీదళాలతో కప్పబడిపోయింది. రాజుకు కోపం వచ్చింది. 'నీవు తులసీదళాలతో నేను అర్పించిన మణులు, మాణిక్యాలను కప్పివేశావు. అలా ఎందుకు చేశావు! నీవు దరిద్రుడిగా, అజ్ఞానిగా ఉన్నావు. విష్ణుభక్తి గురించి నీకు పూర్తిగా తెలిసినట్లు లేదు' అన్నాడు.

రాజుమాటలు విని విష్ణుదాసు ఇలా అన్నాడు – 'రాజా! మీరు భ్రమపడుచున్నారు. ధనం కారణంగా గర్వపడుచున్నారు. ఇంతకు ముందు మీరు ఎన్ని వైష్ణవవ్రతాలను చేశారో చెప్పండి?' అప్పుడు చోళరాజు నవ్వి ఇలా అన్నాడు. 'నీవు దరిద్రుడివి. విష్ణుభగవానునిపట్ల నీభక్తి ఎంత? విష్ణుభగవానుని ప్రసన్నం చేసుకొనుటకు యజ్ఞాలు, దానాలు ఏమి

చేయలేదు. మందిరం కూడా ఏమీ కట్టించలేదు. అయినప్పటికీ నీభక్తిమీద నీకు ఎంత గర్వం. 'బ్రాహ్మణులారా! నామాట వినండి. విష్ణుభగవానుని దర్శనం మొదట నేను చేసుకోవాలా, లేక ఈబ్రాహ్మణుడు చేసుకోవాలా? అని రాజు తనభవనానికి వెళ్లిపోయాడు.

అక్కడ ఆయన మహర్షి ముద్గలుడిని ఆచార్యుడిగా చేసుకొని వైష్ణవయజ్ఞం ఆరంభించాడు. శాస్త్రోక్తనియమాలలో తత్పరుడైనవిష్ణుదాసు విష్ణుభగవానుడు ప్రసన్నం అయ్యేవ్రతం నిర్వహిస్తూ, విష్ణుభగవానుని మందిరంలోనితులసీవనాన్ని సంరక్షిస్తూ, దానికి సేవచేస్తూ, ఎల్లప్పుడూ భగవంతునికి తులసిని సమర్పిస్తూ భగవంతునిపూజలో నిమగ్నుడైనాడు. ద్వాదశాక్షరమంత్రం (ఓం నమో భగవతే వాసుదేవాయ) జపించేవాడు. నృత్యగీతములతో ప్రతిదినమూ విష్ణుభగవానునికి షోడశోపచారపూజ చేశాడు. ఆయన ఎల్లప్పుడూ విష్ణుభగవానుని స్మరించేవాడు. అతనిదృష్టికి సృష్టి అంతా సమానంగా కనిపిస్తున్నది. ఈవిధంగా చోళరాజు, విష్ణుదాసు ఇద్దరూ లక్ష్మీపతిఆరాధనలో నిమగ్నమై ఉన్నారు. ఇద్దరూ తమతమపూజలో (వ్రతంలో) స్థిరంగా ఉన్నారు. ఇరువురూ తమఇంద్రియాలు, చర్యలు సంపూర్ణంగా విష్ణుభగవానునికి సమర్పించారు. వారు దీర్ఘకాలం ఈస్థితిలోనే ఉన్నారు.

ఒకరోజు విష్ణుదాసు భోజనం తయారు చేశాడు. కాని ఆభోజనాన్ని ఎవరో దొంగిలించారు. మళ్లీ ఆయన భోజనం తయారు చేయలేదు, చేస్తే సాయంకాలపూజ చేయలేదు. రెండవరోజు కూడా భోజనం తయారుచేసి, విష్ణుభగవానునికి నైవేద్యం సమర్పించడానికి వెళ్లగానే మళ్లీ ఎవరో వచ్చి భోజనం దొంగిలించారు. ఈవిధంగా ఏడురోజులవరకూ దొంగతనం చేస్తూనే ఉన్నారు. ఇది చూసి విష్ణుదాసుకు ఆశ్చర్యం కల్గింది. ఎవరో రోజూ నాభోజనాన్ని దొంగిలిస్తున్నారు. తిరిగి భోజనం తయారు చేసుకొందా మంటే సాయంకాలపూజ చేయలేను. ఏడురోజులనుండి ఉపవాసం చేస్తున్నాను. ఈరోజు ఎలాగైనా ఆదొంగను పట్టుకోవాలి అనుకున్నాడు.



ఆవిధంగా నిశ్చయించుకొని భోజనం తయారుచేసి, ఒకచోట దాక్కొని చూడసాగాడు. ఇంతలో ఒకచండాలుడు భోజనాన్ని దొంగిలించుటకు రావడం చూశాడు. ఆకలితో అతనిశరీరం బలహీనంగా ఉన్నది. ముఖంలో దీనత్వం కనబడుతున్నది. శరీరంలో అస్థికలు, చర్మం తప్ప వేరే ఏమీ లేదు. అతనిని చూసి విష్ణుదాసుహృదయం కరుణతో నిండిపోయింది. వెంటనే భోజనాన్ని దొంగిలించే చండాలునితో 'కొంచెం ఆగు. ఎందుకు రుచి – పచి లేని ఆహారాన్ని తింటావు. ఇదిగో ఈనెయ్యి కూడా తీసుకెళ్లు' అంటూ తనదగ్గరకు వస్తున్నవిష్ణుదాసుని చూసి చండాలుడు భయంతో వేగంగా పరుగెత్తబోయి, కొంచెం దూరంలోనే స్పృహ తప్పి, పడిపోయాడు. భయంతో మూర్ఛితుడైన చండాలుని చూసి, విష్ణుదాసు వేగంగా అతని దగ్గరికి వచ్చి, తనవస్త్రపుటంచులతో గాలి వీచసాగాడు. అతడు లేచి నిలబడగానే విష్ణుదాసు అతనిని చూశాడు. అక్కడ చండాలుడు లేడు, సాక్షాత్తు విష్ణుభగవానుడే శంఖ, చక్ర, గదా, పద్మాలను ధరించిఉన్నాడు. భగవంతుడు విష్ణుదాసు చేసేతులసీసహిత సాత్త్వికపూజకు స్వామి అత్యంత ప్రసన్ను డైనాడు. ప్రత్యక్ష మైనభగవంతుని చూసి విష్ణుదాసు స్తుతులు ప్రణామాలు సమర్పించాడు. అపుడు విష్ణుభగవానుడు విష్ణుదాసుని ఆలింగనం చేసుకొని వైకుంఠధామానికి తీసుకొని వెళ్తున్నాడు. యజ్ఞంలో దీక్షితుడై ఉన్నచోళరాజు విష్ణుదాసును చూశాడు. వెంటనే గురువైన ముద్గలుడిని పిలిపించి ఇలా అన్నాడు. 'ఎవరితో పోటీపడి ఈయజ్ఞ, దాన, అనుష్ఠానము లన్నీ చేస్తున్నానో, ఆబ్రాహ్మణుడు ఈరోజు వైకుంఠధామానికి వెళుతున్నాడు. నేను ఈయజ్ఞంలో దీక్షితుడనై హోమం, దానం మొదలైనవి చేశాను. కాని ఇంతవరకు విష్ణుభగవానుడు నాకు ప్రసన్నుడు కాలేదు. ఈ విష్ణుదాసు భక్తితో కేవలం తులసిని సమర్పించినమాత్రంచేతనే శ్రీహరి ప్రత్యక్షమై, దర్శన మిచ్చాడు.'

వెంటనే యజ్ఞశాలకు వెళ్లి, హోమగుండం దగ్గర నిల్చొని మూడుసార్లు ఉచ్చస్వరంతో "విష్ణుభగవానుడా! మనసా, వాచా, కర్మణా, ఏకంగా ఉండే

స్థిరమైనభక్తిని నాకు ప్రసాదించండి"– అంటూ అగ్నిగుండంలో దూకాడు. వెంటనే భక్తవత్సలుడైన విష్ణుభగవానుడు ఆఅగ్నిగుండంలో ప్రత్యక్షమైనాడు. రాజును ఆలింగనం చేసుకొని, వైకుంఠధామానికి తీసుకెళ్లాడు.

ఈపౌరాణికకథ భగవంతునికి చేసే సాత్త్వికసేవవైపుకు మనల్ని నడిపిస్తుంది. భగవంతునికి ప్రియమైనతులసితో అర్చన చేస్తే భగవంతుడు తొందరగా ప్రసన్నుడౌతాడు.

## శునకానికి విష్ణులోకప్రాప్తి

పద్మపురాణంలోనిబ్రహ్మఖండంలో తులసిమహిమను వ్యాసదేవుడు ఈవిధంగా వర్ణిస్తాడు. 'తులసీవృక్షంమూలంలో ఉన్నజలం మహిమతో పరిపూర్ణ మైంది. ఆజలం శ్రద్ధగా తలపై ధరించినవారు నిశ్చయంగా విష్ణుధామం చేరుతారు. తులసీదళం ఉన్నజలాన్ని తలపై ధరిస్తే సమస్త తీర్థాలలో స్నానం చేసినఫలితం దక్కుతుంది, అంతే కాదు, శ్రీహరి వాసమైన శ్రీవైకుంఠం ప్రాప్తిస్తుంది.

ద్వారపరయుగంలో ఒకబ్రాహ్మణుడు స్నానం చేస్తూ, కొంచెం జలం తులసిమూలంలో పోశాడు. ఒకకుక్క తిరుగుతూ – తిరుగుతూ అక్కడికి వచ్చింది. దానికి చాలా దాహంగా ఉంది. తులసిమూలంలో నిలిచిననీటిని చూసి తొందరగా త్రాగసాగింది. నీటిని త్రాగినందువల్ల దానిపాపాలన్నీ పోయినాయి. అప్పుడే ఆకుక్కను వెతుక్కుంటూ ఒకబోయవాడు అక్కడికి వచ్చి దానిని తిట్టసాగాడు. 'నాకుండలోనిఅన్నం తిని, దాన్ని పగులగొట్టావు. నిన్ను నేను వదిలిపెట్టను' అని చెప్పి ఒకతీక్ష్ణమైనబాణాన్ని దానిపై వదిలాడు. ఆకుక్క బాధతో మూలుగుతూ కొద్దిసేపటికి చనిపోయింది. తరువాత ఆబోయ వాడు అక్కడినుండి వెళ్లిపోయాడు. అపుడు యమదూతలు వచ్చి యమ పాశంతో దానిని కట్టివేశారు. అదే సమయంలో విష్ణుదూతలు వచ్చి ఆయమ పాశం తొలగించారు.



ఇది చూసి యమదూతలు – 'ఈకుక్క మహాపాపి. దీనిని యమపాశం నుండి తొలగించి ఎక్కడికి తీసుకెళుతున్నారు' అని అడిగారు.

విష్ణుదూతలు 'ఈకుక్క పూర్వజన్మలో పుణ్యాత్ముడైన ఒకరాజు. ఎన్నో పుణ్యకార్యాలు చేశాడు. కాని ఒకసుందరస్త్రీని అపహరించినకారణంగా యమలోకానికి వెళ్లి అనేకకష్టాలు అనుభవించాడు. మీరు కాల్చిన లోహపు స్త్రీతో అతనిని కౌగిలింపజేశారు. కాల్చినశయ్యపై పరుండబెట్టారు. అతడు చాలా బాధను అనుభవించాడు. ఆవిధంగా చాలా కష్టాలను అనుభవించిన తరువాత భూలోకంలో కుక్కగా జన్మించాడు. ఇప్పుడు అతడు తులసి మూలంలో ఉన్నజలాన్ని త్రాగాడు. ఆకారణంగా అతడు చేసినపాపాలనుండి సంపూర్ణంగా ముక్తుడు అయ్యాడు.' అన్నారు.

ఈమాటలు విని వెంటనే యమదూతలు యమలోకానికి వెళ్లిపోయారు. విష్ణుదూతలు ఆకుక్కను విమానంలో ఎక్కించుకొని శ్రీహరిధామానికి తీసుకొనివెళ్లారు.

## గోపికలు – తులసి

వ్రజభూమిపుత్రు డైన శ్రీకృష్ణుడు శ్రీరాధిక లేనిసమయాన రాసలీల స్థలంనుండి మాయమవుతాడు. అపుడు వ్రజభూమిలోనిస్త్రీలు శ్రీకృష్ణుని విరహజ్వాలలో తపిస్తూ ఆపూర్ణిమరాత్రి శ్రీకృష్ణునికొరకు అక్కడివనాలలో మతి చలించినవారివలె వెతకసాగారు. శ్రీకృష్ణునిప్రియగోపికలు ఒకతులసి వనం చూసి ఇలా అన్నారు. 'తులసీ! నీవు ఈసంపూర్ణజగత్తుకు మంగళ కారిణివి. శ్రీగోవిందునిచరణాలకు ప్రియురాలివి. నీవు తప్ప ఈప్రపంచానికి శుభం చేకూర్చువారు వేరొకరు లేరు. కనుక మేమందరం నీశరణు కోరాము. నీవు మాజీవితాలను కూడా మంగళప్రదం చేయి. మాప్రాణనాథుడైన కృష్ణుని పోగొట్టుకొని, అతనిని వెతుకుతూ ఈవనాలలో తిరుగుచున్నాము. తులసీ! దయతో కృష్ణుడు ఎక్కడున్నాడో మాకు తెలుపు. అది తెలిసినమాజీవితం మంగళప్రద మవుతుంది. శ్రీమద్భాగవతంలో (10.30.7)లో ఇది వర్ణించ

బడినది. వనంలో శ్రీతులసీవృక్షాన్ని చూసినవెంటనే గోపికలు ఆమెతో ఇలా అన్నారు.

**కచ్చి త్తులసి! కల్యాణి! గోవిందచరణప్రియే ।**
**సహ త్వాలికులై ర్బిభ్రద్ దృష్ట స్తే ఽతిప్రియో ఽచ్యుతః ॥**

'అత్యంతదయ కల తులసీ! గోవిందునిచరణాలు మాకంటే నీకెక్కువ ప్రియము. నిన్ను (తులసిని) ధరించి, తుమ్మెదలసమూహము చుట్టుకొనగా, ఇటువైపు వెళుతున్న అచ్యుతుని నీవు చూశావా?

తులసీ! నిన్ను మించినభాగ్యవతులు వేరెవరూ లేరు. గోవిందుని చరణాలకు అత్యధిక ప్రియమైనదానివి, అందువలన ఆయన తనశ్రీచరణాల నుండి నిన్ను ఎపుడూ దూరం చేయడు. ఆవిధంగా గోవిందునిచరణాలతో సంబంధం కలవారు దయతో, పరోపకారులుగా ఉంటారు. ఈఆశతోనే మేమందరమూ నీకడకు వచ్చితిమి. మాకు శ్రీకృష్ణుడిసాన్నిహిత్యం ఒసగి మాప్రాణాలను రక్షించు. శ్రీకృష్ణునివిరహాన్ని భరించడం ఇక మావల్ల కాదు.

అత్యంతసౌభాగ్యవంతురా లైన తులసీ! అచ్యుతుని గురించి నీకు తప్పకుండా తెలుసు. ఈవనంలో ఆయన ఎక్కడున్నాడో చెప్పి మాజీవితాన్ని రక్షించు. శ్రీకృష్ణునివిరహంతో చాలా దుఃఖంగా ఉన్నాము. అతనిని వెతికే శక్తి మాకు లేదు. శ్రీకృష్ణుడు ఇక్కడికి ఝుంకారం చేస్తున్నభ్రమరాలతో కూడినతులసిమాలను ధరించి వచ్చాడు. ఆయన ఇక్కడే దాగిఉన్నాడు. ఆ తుమ్మెదలధ్వనివలన ఆతనిని చాలా సులభంగా కనుక్కోవచ్చు. కాని విరహ కారణంగా ఆభ్రమరాలఝుంకారం మాకు విన్పించడం లేదు. జగత్తుకే మంగళకారిణి వైన తులసీ! మేము చేతులు జోడించి ప్రార్థిస్తున్నాము, మాకు శ్రీకృష్ణునిసాన్నిధ్యం ప్రసాదించి మాజీవితాలను రక్షించు! ఈవిధంగా బృందావనస్త్రీలు కృష్ణుని పొందుటకు, కృష్ణునిసాన్నిహిత్యలాభంకొరకు తులసిని శరణు కోరి, జడజగత్తులోనిప్రాణులకు చక్కని ఉపదేశ మిస్తున్నారు.



## భగవంతునితో సరితూగుతుంది

ద్వారకలో భగవంతుడు ఎల్లప్పుడూ తన 16,108 రాణులతో సేవించ బడుతూ ఉంటాడు. రాణు లందరూ అతనికి సేవ చేస్తూ తమసౌభాగ్యాన్ని కొనియాడుకొంటూఉంటారు. అయినా ఎవరికి వారే తననే అధికంగా భగవంతుడు ప్రేమించా లని కోరుకుంటారు. సత్యభామ భగవంతునిపట్ల అత్యధికప్రేమను కల్గిఉంటుంది. కాని ఆమెహృదయంలో ఎప్పుడూ కృష్ణభగవానుడు అందరికంటే తననే అధికంగా ప్రేమించా లనుకుంటుంది.

ఒకసారి నారదుడు ద్వారకకు వచ్చాడు. నారదుడు భగవంతునికి పరమభక్తుడు. ఆయనకు భగవంతునితోనూ భక్తులతోనూ పరిహాసం చేస్తూ దైవికప్రయోజనాలు సాధిస్తూ ఉంటాడు. అతడు సత్యభామతో ఇలా అన్నాడు 'కృష్ణభగవానునికి రాణు లందరూ ఇష్టమే కాని, రుక్మిణితోనే వారు నిజమైన ప్రేమను కలిగిఉంటారు. అటువంటిప్రేమ నీవు పొందా లంటే నేను ఒక ఉపాయం చెప్తాను. నీవు ఒకవ్రతం చేసి కృష్ణభగవానుని నాకు దానమివ్వాలి. తరువాత కృష్ణునికి సరితూగేవస్తువు ఏదయినా ఇచ్చి తిరిగి తీసుకోవాలి. ఈతులాభారం చేసినట్లైతే కృష్ణభగవానుడు నీకు మాత్రమే సొంతమవుతాడు, ఒకవేళ అలా చేయలేకపోతే కృష్ణభగవానుడు ఎల్లప్పుడూ నాకు బానిస అవుతాడు.

సత్యభామ భగవంతునిస్వభావం మరియు శక్తిసామర్థ్యాలు తెలుసుకోలేక పోయింది. కృష్ణభగవానుడు లీలాపురుషోత్తముడు. అతడు మరేమీ మాట్లాడ కుండా పూజకు తయారయ్యాడు. మిగిలిన రాణులందరూ ఆవిధంగా చేయ వద్దని సత్యభామను వేడుకున్నారు. కాని సత్యభామ వారిమాటలను వినలేదు. మరుసటిరోజే తులాభారానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. విధానంప్రకారం సత్యభామ కృష్ణభగవానుని నారదునికి దానం చేసింది. మరలా ఆయనను

తిరిగి పొందటానికి ఒకత్రాసును అక్కడ ఏర్పాటు చేసింది. త్రాసుకు ఒకవైపున కృష్ణభగవానుని కూర్చుండబెట్టింది. మరొకవైపు సత్యభామ తననగలను, బంగారువస్తువులను, అంతే కాదు, తనసమస్తసంపదను అందులో ఉంచ సాగింది. సత్యభామసంపద మొత్తం కృష్ణభగవానునికి సరితూగలేకపోయింది. ఇది చూసి సత్యభామ చాలా బాధపడింది. కృష్ణభగవానుడు సత్యభామను చూస్తూ – 'ఇప్పుడు నేను వేరొకరికి దాసుడిగా ఉండవలసివస్తున్నది." అన్నాడు. సత్య మరింత బాధపడింది. ఆమె అందరు రాణులదగ్గరకు వెళ్లి వారినగలను కూడా తీసుకునివచ్చి అందులో ఉంచింది. అపుడు కూడా భగవంతునిబరువుతో సమానం కాలేదు. దుఃఖంతో, వ్యాకులతతో ఉన్నసత్యభామకు వేరే ఉపాయం దొరకలేదు. బాధపడుతున్నసత్యభామను చూసి నారదుడు 'రుక్మిణిని సహాయం అడుగు' అన్నాడు. చివరిగా సత్యభామ నిస్సహాయస్థితిలో రుక్మిణిదగ్గరకు వెళ్లింది. ఆసమయంలో రుక్మిణి తులసి పూజ చేస్తున్నది. ఆమె వెంటనే సుభద్రను తీసుకుని తులాభారం జరిగేచోటుకు వచ్చింది. పూజపరతు తెలుసుకొని రుక్మిణి చాలా ఆశ్చర్యపడింది. సత్యభామ భగవంతుడిని సంపదతో తూచేప్రయత్నం చేస్తున్నది. అది ఎప్పటికీ సాధ్యం కాదు.

రుక్మిణి నారదునితో ఇలా అన్నది – 'ఎటువంటిధనసంపదలు కూడా భగవంతునికి సమానం కావు. భగవంతునిపవిత్రనామమే ఆయనబరువుకు సమాన మవుతుంది. నారదుడు రుక్మిణి ఈసూచనను అంగీకరించలేదు. 'కృష్ణభగవానుడు అనగా ఒకరూపం, మనం ప్రత్యక్షంగా చూడగలం. కావున ఆయనను ప్రత్యక్షంగా చూడగలిగేవస్తువులతోనే తూచాలి. భగవంతుని నామం, భగవంతునితో సమాన మైనదే కాని, ప్రత్యక్షంగా చూడలేం." అన్నాడు. తనస్వామిపట్ల అపరిమితమైనప్రేమను, భక్తిని కలిగిన పవిత్ర హృదయం గలరుక్మిణికి పరిస్థితిని అర్థం చేసుకోవడానికి కొంచెం కూడా సమయం పట్టలేదు. భగవద్గీతలో కృష్ణుడు



**పత్రం పుష్పం ఫలం తోయం, యో మే భక్త్యా ప్రయచ్ఛతి!**
**తదహం భక్త్యుపహృత, మశ్నామి ప్రయతాత్మనః ॥ (9.26)**

'పత్రమో, పుష్పమో, ఫలమో, జలమో ఏ దయినా ప్రేమతోను, భక్తితోను అర్పించినచో నేను స్వీకరిస్తాను' అన్నాడు.

సంపూర్ణవిశ్వాసం, శ్రద్ధాభక్తులతో రుక్మిణి హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే! హరే రామ హరే రామ రామ రామ హరే హరే!! అంటూ కృష్ణభగవానునినామస్మరణ చేస్తూ, త్రాసుయొక్క రెండవపళ్లెంలో తులసీదళం ఉంచింది. వెంటనే తులసి ఉంచినవైపుకు త్రాసు వంగిపోయింది. ఆభరణాలు అన్నీ తీసివేసి తులసీదళం మాత్రమే ఉంచినా కూడా త్రాసు బరువుగా ఆవైపే మొగ్గు చూపింది. ఇది చూసి రాణులందరూ, నారదుడు కూడా ఆశ్చర్యపడ్డారు. దీనివలన మనకు స్పష్టంగా తెలిసేదేమంటే, కృష్ణభగవానుడికి ఎల్లప్పుడూ తులసి అత్యంతప్రియం. ఆమె ఉన్నచోట ఆయన తప్పకుండా ఉంటాడు. ఈవిధంగా భగవంతుడు తనలీలలతో తులసిమహిమను రుజువు చేయడమే కాక తనను ఒకతులసీదళంతో పొందవచ్చు నని నిరూపించాడు.

## కృష్ణభక్తిప్రదం

శుకమహర్షి శ్రీమద్భాగవతము (3.15.43)లో బ్రహ్మ నలుగురు కుమారులు ఏవిధంగా భగవంతునిపట్ల ఆకర్షితు లైనారో వర్ణించారు.

**తస్యారవిందనయనస్య పదారవింద**
**కింజల్కమిశ్రతులసీమకరందవాయుః ।**
**అంతర్గతః స్వవివరేణ చకార తేషాం**
**సంక్షోభ మక్షరజుషా మపి చిత్తతన్వోః ॥**

భగవంతునిచరణకమలాలవ్రేళ్లనుండి తులసీదళసుగంధాన్ని మెల్ల మెల్లగా తీసుకొనిపోయేవాయువు ఆమునులనాసికాగ్రంవరకు చేరినపుడు

వారు బ్రహ్మజ్ఞానంపట్ల అనురక్తులు అయినప్పటికీ వారిశరీరంలోనూ, మనస్సులోనూ పరివర్తనం జరిగినట్లు అనుభవం కలిగింది.

అంటే – బ్రహ్మ నలుగురు కుమారులు (సనక, సనాతన, సనందన, సనత్కుమారులు) నిర్గుణబ్రహ్మజ్ఞానులు. భగవంతునిలో ఐక్యం కావడం గురించి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవారు. కాని భగవంతునిరూపం చూసిన వెంటనే వారిమనసు పరివర్తనం చెందింది. భగవంతునిచరణకమలాలనుండి వెలువడేసుగంధం, తులసిసుగంధంతో కలిసి వాయువుద్వారా చేరి వారి మనసును మార్చింది. వారు పరమేశ్వరునిలో ఐక్యం కాకుండా భక్తునిగా ఉండటం శ్రేష్ఠ మని అర్థం చేసుకున్నారు. భగవంతునిచరణకమలాలకు దాసుడిగా ఉండటం అనేది భగవంతునిలో ఐక్యం చెందటంకంటే శ్రేయస్కరం.

ఈనల్గురు మొదట నిర్గుణబ్రహ్మవాదులు. కాని భగవంతునిచరణాలలో అర్పిత మైనతులసిని ఆఘ్రాణించి సగుణవాదులు అయ్యారు. భగవంతునికి అర్పించినపూలు గాని, తులసి కాని వాసన చూసినవారు విష్ణువుఅనుగ్రహం పొంది, భగవంతుని దర్శించగలుగుతారు.

ఈవిధంగా తులసిదేవిని ఆరాధించేవారు చెడుబుద్ధిని విసర్జించి భగవంతునిశ్రీచరణాలకు సంపూర్ణంగా శరణాగతులు అవుతారు.

కృష్ణభగవానునికి తులసీదళం అర్పించినఅనంతరం దానిని స్వీకరించిన వారికి సహస్రచాంద్రాయణవ్రతం చేసినఫలితం దక్కుతుంది. వారిదేహం పవిత్ర మవుతుంది. మహాపాపికి కూడా తులసీదళం సేవిస్తే, సద్గతి ప్రాప్తిస్తుంది. ఎంతదుర్మార్గు డయినా, జీవితంలో అంతిమసమయంలో శ్రద్ధా భక్తులతో తులసీదళాన్ని సేవిస్తే పాపాలన్నీ భస్మమవుతాయి. శుభపరంపరలు కలుగుతాయి.



## 8. తులసిమందిరాలు - కుజదోషనివృత్తి

విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించేరోజు లవి. ఆయన ఆస్థానగురువు వ్యాసతీర్థులు. ఒకరోజు వ్యాసతీర్థులవారు శ్రీకృష్ణదేవరాయలతో నీకు గ్రహదోషం ఉంది. సింహాసనం నుంచి లేచి ఒక్క క్షణకాలంపాటు ప్రక్కకు రమ్మని చెబుతాడు. రాజు అలాగే చేశాడు. అప్పుడు క్షణకాలంపాటు వ్యాసతీర్థులు ఆసింహాసనంమీద కూర్చుని పైకి లేస్తారు. లేచినవెంటనే సింహాసనం కాలి, బూడిదైపోతుంది. శ్రీకృష్ణ దేవరాయలు ఆశ్చర్యపడి గురువుగారినే రాజ్యపాలన చేయమంటాడు. వ్యాసతీర్థులు అందుకు ఒప్పుకోరు. 'మేము బ్రాహ్మణులం. కాబట్టి కేవలం సూచనలు ఇవ్వడమే గాని, రాజ్యపాలన చేయం' అని చెబుతాడు. అప్పటినుంచి వ్యాసతీర్థులవారికి వ్యాసరాయలు అని పేరు వచ్చింది.

ఒకసారి కుజగ్రహదోషనివారణోపాయం చెప్ప మని రాజు గురువు గారిని అడుగుతాడు. రాజ్యంలో తులసిమందిరాలను నిర్మించ మని గురువు ఆదేశిస్తాడు. రాజు 700లకు పైగా తులసిమందిరాలను నిర్మిస్తాడు.

వ్యాసతీర్థులు హంపీనుండి పెనుగొండకు ప్రయాణం చేస్తున్న సమయంలో అనంతపురం జిల్లాలోని మడకశిరప్రాంతం దగ్గర విడిది చేయవలసివచ్చింది. ఆరోజు రాత్రి కలలో ఒకఅందమైన 16 సంవత్సరాల అమ్మాయి కనపడి నేనెవరో తెలుసా అని అడుగుతుంది. వ్యాసతీర్థులు గుర్తించలేకపోతున్నాను అంటాడు. ఆఅమ్మాయి నేను "తులసీదేవి"ని అని చెప్పి అదృశ్యమైపోతుంది.

ఈవిషయాన్ని అక్కడ ఉన్న గుడిపూజారికి చెబుతాడు. పూజారి తులసీదేవివిగ్రహాన్ని ప్రతిష్ఠ చేయ మని చెబుతాడు. శ్రీకృష్ణదేవరాయలు తులసీదేవిమందిరాన్ని నిర్మించారు. అక్కడే వేణుగోపాలస్వామిని, హనుమద్ విగ్రహాలను కూడా ప్రతిష్ఠ చేశారు. భీమసేనుడు, మధ్వాచార్యులవిగ్రహాలు

కూడా హనుమంతునివిగ్రహంలో ఉండేవి. తులసీదేవి విగ్రహం 5,000 సం॥ క్రితం నందగ్రామంలో వృందకుండ అనేచోట మాత్రమే ఉంది. తరువాత కాలంలో కృష్ణదేవరాయలు ప్రతిష్ఠించినదే.

అనంతపురం జిల్లాలో నేమకల్లు, మారుడి, కసాపురం గ్రామాల్లో హనుమంతునివిగ్రహాలను శ్రీకృష్ణదేవరాయలు వ్యాసతీర్థులద్వారా ప్రతిష్ఠ చేయడం జరిగింది. వ్యాసతీర్థులు ప్రతిష్ఠించిన హనుమంతునివిగ్రహాల ప్రత్యేకత ఏమంటే, హనుమంతునితోకకు గంట కట్టబడిఉంటుంది.

కసాపురంలో (గుంతకల్లు)లో ప్రతిష్ఠించిన "ఆంజనేయస్వామి"కి ప్రతి సంవత్సరం పాదరక్షలు ఉంచుతారు. ఆపాదరక్షలు చాలా పెద్దవిగా ఉంటాయి. మరుసటిసంవత్సరానికి అవి అరిగిపోతాయి. ఆగ్రామస్థులు మరలా క్రొత్తపాదరక్షలు చేసి స్వామికి సమర్పిస్తారు. ఇదీ అక్కడ విశేషం.

## 9. తులసిమహిమ - పురాణవచనాలు

**ప్రదక్షిణం భ్రమిత్వా యే, నమస్కుర్వన్తి నిత్యశః ।**
**న తేషామ్ దురితం కించి, దక్షీణం అవశిష్యతే ॥**

**(హరిభక్తివిలాసం 9.111 అగస్త్యసంహిత)**

ప్రతిదినం తులసికి ప్రదక్షిణం చేసి ప్రణామాలు అర్పించినవారిపాపం పూర్తిగా నశించిపోతుంది.

**హిత్వా తీర్థసహస్రాణి, సర్వా నపి శిలోచ్చయాన్ ।**
**తులసీకాననే నిత్యం, కలౌ తిష్ఠతి కేశవః ॥**

**(హరిభక్తివిలాసం, 9.116 స్కాందపురాణం)**

కలియుగంలో కేశవుడు అన్ని పుణ్యక్షేత్రాలనూ పర్వతాలనూ విడిచిపెట్టి, తులసీవనంలో నిత్యం నివాసం చేస్తాడు.



**స్నానే దానే తథా ధ్యానే, ప్రాశనే కేశవార్చనే ।**
**తులసీ దహతే పాపం, రోపణే కీర్తనే కలౌ ॥**

**(హరిభక్తివిలాసము 9.132 స్కాందపురాణం, అవంతిఖండము)**

కలియుగంలో తులసికి అభిషేకం చేసినవారు, తులసిని దానంగా ఇచ్చినవారు, ఆమెను ధ్యానం చేసినవారు, తులసి పత్రాలను సేవించినవారు తులసితో కేశవుని పూజించినవారు, తులసిమొక్కను ఒకస్థానంనుండి తీసి వేరొకస్థానంలో నాటినవారు లేదా తులసిమహిమను కొనియాడేవారు, వీరందరి సమస్తపాపాలను తులసీదేవి దహించివేస్తుంది.

**తులసీ రోపితా యేన, పుణ్యారామే వనే గృహే ।**
**పక్షీన్ద్ర! తేన సత్యోక్తం, లోకాః సప్త ప్రతిష్ఠితాః ॥**

**(హరిభక్తివిలాసం 9.157 గరుడపురాణంనుండి)**

పక్షులరాజా (గరుడా), వనంలో లేదా గృహంలో తులసిని నాటిన వాడు ఏడు లోకాలను జయిస్తాడు. ఇది సత్యం.

**తృణాని తులసీమూలాత్, యావ న్త్యపహినోతి వై ।**
**తావతీః బ్రహ్మహత్యా హి, ఛిన త్త్యేవ న సంశయః ॥**
**(హరిభక్తివిలాసం 9.165 బృహన్నారదీయపురాణం,**
**యమరాజు భగీరథుల వార్తాలాపం)**

తులసివృక్షంమూలంలో ఉన్న ఎన్నిగడ్డిపోచలను లేదా ధూళికణాలను తొలగిస్తాడో అన్ని బ్రహ్మహత్యాపాపాలు నిస్సందేహంగా అతనినుండి దూర మవుతాయి.

**'తులసీమూలసంభూతా, హరిభక్తిపదోద్భవా ।**
**గంగోద్భవా చ మృల్లేఖా, నయ త్యచ్యుతరూపతామ్ ॥**
**(హరిభక్తివిలాసం 9.189 స్కాందపురాణం)**

తులసిమొక్క మూలంనుండి తీసుకొన్నమట్టితో కాని, శ్రీవైష్ణవుని చరణకమలాలనుండి తీసుకొన్నమట్టితో గాని, గంగమట్టితో గాని పెట్టుకున్న తిలకం – వారికి విష్ణుభగవానునిరూపం కలిగిస్తుంది.

**కృత్వా పాపసహస్రాణి, పూర్వే వయసి మానవః ।**
**తులసీభక్షణాత్ ముచ్యేత్, శ్రుత మేతత్ పురా హరేః ॥**
**(హరిభక్తివిలాసం 9.218 స్కాందపురాణం)**

జీవితంలో తులసి భక్షణానికి పూర్వం వేలకొలది పాపాలు చేసినా కూడా తరువాత తులసీ పత్రం సేవిస్తే, సమస్తపాపాలనుండి అతడు ముక్తుడు అవుతాడు.

**దారిద్ర్యదుఃఖభోగాదిపాపాని సుబహూ న్యపి ।**
**తులసీ హరతి క్షిప్రం, రోగా నివ హరీతకీ ॥**

హరీతకి (కరక్కాయ) అన్ని రోగాలను వెంటనే దూరం చేసినవిధంగా తులసి దరిద్రం, దుఃఖం మొదలైనవాటితో సంబంధం ఉండే అత్యంత పాపాలన్నీ శీఘ్రమే దూరం చేస్తుంది.

**కోటిబ్రహ్మాండమధ్యేషు, యాని తీర్థాని భూతలే ।**
**తులసీదళ మాశ్రిత్య, తా న్యేవ నివసన్తి వై ॥**

అనంతకోటిబ్రహ్మాండాలలో ఉన్నతీర్థాలు అన్నీ తులసీపత్రాన్ని ఆశ్రయించుకొని నివాసం చేస్తుంటాయి.

**తులసీం సేవతే య స్తు, భక్తిభావసమన్వితః ।**
**సేవితా స్తేన తీర్థా శ్చ, దేవా బ్రహ్మాదయ స్తథా ॥**

శ్రద్ధాభక్తులతో తులసికి సేవ చేసినవారు సమస్తతీర్థస్థానాలనూ, బ్రహ్మ మొదలుకొని సమస్తదేవతలనూ సేవించినఫలితం పొందుతారు.



**ప్రదీపం య స్తు సన్ధ్యాయాం, స్థాపయే త్తులసీతలే ।**
**స యాతి మందిరం విష్ణోః, కులకోటిసమన్వితః ॥**

సంధ్యాసమయంలో తులసిమూలం దగ్గర ఎవరు దీపం పెడతారో, వారు తమకోట్లాదికుటుంబసభ్యులతో కలిసి భగవంతునిధామ మైన వైకుంఠలోకానికి వెళ్తారు.

**సుధాఘటసహస్రేణ, సా తుష్టి ర్న భవే ద్ధరేః ।**
**యా చ తుష్టి ర్భవే న్నృణాం, తులసీపత్రదానతః ॥**
**(బ్రహ్మవైవర్తపురాణం, ప్రకృతిఖండం 21.40)**

సాధ్వీ! శ్రీహరికి తులసీపత్రం అర్పించడంవలన కలిగినంతతృప్తి – వేలకొలది కుంభములఅమృతంతో అభిషేకం చేసినప్పటికీ కలుగదు.

**తులసీపత్రతోయం చ, మృత్యుకాలే పిబేత్ నరః ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో, విష్ణులోకం స గచ్ఛతి ॥**
**(బ్రహ్మవైవర్తపురాణం, ప్రకృతిఖండం 21.42)**

మరణసమయంలో నయినా భక్తిపూర్వకంగా తులసీజలం గ్రహించిన వారిపాపాలు మొత్తం నశిస్తాయి. అతడు విష్ణులోకానికి వెళ్తాడు.

**నాస్తి వేదాత్ పరం శాస్త్రం, న హి కృష్ణాత్ పరః సురః ।**
**నాస్తి గంగాసమం తీర్థం, న పుష్పం తులసీపరమ్ ॥**

వేదాలకన్నా శ్రేష్ఠ మైనశాస్త్రం లేదు, కృష్ణుడిని మించినదేవుడు లేదు. గంగతో సమాన మైనతీర్థం లేదు. అదే విధంగా తులసిని మించినపుష్పం కూడా ఏమీ లేదు.

**ధాత్రీఫలేన యత్ పుణ్యం, జయన్త్యా మ ప్యుపోషణే ।**
**ఖగేంద్ర! భవతి నృణాం, తులసీపూజనేన తత్ ॥**
**– గరుడపురాణము**

ఓ సర్వశ్రేష్ఠపక్షిగరుడా! ఉసిరి స్వీకరించుటవలన మరియు జన్మాష్టమి, (ఏకాదశులలో) ఉపవాసం చేయడంవలన ఏలాభం ప్రాప్తిస్తుందో, కేవలం తులసిపూజ చేయడంవలన అది ప్రాప్తిస్తుంది.

**తులసీసంనిధౌ ప్రాణాన్, యే త్యజన్తి మునీశ్వర ।**
**న తేషాం నరకక్లేశః, ప్రయాన్తి పరమం పదమ్ ॥**
**(హరిభక్తివిలాసం 9.154 అగస్త్యసంహిత)**

మునీశ్వరా! తులసివృక్షం సమీపంలో ప్రాణాలు విడిచినవారికి, నరక బాధ ఉండదు. వారు పరమపదమైన వైకుంఠలోకాన్ని చేరుకుంటారు.

**కృతం యేన మహాభాగ, తులసీవనరోపనమ్ ।**
**ముక్తి స్తేన భవే ద్దత్తా, ప్రాణినాం వినతాసుత ॥**
**(హరిభక్తివిలాసం 9.156 గరుడపురాణం నుండి)**

వినతాపుత్రుడా! తులసివృక్షాన్ని నాటినవాడు, ఆతులసిని చూచిన సమస్తప్రాణులకు మోక్షాన్ని ఇస్తాడు.

**తులసీకాననం యత్ర, యత్ర పద్మవనాని చ ।**
**పురాణపఠనం యత్ర, తత్ర సన్నిహితో హరిః ॥**

తులసీవనం, కమలాలతో కూడినసరోవరం, శ్రీమద్భాగవతపఠనం ఎక్కడ ఉంటుందో, అక్కడ హరి సన్నిహితుడై ఉంటాడు.

**తులస్యాం సించయేద్ య స్తు, చులుకోదకమాత్రకః ।**
**క్షీరోదశాయినా సార్ధమ్, వసే దాచంద్రతారకమ్ ॥**
**(హరిభక్తివిలాసం 9.162)**

తులసిమూలంలో గుక్కెడు జలం పోసేవాడు సూర్యచంద్రు లున్నంత వరకు విష్ణుసన్నిధిలో నివసిస్తాడు.

**కేశవాయతనే య స్తు, కారయేత్ తులసీవనమ్ ।**
**లభతే చాక్షయం స్థానం, పితృభిః సహ వైష్ణవమ్ ॥**



కేశవునిమందిరంలో తులసీవనాన్ని పెంచేవాడు తనపూర్వజులతో కలిసి భగవంతుడి శాశ్వతధామాన్ని పొందుతాడు.

**కస్మా దితి న జానీమః, తులస్యా హి ప్రియో హరిః ।**
**గచ్ఛన్తం తులసీహస్తం, రక్షణా యానుగచ్ఛతి ॥**

భగవంతునికి తులసి ఎందుకు అంత ప్రియమో మనకు తెలియదు. కాని తులసిని చేతులలో ఉంచుకొని పోయేవారిని రక్షించడానికి శ్రీహరి ఎప్పుడూ వారిని వెన్నంటి పోతూ ఉంటాడు.

**నిషిద్ధే దివసే ప్రాప్తే, గృహ్ణీయాద్ గలితం దలమ్ ।**
**తే నైవ పూజాం కుర్వీత, న పూజా తులసీం వినా ॥**

తులసీదళం లేకుండా భగవంతుని పూజచేయరాదు. నిషిద్ధదినములలో తులసి కోయరాదు. కాబట్టి ఆరోజులలో తులసిమొక్కదగ్గర పడిపోయిన పత్రాలతో పూజ చేయాలి.

**మందారకుందకురవోత్పలచంపకార్ణ -**
**పున్నాగనాగబకులామ్బుజపారిజాతాః ।**
**గంధే ఽర్చితే తులసికాభరణేన తస్యా**
**యస్మిం స్తపః సుమనసో బహు మానయన్తి ॥**
**(శ్రీమద్భాగవతం 3.15.19)**

మందార, తామర, మల్లె, కురవక, కలువ, సంపెంగ, అర్ణ, పున్నాగ, నాగకేసర, పొగడ, తెల్లకలువ మరియు పారిజాతం మొదలగు పుష్పవృక్షములు దివ్యసుగంధభరిత మైనవి. అయినా కూడా అవి తులసి చేసినతపస్సులను ప్రశంసిస్తాయి. ఎందుకంటే భగవంతుడు తులసిసుగంధానికి విశేష ప్రాముఖ్యం ఇచ్చాడు. ఆయన తులసీమాలనే అలంకరించుకుంటాడు.

**పుష్కరాదీని తీర్థాని, గంగాద్యాః సరిత స్తథా ।**
**వాసుదేవాదయో దేవా, వసన్తి తులసీదళే ॥**

పుష్కరం మొదలైన అనేకతీర్థాలు, గంగ మొదలైన అనేకనదులు వాసుదేవుడు మొదలైనదేవతలు తులసీదళంలో నివాసం ఉంటారు.

## 10. అర్చనలో తులసి

శ్రీమతి తులసీదేవివర్ణన అన్ని ముఖ్యగ్రంథాలలోనూ లభ్యమవుతుంది. కేవలం భగవద్భక్తులే కాదు, గొప్పగొప్ప ఋషులు, మునులు, భగవంతుడు కూడా స్వయంగా ఆమెమహిమను, గుణగణాలను కీర్తించడంలో ఆనందాన్ని, పరమపవిత్రతను అనుభవిస్తారు. ముఖ్యంగా పురాణాలలో మనకు తులసీదేవి మహిమ లభ్యమవుతుంది. పద్మపురాణం(6.107.28)లో చెప్పబడినప్రకారం తులసిమహిమను బ్రహ్మ తననాలుగుముఖాలతో కూడా వర్ణించలేడు.

శ్రీకృష్ణ ద్వైపాయనవ్యాసుడు రచించినగరుడపురాణంలో భగవంతుడే స్వయంగా గరుడునితో ఇలా అన్నాడు. "ఓ పక్షిరాజా! బ్రాహ్మణుడు, మంత్రం, దర్భ, అగ్ని, తులసి వీటిని మాటిమాటికీ సమర్పించినప్పటికీ కలుషితం కావు. ఎప్పటికీ మలినం కానేరవు. వీటిని పూజలో మరల మరల ఉపయోగించవచ్చు. పక్షీంద్రుడా! తులసి, బ్రాహ్మణుడు, గోమాత, విష్ణువు, ఏకాదశీవ్రతం అనేవి సంసారసాగరంలో మునిగి తేలుతున్నప్రజలను నౌకవలె అవతలిఒడ్డుకి చేరుస్తాయి. పక్షిశ్రేష్ఠుడా! విష్ణువు, ఏకాదశీవ్రతం, భగవద్గీత, తులసి, బ్రాహ్మణుడు మరియు గోమాత ఈఆరు ప్రపంచంలోని మనుష్యులకు ముక్తి ప్రసాదించేసాధనాలు. వీటిని షట్పది అంటారు.

### తులసిదళం

'తులసీదళం లేకుండా చేసే అర్చన, అర్చన కాదు. తులసీదళం లేని ప్రసాదం, ప్రసాదం కానే కాదు.

వాయుపురాణంలో ఈవిధంగా వర్ణించబడింది – 'భగవంతుడైన జనార్దనుడు తులసి లేకుండా చేసేఅర్చన సేవను స్వీకరించడు. ఒకవేళ తులసీదళం లేకుండా ఉంటే తులసికాష్టాన్ని (ఎండినకొమ్మను) స్పర్శించి



భగవంతునికి పూజ చేయాలి. ఒకవేళ తులసికాష్టం కూడా లేనిపక్షంలో తులసినామం ఉచ్చరించి జనార్దనునికి అర్చన చేయాలి.

విష్ణురహస్యం అనే వైదికగ్రంథంలో ఈవిధంగా చెప్పబడింది. సుందరమైన, చిగురుటాకులు కలిగినపూలగుత్తితో, ఆకుపచ్చనివర్ణం కలిగిన తులసీదళాన్ని జనార్దనునికి అర్పించాలి. కృష్ణవర్ణం కాని, హరితవర్ణం కాని లేదా ఏతులసి అయినా భగవంతునికి ప్రియమే. అన్ని రకాలైన పుష్పాలకంటే కృష్ణభగవానునికి తులసి అంటే ప్రీతి ఎక్కువ.

కామికా ఏకాదశీవ్రతమాహాత్మ్యంలో ఈవిధంగా చెప్పబడింది –

**"తులసీమంజరీభి స్తు, పూజితో యేన కేశవః ।**
**ఆజన్మకృతపాపస్య, తేన సమ్మార్జితా లిపిః ॥**

తులసీమంజరిద్వారా కేశవునికి పూజ చేసినవాని అనేకజన్మలసంచిత పాపరాశి భస్మ మవుతుంది.

అగస్త్యసంహితలో ఈవిధంగా చెప్పబడింది. 'మంత్రం ఉచ్చరిస్తూ ఒక తులసీదళ మైనా శ్రీహరిపాదాలకు అర్పిస్తే, ఆపత్రం అనంతఫలితాలను ఇస్తుంది'.

పద్మపురాణంలో ఈవిధంగా చెప్పబడింది: 'తులసీమంజరిద్వారా జనార్దనుని పూజించేవారు మరల తల్లిగర్భంలోకి వెళ్లవలసినఅవసరం లేదు.'

శ్రీహరిభక్తిశుభోదయంలో యమధర్మరాజు బ్రాహ్మణుల కిలా చెబుతాడు – ధార్మికుడైనా లేదా అధార్మికుడైనా తులసీదళంతో కేశవుని పూజిస్తే అతనిని నేను స్పర్శించను. అంతే కాక అతడు స్వయంగా విష్ణుదూతలే తీసుకొని పోగలిగినంతయోగ్యతను పొందుతాడు.

తులసీదళంతో విష్ణుభగవానుని కాకుండా అన్యదేవతలను పూజించిన వారు గోహత్య, బ్రహ్మహత్య, గురుపత్నితో సంగమం చేసినవారితో సమానమైన పాపులు అవుతారు.

## తులసిగంధం

తులసివేర్లదగ్గర ఉన్నమట్టిని నుదుట లేదా శిరస్సున ధరిస్తే జీవితంలో ఎదురయ్యే ఆటంకా లన్నీ తొలగిపోతాయి. అగస్త్యసంహితలో ఈవిధంగా వర్ణించబడినది – తులసికర్రతో కంఠమాల లేదా జపమాల చేసి దానితో భక్తిపరమైన సాధన చేసినట్లైతే అతనికి అక్షయఫలితం సిద్ధిస్తుంది.

తులసీకాష్ఠచందనమాహాత్మ్యం గురించినవర్ణన గరుడపురాణంలో లభ్య మవుతుంది. 'భగవంతునికి తులసీకాష్ఠచందనం అర్పించినమాత్రంచే వ్యక్తి యొక్క నూరు జన్మలపాపాలన్నీ నిస్సందేహంగా దహించుకుపోతాయి. మరణించేసమయంలో వ్యక్తి శరీరానికి తులసీచందనం లేపనం గావించినచో, ఆవ్యక్తి నిశ్చింతగా భగవంతునితో సమానమైనరూపం పొంది స్వామిలోకంలో నివసిస్తాడు. కలియుగంలో భగవంతునికి తులసీచందనం అర్పించినయెడల ఆవ్యక్తి భగవంతునిలోకంలో నివసిస్తాడు. భగవంతుని అర్చనామూర్తికి తులసీకాష్ఠచందనాన్ని భక్తిపూర్వకంగా అలంకరిస్తే ఆవ్యక్తి ఎప్పుడూ భగవంతునికి సమీపంలోనే నివసిస్తూ ఉంటాడు. కలియుగంలో మార్గశిరమాసంలో భగవంతునికి తులసీకాష్ఠచందనం అర్పించినవారు నిశ్చయంగా కృతార్థులు అవుతారు.

కృష్ణునివిగ్రహానికి నిష్ఠతో తులసీచందనం పూసినవారు ఎప్పుడూ కృష్ణునికి సమీపంలోనే ఉంటారు. తులసిమూలంలోనిమట్టిని తనశరీరంపై ధరించి, కృష్ణునిమూర్తిని ఆరాధించినవారు ప్రతిరోజు నూరురోజులపూజ చేసినఫలితాన్ని పొందుతారు. కృష్ణభగవానునికి తులసిమంజరిని సమర్పించినవారు అనేకరకాలైనపుష్పాలను అర్పించినఫలితాన్ని పొందుతారు. చివరకు కృష్ణధామాన్ని చేరుకుంటారు.

భగవంతునిచరణకమలాలపై అర్పించిన తులసిసుగంధాన్ని వాసన చూడనివారు ఊపిరితో ఉన్నా, చనిపోయినవారితో సమానం.



## తులసిమాల

తులసికాష్ఠమాలను భక్తిపూర్వకంగా నాకు నివేదించి, తరువాత ప్రసాదంగా తలచి, దానిని ధరించినవారిసమస్తపాపాలు నశిస్తాయి, వారిపైన నేనెప్పుడూ ప్రసన్నంగా ఉంటాను అని విష్ణువు స్వయంగా చెప్పాడు.

## తులసివనం

తులసీవనాన్ని పెంచేవాడు యమధర్మరాజును ఎప్పుడూ చూడడు. కార్తికమాసంలో మరిచి పోకుండా హారతి, ప్రదక్షిణ, స్తుతి మరియు అన్ని విధాలైనసేవలు చేయాలి. కార్తికమాసంలో వ్యక్తి తప్పనిసరిగా తులసిని నాటడం, తులసిమొక్కను దానం చేయడంవంటివి చేయాలి. ఆవిధంగా చేస్తే మనసులో భగవంతునిపై భక్తి వికసిస్తుంది. కార్తికమాసంలో దామోదరుడిని ప్రసన్నం చేసుకొనేందుకు తులసిసేవను హృదయపూర్వకంగా స్వీకరించాలి. ఎందుకంటే అతనిహృదయం శీఘ్రంగా భగవంతునిప్రేమకు అనుకూల మవుతుంది.

తులసీ కాష్ఠం లేదా తులసి పచ్చటిదళం లేదా ఎండిపోయినదళం ఎవరిఇంటిలో ఉంటుందో, వారిఇంటిలో కలియుగపాపం ప్రవేశించదు.

## తులసి సంగ్రహణవిధానం

భగవంతునిపూజకోసం తులసిని పోగుచేయడం భక్తుని ప్రథమ కర్తవ్యం. స్నానం చేయకుండా తులసిదళాలను పోగుచేయకూడదు. స్నానం చేసినతరువాత చేతులను జోడించి, ప్రణామాలు అర్పించి, తగిన మంత్రాలను ఉచ్చరిస్తూ తులసీదళాలను తీసుకోవాలి. ఒక్కొక్కదళంగా కోయాలి. తులసీదళాలను త్రుంచుకొనేటపుడు తులసీదేవికి ఎటువంటి ఆపద, కష్టం కలుగకుండా చూడాలి. చేతివేళ్లగోళ్లను ఉపయోగించి తులసి పత్రాలను త్రుంచకూడదు. తులసికొమ్మలు, రెమ్మలు ఏవీ విరిగిపోకూడదు.

పుష్పాలతో కూడినతులసీదళాలు, క్రింద పడిపోవడానికి సిద్ధంగా ఉన్న తులసీదళాలు, పసుపువర్ణం కలిగినతులసీదళాలను తీసుకోవాలి. లేత తులసీదళాలను ఏరకూడదు. పూలు వికసించినవెంటనే వాటిని త్రుంచి భగవంతునిపాదాలకు సమర్పించాలి. అవి విత్తనాలుగా మారనివ్వకూడదు, ఎందుకంటే విత్తనాలుగా మారడానికి మొక్కశక్తి అధికమోతాదులో ఉపయోగించబడుతుంది. కృష్ణునిసేవకొరకు ఎక్కువ తులసీదళాలు, పుష్పాలు ఏర్పడడానికి మొక్కశక్తిని ఉపయోగించవచ్చు.

బ్రహ్మవైవర్తపురాణ 2.21.51-52 లో చెప్పినప్రకారం

"పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి, ఆదివారం రోజులలోనూ, సంక్రాంతి నాడు, స్నానానికి పూర్వం నూనె మర్దన చేసుకొన్నప్పుడూ, మధ్యాహ్న సమయంలోనూ, రాత్రియందూ, మధ్యాహ్నం (రెండు సంధ్యల నడుమ కాలం), అపవిత్రసమయంలో, అపవిత్రఅవస్థలో తులసీదళాలను పోగు చేయడం శ్రీహరిమస్తకాన్ని ఛేదించినదానితో సమానం" అని స్మృతిశాస్త్రాలు చెబుతున్నాయి. కాని శ్రీకృష్ణభక్తగణం కేవలం ద్వాదశితిథియందు, రాత్రిసమయంలో తులసిని త్రుంచరాదు. **"న ఛిన్ద్యాత్ తులసీమ్ విప్ర ద్వాదశ్యామ్ వైష్ణవః క్వచిత్"** ద్వాదశిరోజు తులసీదళాన్ని త్రుంచితే వ్యక్తి ఆయువు క్షీణిస్తుంది. అంతేకాక అతడు దూషితమైన, నికృష్టమైన పరిస్థితులలో పడిపోతాడు. కావున ఏకాదశిరోజే అధికంగా పోగుచేసుకొని ఉంచుకోవాలి.

కృష్ణభగవానుడు తులసీదళాలతో అల్లినమాలను ఇష్టపడతాడు. తులసీదళంపై చందనం పూసి భగవంతునిచరణకమలాలకు సమర్పించడం సర్వశ్రేష్ఠ మైనఆరాధన. తులసీదళాలను విష్ణుభగవానుడిపాదాలకు మాత్రమే అర్పించాలి, ఇతరదేవతలపాదాలపై ఉంచకూడదు. ఒకవేళ ఎవరైన హరికి కాకుండా ఇతరదేవతలకు తులసిని అర్పించినచో ఒకబ్రాహ్మణుని లేదా గోవును హత్య చేసినపాపం, గురుపత్నితో సంభోగం చేసినపాపం వస్తుంది.



శ్రీమతి రాధారాణిహస్తంలో తులసీదళం, కృష్ణభగవానునికి అర్పించుటకొరకు ఉంచవచ్చు.

తులసీదళాలను మరియు పుష్పాలను ఎప్పుడూ కూడా టీ (Tea) తయారు చేయడానికో లేదా జ్యూస్ తయారీకో ఉపయోగించకూడదు, ప్రాపంచికవిషయాలకు అనగా ఉదాహరణకు మందులు (ఔషధాలు) తయారీకి వాడటం లేదా వేడిచేయడం మహాఅపరాధం. తులసినీడపై నడవకూడదు. పాదుకలు ధరించి తులసిని స్పర్శించకూడదు.

భగవంతునిపూజకొరకు తులసీదళాలను స్నానం చేయకుండా త్రుంచిన వాడిసమస్తకార్యాలు నిష్ఫలమవుతాయి. తిరిగి అతడు గోమూత్రాన్ని పానం చేస్తేనే పవిత్రుడు అవుతాడు.

తులసిఆకులు రాలి, కొమ్మలలో కూడా పచ్చదనం లేకుండా పూర్తిగా ఎండిపోయినప్పుడు మాత్రమే పెకలించాలి. తులసికాండంలో పచ్చదనం ఉన్నప్పుడు పెకలించకూడదు.

తులసిఆకులను కాని, దళాలను గాని, మొక్కలను గాని కోయడానికి కత్తిలాంటి ఆయుధాలను ఉపయోగించకూడదు. కేవలం చేతులతో మాత్రమే తీయాలి. కత్తిరించడం గాని, వేరు చేయడం కాని చేయకూడదు. ఒకవేళ చాలా అవసరమైతే ఎండిపోయిన (చనిపోయిన) కొమ్మలను చేతితో త్రుంచివేయాలి. కొమ్మలు మార్గంలో అవరోధంగా ఉంటే, వాటిని కట్టివేయాలి. తులసిపత్రాలను, పుష్పాలను ఉదయం మాత్రమే తీసుకోవాలి. కృష్ణునిఆరాధనకొరకు లేక నైవేద్యంలో ఉంచి అర్పించుటకు మాత్రమే దళాలను తీసుకోవాలి. ఒక్కొక్కవంటకంపై కనీసం ఒక్క దళ మైనా ఉంచాలి. శ్రీహరికి అర్పించడానికి కాకుండా వేరే ఏఉద్దేశ్యంతోనైనా తులసీదళాలను త్రుంచకూడదు.

తులసిమొక్క శరీరం వదలిపెట్టినప్పుడు ఆకట్టెలు చాలా బలహీనంగా ఉంటాయి. దానిని హోమగుండం అగ్నిలో అర్పించవచ్చు. భూమిలో పాతిపెట్టాలి. లేదా నదిలో వేయాలి.

తులసిమొక్క పైన ఎటువంటి రసాయనద్రవ్యాలు చల్లకూడదు.

తులసిచెట్టుకు ప్రదక్షిణం చేసేటప్పుడు నీడను త్రొక్కడం కానీ, దాటడం కానీ చేయకూడదు.

తులసీదేవి గొప్ప సౌభాగ్యవంతురాలు. తులసికి ఎల్లప్పుడూ భగవంతుని చరణకమలాలపైనా, అతనికి అర్పించేనైవేద్యం అన్నింటిపైనా ఉండేవిధంగా ఆశీర్వాదం మరియు వరం ప్రాప్తించింది. తులసీదళాలను త్రుంచునపుడు స్కందపురాణంలోని ఈమంత్రాన్ని ఉచ్చరించవలెను.

**తుల స్యమృతజన్మ తే, సదా త్వం కేశవప్రియా ।**
**కేశవార్థే చినోమి త్వాం, వరదా భవ శోభనే ॥**

"తులసీదేవి! అమృతంనుండి నీవు జన్మించావు. నీవు ఎప్పుడూ కేశవునికి అత్యంతప్రియమైనదానవు. ఆకేశవునికోసమే నేను తులసీదళాలను పోగుచేస్తున్నాను. సుందరతులసీ! దయచేసి భగవంతునికి సేవ చేసే అవకాశాన్ని మాకు ప్రసాదించు."

ఈమంత్రాన్ని ఉచ్చరిస్తూ తులసీదేవికి ప్రణామాలు అర్పించి, కుడి చేతితో మెల్లమెల్లగా ఒక్కోదళం లేదా రెండుదళాలతో కూడినపుష్పాన్ని త్రుంచి ఒకపవిత్రమైనపాత్రలో ఉంచుకోవాలి. కీటకాలు లేదా తునిగినపత్రాలను పోగుచేయకుండా మంచిపత్రాలనే తీసుకోవాలి.

ఒకచిన్నమొక్కనుండి ఎక్కువ దళాలను ఎప్పుడూ లాగకూడదు. ఆమెకు కష్టం కలుగుతుంది.

తులసిని పోగుచేసుకొని దానిని ఏడురోజులవరకు ఉంచుకోవచ్చు. ఒకవేళ ఆరోజు తులసీదళం లేకపోతే, ముందు రోజు నివేదించినతులసినే



శుద్ధజలంతో కడిగి ఉపయోగించవచ్చు. ఒకవేళ తులసిదళం లభ్యం కాకపోతే, తులసి ఎండినకొమ్మను స్వామిదేహానికి తాకించాలి. ఎండినతులసి కొమ్మ కూడా లభ్యం కాకపోతే, తులసినామం ఉచ్చరిస్తూ, ఆమె అక్కడ ఉన్నట్లు భావిస్తూ పూజ పూర్తి చేయాలి. తులసి దొరకనిచోట తులసినామం ఉచ్చరించి, మానసతులసిని అర్పించాలి.

తులసిని త్రుంచినతరువాత ఈమంత్రం ఉచ్చరించాలి.

**చయనోద్భవదుఃఖం, యద్దేవి! తే హృది వర్తతే ।**
**క్షమస్వ మాం జగన్మాత, స్తులసి! త్వాం నమా మ్యహమ్ ॥**

"జగన్మాతా! తులసీదేవి! నేను మీకు సగౌరవంగా ప్రణామాలు అర్పిస్తున్నాను. మీదళాలను, పూలను తీసేటప్పుడు మీకు మనసులో కలిగిన కష్టంనుండి నన్ను క్షమించు."

గరుడపురాణంలో తులసిని ప్రోగుచేయునపుడు చెప్పవలసినమంత్రం –

**మోక్షైకహేతో! ధరణిప్రశస్తే! విష్ణోః సమ స్తస్య గురోః ప్రియేతి ।**
**ఆరాధనార్థం వరమంజరీకం, లునామి పత్రం తులసి! క్షమస్వ ॥**

"తులసీ! ఈజగత్తునుండి ముక్తిని ప్రసాదించే ఏకైకసాధనం నువ్వే. ఈభూమిమీద మీకు సమానం వేరెవ్వరూ లేరు. కృష్ణునిసేవకోసం మాత్రమే నేను నీనుండి దళాలను త్రుంచుతున్నాను. దయచేసి నన్ను క్షమించు" అని మనసులో అనుకుని దక్షిణహస్తంతో (కుడిచేత్తో) తులసీదళాలను, మంజరిని పోగుచేయాలి. తులసిమాలను తయారు చేయుటకు ఎప్పుడూ కూడా తులసిని సూదితో గ్రుచ్చకూడదు. దీనికి బదులుగా లేతకాడతో త్రుంచినతులసి ఆకులను నాలుగువైపులా దారంతో చుట్టి ముడివేయాలి.

తులసిపూలు లేదా మంజరులు త్రుంచునపుడు, త్రుంచక మునుపు, త్రుంచిన తరువాత మంత్రాలను ఉచ్చరించాలి. పూవుకు క్రింద ఉన్న

భాగంలో మొగ్గలు పూలవుతాయి. ఈవిధంగా ఒకపూగుత్తి తయారవుతుంది లేదా అవి శాఖలు అవుతాయి. మొగ్గలు పూలైతే విరిగిన లేదా సగం రేఖలున్న చిన్న పిరమిడ్ మాదిరిగా కనిపిస్తాయి. ఒకవేళ ఆమొగ్గలు శాఖలు అయితే అవి చిన్నచిన్నఆకులమాదిరిగా కనిపిస్తాయి. అవి శాఖలుగా పెరగడం మొదలు పెడితే పెరగనివ్వాలి. అటువంటిసమయంలో చిన్నశాఖల పైభాగం మాత్రమే త్రుంచుకోవాలి. త్రుంచేటప్పుడు మీరు చిన్నచిన్నకొమ్మలను వదల కూడదు, ఎందుకంటే ఈవ్యర్థభాగాన్ని అంతం చేయుటకు తులసి తనశక్తిని వినియోగించవలసి ఉంటుంది.

## 11. తులసిఆరాధన

### తులసి ఆరాధనవిధానం

తులసిదేహం ఆధ్యాత్మికమైంది. వృక్షరూపంలో ఉన్నా, ఆమె ఒకవ్యక్తి. ఎక్కడ కృష్ణునిపట్ల భక్తి కనిపిస్తుందో, అక్కడికి ఆమె వస్తుంది.

ప్రతిరోజు ప్రొద్దున్నే భక్తులు తులసికి జలదానం చేయాలి. తులసిని ప్రార్థించి, ఆమెకు నాల్గు ప్రదక్షిణలు చేయాలి. పుష్పం, ధూపం, (లేదా అగరుబత్తి) నేతిదీపం, రుచికలనైవేద్యం, పూజావస్తువులద్వారా తులసిని ఆరాధించాలి.

"ఏకాదశి మరియు ద్వాదశియందు జాగరణ చేసి తులసీస్తోత్రం పఠించి, తులసీదళంతో సాలగ్రామశిలను పూజించినవారి 32 రకాలైన అపరాధాలను శ్రీహరి క్షమిస్తాడు."

తులసీ! మీరు కృష్ణునికి అత్యంతప్రియ మైనవారు. మీరు అత్యధిక దయకలవారు, అందుకే నేను మీదయను భిక్షగా కోరుచున్నాను. 'దయచేసి నన్ను మీఅనుచరురాలుగా స్వీకరించండి. కృష్ణునిసేవ చేసేఅవకాశాన్ని కల్పించండి. మీదయ లేకుండా, ఆయన ప్రేమపూర్వకమైనసేవను నేను చేయలేను, కాబట్టి దయచేసి నన్ను మీదాసిగా చేసుకోండి." అని మనం



ప్రతిదినం, ప్రాతఃకాలంలో, సంధ్యాకాలంలో తులసికి విన్నవించుకోవాలి. ఆమెకృపకోసం యాచించాలి. ఆమె హారతిపాటలు పాడాలి.

ధ్యానం చేసేవారు, అష్టాంగయోగులు, బ్రాహ్మణులు, అందరూ యోగసాధన చేస్తారు, వేదాలను అధ్యయనం చేస్తారు. అందులో కొందరు ఏకాంతస్థలంలో ధ్యానం చేస్తారు. కొందరు గృహస్థులు వివిధతీర్థస్థానాలకు యాత్ర చేస్తారు. వారిలక్ష్యం ముక్తిని పొందడమే.

అటువంటిసాధన చేసి వారిని ముక్తి పొంద నివ్వండి, కానీ శ్రీహరి శుద్ధభక్తులకు ముక్తి అవసరం లేదు. "మాకు లక్షజన్మలు అయినా ఇవ్వు, కాని నేను మాత్రం బృందావనంలో నివసించా లనీ, అక్కడ రాధాకృష్ణులను సేవించా లనీ మాత్రమే కోరుకుంటున్నాను." పవిత్రమైనభక్తుడు ఈవిధంగా కోరుకుంటాడు.

1. శ్రీమద్భాగవతం 2. తులసీదేవి 3. గంగ 4. శుద్ధభక్తులు – ఈ నాల్గువస్తువులు ఉన్నచోట కృష్ణుడు ఎప్పుడూ నివసిస్తూ ఉంటాడు.

భక్తి కావాలంటే మనం తులసీదేవిని, నృసింహస్వామిని ప్రార్థించాలి, వారిని ఆరాధించాలి. వీరు భక్తిని రక్షించేవారు. నృసింహస్వామి భక్తిమార్గంలో వచ్చేటటువంటిఅవరోధాలను నాశనం చేస్తాడు.

### తులసి అష్టోత్తరశతనామావళి

| | | |
|---|---|---|
| ఓం శ్రీతులస్యై నమః | ఓం సత్యసన్ధాయై నమః | |
| ఓం నందిన్యై నమః | ఓం కాలహారిణ్యై నమః | |
| ఓం దేవ్యై నమః | ఓం గౌర్యై నమః | 10 |
| ఓం శిఖిన్యై నమః | ఓం దేవగీతాయై నమః | |
| ఓం ధారిణ్యై నమః | ఓం ద్రవీయస్యై నమః | |
| ఓం ధాత్ర్యై నమః | ఓం పద్మిన్యై నమః | |
| ఓం సావిత్ర్యై నమః | ఓం సీతాయై నమః | |

ఓం రుక్మిణ్యై నమః
ఓం ప్రియభూషణాయై నమః
ఓం శ్రేయస్యై నమః
ఓం శ్రీమత్యై నమః
ఓం మాన్యాయై నమః
ఓం గౌర్యై నమః 20
ఓం గౌతమార్చితాయై నమః
ఓం త్రేతాయై నమః
ఓం త్రిపథగాయై నమః
ఓం త్రిపాదాయై నమః
ఓం త్రైమూర్త్యై నమః
ఓం జగత్త్రయాయై నమః
ఓం త్రాసిన్యై నమః
ఓం గాత్రాయై నమః
ఓం గాత్ర్యై నమః
ఓం గర్భవారిణ్యై నమః 30
ఓం శోభనాయై నమః
ఓం సమాయై నమః
ఓం ద్విరదాయై నమః
ఓం ఆరాధ్యాయై నమః
ఓం యజ్ఞవిద్యాయై నమః
ఓం మహావిద్యాయై నమః
ఓం గుహ్యావిద్యాయై నమః
ఓం కామాక్ష్యై నమః

ఓం కులాయై నమః
ఓం శ్రియై నమః 40
ఓం భూమ్యై నమః
ఓం భవిత్ర్యై నమః
ఓం సావిత్ర్యై నమః
ఓం సర్వవేదవిదాంవరాయై నమః
ఓం శంఖిన్యై నమః
ఓం చక్రిణ్యై నమః
ఓం చారిణ్యై నమః
ఓం చపలేక్షణాయై నమః
ఓం పీతామ్బరాయై నమః
ఓం ప్రోతసోమాయై నమః 50
ఓం సౌరసాయై నమః
ఓం అక్షిణ్యై నమః
ఓం అంబాయై నమః
ఓం సరస్వత్యై నమః
ఓం సంశ్రయాయై నమః
ఓం సర్వదైవత్యై నమః
ఓం విశ్వాశ్రయాయై నమః
ఓం సుగన్ధిన్యై నమః
ఓం సువాసనాయై నమః
ఓం వరదాయై నమః 60
ఓం సుశ్రోణ్యై నమః
ఓం చంద్రభాగాయై నమః



ఓం యమునాప్రియాయై నమః
ఓం కావేర్యై నమః
ఓం మణికర్ణికాయై నమః
ఓం అర్చిన్యై నమః
ఓం స్థాయిన్యై నమః
ఓం దానప్రదాయై నమః
ఓం ధనవత్యై నమః
ఓం శౌచమానసాయై నమః 70
ఓం శుచిన్యై నమః
ఓం శ్రేయస్యై నమః
ఓం ప్రీతిచిన్తేక్షణ్యై నమః
ఓం విభూత్యై నమః
ఓం ఆకృత్యై నమః
ఓం ఆవిర్భూత్యై నమః
ఓం ప్రభావిన్యై నమః
ఓం గన్ధిన్యై నమః
ఓం స్వర్గిన్యై నమః
ఓం గదాయై నమః 80
ఓం వేద్యాయై నమః
ఓం ప్రభాయై నమః
ఓం సారస్యై నమః
ఓం సరసివాసాయై నమః
ఓం సరస్వత్యై నమః

ఓం శరావత్యై నమః
ఓం రసిన్యై నమః
ఓం కాళిన్యై నమః
ఓం శ్రేయోవత్యై నమః
ఓం యామాయై నమః 90
ఓం బ్రహ్మప్రియాయై నమః
ఓం శ్యామసున్దరాయై నమః
ఓం రత్నరూపిణ్యై నమః
ఓం శమనిధిన్యై నమః
ఓం శతానన్దాయై నమః
ఓం శతద్యుతయే నమః
ఓం శితికణ్ఠాయై నమః
ఓం ప్రియాయై నమః
ఓం దాత్ర్యై నమః
ఓం శ్రీబృన్దావన్యై నమః 100
ఓం కృష్ణాయై నమః
ఓం భక్తవత్సలాయై నమః
ఓం గోపికాక్రీడాయై నమః
ఓం హరాయై నమః
ఓం అమృతరూపిణ్యై నమః
ఓం భూమ్యై నమః
ఓం శ్రీకృష్ణకాన్తాయై నమః
ఓం శ్రీతులస్యై నమః 108

*॥ తులసీ అష్టోత్తరశత (108) నామావళి సమాప్తం ॥*

**తులసి ప్రదక్షిణం**

ఈమంత్రం చెప్తూ తులసికి ప్రదక్షిణం చేయాలి.

**యాని కాని చ పాపాని, బ్రహ్మహత్యాదికాని చ ।**
**తాని తాని ప్రణశ్యన్తి, ప్రదక్షిణ పదే పదే ॥ 1 ॥**

శ్రీమతి తులసీదేవికి ప్రదక్షిణ చేసినప్రతిఒక్కఅడుగుకు బ్రహ్మహత్య మొదలుకొని అన్నిపాపాలు నశించిపోతాయి.

తులసిదేవికి ఈక్రిందిమంత్రం చెప్పుకుంటూ 4 సార్లు ఉదయం, సాయంత్రం ప్రదక్షిణ చేయాలి.

**యన్మూలే సర్వతీర్థాని, యన్మధ్యే సర్వదేవతాః ।**
**యదగ్రే సర్వవేదా శ్చ, తులసి! త్వాం నమామ్యహమ్ ॥**

తులసిచెట్టుమూలంలో సమస్తతీర్థాలు ఉంటాయి. మధ్యభాగంలో సకల దేవతలు ఉంటారు. అగ్రభాగంలో సర్వవేదాలు వసిస్తాయి. అటువంటి తులసిదేవికి నమస్కరిస్తున్నాను.

**తులసి ప్రణామం**

తులసిదేవికి ఈమంత్రం చెప్తూ ప్రణామం చేయాలి.

**బృందాయై తులసీదేవ్యై, ప్రియాయై కేశవస్య చ।**
**కృష్ణభక్తిప్రదే దేవి! సత్యవత్యై నమో నమః ॥**

ఓ బృందా! ఓ తులసీదేవీ! నీవు కేశవభగవానునిప్రియురాలివి, కృష్ణ భక్తిని ప్రసాదించే సత్యవతీదేవీ! నీకు అనేకప్రణామాలు.

**సౌభాగ్యవ్రతం - క్షీరాబ్ధిద్వాదశి**

విష్ణుమూర్తి ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున పాలసముద్రంలోని శేషశయ్యపై శయనిస్తారు. దీనినే శయన ఏకాదశి అంటారు. నాల్గు నెలలు



యోగనిద్రలో ఉంటారు. అదే చాతుర్మాస్యవ్రతం. కార్తికమాసంలో క్షీరాబ్ధి ద్వాదశి ముందురోజు వచ్చే ఏకాదశిరోజు శ్రీహరి యోగనిద్రనుండి మేల్కొంటారు. కాబట్టి అది ఉత్థాన ఏకాదశి. మరుసటిరోజున అనగా ద్వాదశి రోజున శ్రీహరి బ్రహ్మ, తదితర దేవతలతోపాటు తులసివృక్షంలో కొలువై ఉంటారు. ఈద్వాదశిని క్షీరాబ్ధిద్వాదశి, చిలుకుద్వాదశి, యోగీశ్వర ద్వాదశి, హరిబోధినీద్వాదశి, మదనద్వాదశి అని కూడా అంటారు. ఈ ద్వాదశి కార్తికమాసంలో శుక్లపక్షంలో వస్తుంది. ఈరోజునే సాలగ్రామ రూపంలో ఉన్న విష్ణుమూర్తికి, తులసికి వివాహం చేస్తారు. ఉసిరిచెట్టులో కూడా విష్ణుమూర్తి కార్తికమాసంలో కొలువైఉంటాడు. క్షీరసాగరమథనం జరిగింది కూడా ఈరోజునే అని పురాణాలు చెబుతున్నాయి. ఈక్షీరాబ్ధిద్వాదశి వ్రతం ఎలా చేయాలో చూద్దాం.

క్షీరాబ్ధిద్వాదశి ముందురోజు అనగా ఉత్థాన ఏకాదశి రోజు ఉపవాసం ఉండి, జాగరణ చేయాలి. ద్వాదశినాడు బ్రహ్మముహూర్తంలో స్నానాదులు పూర్తి చేయాలి. తులసికోటముందు శుభ్రంగా ఆవుపేడతో అలికి, రంగులతో ముగ్గులు వేయాలి. పద్మం, శంఖం, చక్రం ముగ్గులు వేసి పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించాలి. తులసికోటకు క్రొత్తచీర కట్టాలి. తమశక్తినిబట్టి క్రొత్తఆభరణాలు వేయాలి. వాటిని మరల మనం వాడుకోవచ్చు. మనం వాడినవి వేయకూడదు. పూలదండ సమర్పించాలి. తులసికోటలో ఉసిరి కొమ్మను నాటాలి. రకరకాల ఆహారపదార్థాలు – పచ్చడి, పెరుగన్నం, వడ, పాయసం, ముఖ్యంగా ఉసిరితో కొన్ని వంటలైనా చేయాలి. ఇంకా తమశక్తికొలది తయారుచేసి నివేదన చేయాలి. నేతిదీపారాధన చేయాలి. కార్తికమాసంలో ప్రతిరోజు దీపాలు పెట్టలేనివారు ఈద్వాదశి మొదలు పౌర్ణమివరకూ పెట్టవచ్చును. శాస్త్రోక్తంగా ఈవ్రతాన్ని ఆచరించాలి. ఆతరువాత విష్ణు అష్టోత్తరశతనామావళి,

తులసిఅష్టోత్తరశతనామాలతో పూజ చేయాలి. పూజానంతరం దానితోపాటు బంగారుదీపం కాని, వెండిదీపం గాని దానం చేస్తే మంచిది. శక్తి లేనివారు తమశక్తికొలది దక్షిణ సమర్పిస్తే చాలు. ఈపూజ ఉదయం గానీ, సాయంత్రం గానీ చేయవచ్చు. శ్రీహరికి ఇష్టమైన నామసంకీర్తనం తప్పకుండా చేయాలి.

**వ్రతఫలం**

శ్రద్ధాభక్తులతో ఈపూజ చేసినవారికి మంచిఫలితాలు కల్గుతాయి. అన్నదానం చేయడంవల్ల (కనీసం ఒక్క సద్బ్రాహ్మణుడికైనా) సూర్యగ్రహణ సమయంలో, పవిత్రగంగానదీతీరంలో కోటిమందికి అన్నదానం చేసినఫలం లభిస్తుంది. దీపాలను వెలిగించడంవల్ల వైకుంఠప్రాప్తి కల్గుతుంది. ముఖ్యంగా స్త్రీలు ముత్తైదువలకు వాయనాలు ఇవ్వడంవల్ల మాంగళ్యాభివృద్ధి కల్గుతుంది. కన్యకలు ఆచరించడంవల్ల మంచిభర్తను పొందుతారు. వివాహితలకు సత్సంతానం కల్గుతుంది. ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. జన్మ, జన్మల పాపాలను హరించే గొప్పవ్రతం ఇది. వేయి గ్రహణములును లక్ష అమావాస్యలును కలిపి ద్వాదశీవ్రతఫలంలో పదహారవవంతుకు కూడా చాలవు. పుణ్యాలు ఇచ్చేతిథులు చాలా ఉన్నాయి. కానీ ద్వాదశి శ్రీహరికి ప్రియమైనది కావున అన్నింటికంటే అధికఫలితాన్ని ఇస్తుంది. కంచుపాత్రలో ఆవునెయ్యి పోసి దీపం వెలిగించి దానం ఇస్తే, కోటిజన్మలలో చేసినపాపాలు నశిస్తాయి.

కార్తిక శుక్లద్వాదశి రోజు బంగారుతులసీవృక్షం, సాలగ్రామశిల దానం చేస్తే, నాల్గుసముద్రాలమధ్య ఉన్నభూమి అంతా దానమిచ్చినవాడు పొందే ఫలితాన్ని పొందుతాడు. కార్తికమాసంలో శ్రీహరిలీలలను శ్రవణం చేసినవారూ, కీర్తించినవారూ, ఇతరులకు కూడా అటువంటి అవకాశాన్ని కల్పించినవారూ అనంతమైనఫలితాన్ని పొంది, విష్ణులోకం చేరుకుంటారు.



## 12. తులసి సంరక్షణ

**తులసిని నాటడం**

ప్రతిఒక్కరూ తప్పకుండా తులసిమొక్కను నాటాలి. శ్రావణమాసంలో తులసిమొక్కను నాటడం విశేషఫలదాయకం. ఈమాసంలో నాటడంవలన పురుషోత్తముడు వేలకొలది అపరాధాలను క్షమిస్తాడు.

నర్సరినుండి విత్తనాలు, కావలసిన పూర్తి సామాను తీసుకోవాలి. ఒక భాగం మట్టి, ఒకభాగం ఇసుక బాగా కలుపుకోవాలి. దీనిని సుమారు రెండు అంగుళాలు లోతు ఉన్న సమతలపాత్రలో ఉంచాలి. విత్తనాలను మట్టిపైభాగంపై వేరు వేరుగా ఉంచాలి. తరువాత విత్తనాలపై మట్టిని పలుచగా చల్లాలి. ప్రతిఒక్కబీజంనుండి ఒకతులసిమొక్క అంకురిస్తుంది. మీరు ఎన్ని మొక్కలను సంరక్షణ చేయగలుగుతారో కేవలం అన్ని బీజాలను మాత్రమే నాటాలి. బీజాలపైన నీటిని బాగా ఎత్తునుండి పోయకూడదు, నీళ్లు అలా పోస్తే విత్తనాలు తమస్థానంనుండి వైదొలగుతాయి.

**తులసి పోషణం**

అన్నిటికంటే ముఖ్యం – తులసిని ప్రతినిత్యం గమనించుకోవాలి. ఆమె ఒకశుద్ధమైన భక్తురాలు. ఆమెకు కావలసినవి చాలా తక్కువ. సరళం. సూర్యకాంతి నేరుగా తగిలేటట్లు చూసుకోవాలి. తగినంతజలం కావాలి. ఆమెకు ప్రతిదినం ఒకే సమయంలో జలం అర్పించాలి. అంతే కాకుండా ఒకే సమయంలో పత్రాలను సేకరించాలి. ప్రొద్దున 7.30 నుండి 9.00 గంటల వరకు గల సమయం పై రెండు కార్యాలకు సరైనది.

తులసికి సూర్యకాంతి చాలా అవసరం. ఇంటిబయట సూర్యకాంతి పడేచోట తులసి బాగా పెరుగుతుంది. కాని ఇంటిలోపల 8 నుండి 10 నెలలకంటే అధికంగా ఉండదు.

ఋతువులు, వాతావరణం, ఆకారం, మట్టి దానిరకం మొదలగువానిని అనుసరించి తులసిమొక్కకు నీళ్లు పోయాలి. ఎక్కువనీళ్లు పోయకుండా కొంచెంగా పోయాలి. మట్టి గట్టిగా ఉండకూడదు. గట్టిగా ఉంటే తులసి బలహీనపడుతుంది.

తులసికి నీళ్లు పోయడం యాంత్రిక మైనపని కాదు. అభ్యాసంతోనే ఇది సాధ్యమవుతుంది. ఎక్కువ నీళ్లు పోయడంవలన మట్టి పాడవుతుంది. ఆకులకు బూజు పడుతుంది. అవి కాంతిహీన మవుతాయి. ఆకులు కుళ్లిపోతాయి. నీళ్లు ఎక్కువయ్యాయి అనేదానికి సంకేతం ఆరోగ్యంగా ఉన్న ఆకులు కూడా రాలిపోవడమే.

తులసి మట్టిద్వారా శ్వాస తీసుకొంటుంది. కొద్దికాలం తరువాత మట్టి గట్టిగా మారుతుంది. దీనివలన గాలి రాకపోకలకు ఆటంకం కల్గుతుంది. అప్పుడు మట్టిని అరంగుళంవరకు తవ్వుతూ మెత్తగా చేయాలి. ఆవిధంగా చేసేటప్పుడు వేర్లకు ఎటువంటిహాని కలుగకుండా చూసుకోవాలి.

మట్టిని కలపడం అనేది స్థానికంగా లభించేపదార్థాలతో ఇంటిలోనే తయారు చేయడం సర్వోత్తమం. మంచిమట్టిరంగు గాఢమైనదిగా ఉండాలి, మట్టినుండి మంచిసుగంధం రావాలి. మట్టి గడ్డలుగా ఉన్నప్పటికీ అది తన వాస్తవఆకారం కోల్పోనిశక్తి కల్గిఉంటుంది. ఎండిపోయి ముక్కలు కాకూడదు. మట్టిలో వానపాములు ఉండటం ఒకమంచిసంకేతం. ఎండిన ఆవుపేడను మట్టిలోనే కలపాలి.

అవసర మైనంత నీళ్లు, ఎండ, మంచిఆకారం గల పూలకుండీ లేదా మట్టి, ఎరువు సరిగా ఉంటే తులసిమొక్క బాగా పెరుగుతుంది. దానిని పురుగు పట్టకుండా కాపాడటం చాలా అవసరం. కీటకనాశనపదార్థాలు వాడకూడదు. తులసి కృష్ణభగవానునికి అర్పించబడుతుంది గదా. ఈకీటకనాశన రసాయనమందులవలన తులసిఆకులలో విషం ఉంటుంది. తులసికి స్నానం చేయించడం పురుగులనుండి తులసిని దూరం ఉంచడానికి



సరి అయినచికిత్స. ఒకవేళ పత్రాలకు పురుగు పట్టిఉంటే వాటిని గోరువెచ్చని నీటిలో ముంచిబాగా రుద్ది, శుభ్రం చేయాలి. తరువాత శుభ్రమైననీళ్లతో కడగాలి. తులసిఆకులపై వేగంగా నీటిని ధారగా పోయాలి, దానితో ఆకులను గట్టిగా పట్టుకొని ఉండేపురుగులు ఆకులనుండి వేరవుతాయి. తులసికి వాతావరణం మరీ చల్లగా ఉండకూడదు. ఎండాకాలంలో తులసికి రెండుసార్లు నీళ్లు చల్లాలి. ఒకసారి ప్రొద్దున 10 గంటలకు, రెండవసారి సాయంత్రం 4.30 గంటలకు, తులసికి పచ్చగా వికసించిఉండటం ఇష్టం.

తులసి చిన్నమొక్కగా ఉన్నప్పుడు అది వంగిపోకుండా ఒకకర్రను నాటాలి. ఆకర్రకు మొక్కను కలిపి దారంతో కట్టాలి.

తులసికి 1. ఎక్కువ నీళ్లు 2. తీవ్రమైనఎండ 3. తాజా గాలి తక్కువగా ఉండటం 4. ఎక్కువ చలి అనేకారణాలవల్ల రోగం వస్తుంది. వీటన్నిటి వలన తులసిరంగు పాడవుతుంది. ప్రకృతిలో మార్పులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. నీరు, గాలి, వెలుతురు సమతులంగా ఉండేటట్లు చూసుకోవాలి.

తులసికాండానికి రెండువైపులా అండాకారపుపత్రాలు ఉండటం విశేషం. అవి ఆకుల రెండవసమూహంతో కూడా వృద్ధి చెందుతాయి. ప్రతిఒక్కపత్రం ఆధారభాగం కాండం మరియు పత్రం కలిసేస్థానంలో ఒక చిన్నమొగ్గ ఉంటుంది. సాధారణంగా అది ఒకశాఖగా వృద్ధి చెందుతుంది, లేదా అప్పుడప్పుడు పుష్పాలసమూహంగా రూపుచెందుతుంది. తులసికాండం అగ్రభాగం పైన ఒకసక్రమ మైన వికాసబిందువు ఉంటుంది. ఆవికాస బిందువు పూగుత్తి లేక మంజరిగా మార్పు చెందనంతవరకు అది పైపైకి వృద్ధి చెందుతూ ఉంటుంది. ఒక్కొక్కసారి తులసి ఆస్థితికి రాకముందే బాగా ఎత్తుగా పెరుగుతుంది. వాస్తవానికి తులసికి అధికంగా ఆధారం కల్పించడానికి కర్రలు అవసరం ఉండవచ్చు. విశేషంగా అపరిపక్వదశలో

దానికాండం కట్టెలాగా ఎండిపోయి, దృఢంగా ఉండదు. ఆధారం ఇవ్వడానికి ఇచ్చేవస్తువుపై కుళ్లిపోవడం లేదా కరిగిపోవడంవంటిప్రభావాలు ఉండ కూడదు.

మొక్కకు ఆధారం ఇచ్చేకర్రను పూలకుండీలో ఓరగా పెట్టాలి. కర్రను కుండీలో మొక్కకు దగ్గరగా బలంగా లోపలికి దూర్చడం ప్రమాదకరం. ఎందుకంటే మొక్కవేర్లకు హాని కలుగవచ్చు. ఒక సన్నని, శుభ్రమైనవస్త్రపు పట్టీని కాని, గాలిపటందారం కాని తీసుకొని మొక్కకాండాన్ని, ఆధారా న్నిచ్చేకర్రను కలిపి శాఖలకు లేదా కొమ్మలకు ఎటువంటిహాని కలుగకుండా జాగ్రత్తగా కట్టాలి.

ఒక్కొక్కసారి తులసిమొక్క పైభాగం దట్టంగా లేదా బరువుగా ఉంటుంది. అపుడు తులసిమొక్క నిలబడడం కష్టం. కర్ర ఆధారంగా ఉన్నప్పటికి, మొక్కకాండం నిటారుగా ఉండలేక వంగిపోతుంది. ఒకవేళ తులసి ఎక్కువ ఎత్తుగా పెరుగుతుంటే, దానిఎత్తు మొక్కకు ఒకసమస్యగా పరిణమిస్తే, వేరేమొక్కలు మాదిరి త్రుంచడం కాని, నరకడం కాని చేయకూడదు. దీని కొమ్మలను మనసుకు నచ్చినఆకృతి ఇవ్వడానికి ఎప్పుడూ కత్తిరించకూడదు. పచ్చగా ఉన్నతులసి శాఖలను కత్తిరించడం ఒకఅపరాధం. పద్మపురాణం ప్రకారం పచ్చగా ఉన్నతులసి శాఖలను నరకడం లేదా కత్తిరించడంవలన కృష్ణభగవానుడు తనహృదయంలో బాధపడతాడు.

తులసిమొక్కలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి - ఆకులు మరియు చెట్టుబోదె ఊదారంగు కలిగిఉంటుంది. గాఢమైన ఊదారంగు గులాబిరంగులో పూలు ఉంటాయి. దానిని కృష్ణతులసి అంటారు. మరొక తులసికి ఆకులు మరియు చెట్టుబోదె ఎప్పటికీ ఊదారంగులోకి పరివర్తనం చెందదు. దానిపుష్పాలు శ్వేతవర్ణంలో ఉంటాయి - దానిని 'రామతులసి' అంటారు.



తులసిమొక్క కోమలమైనది. పక్షులనుండి, కీటకాలనుండి రక్షించాలి. ఒకస్థానంలో తులసిమొక్క మొలచి, మొక్క అక్కడే ఉంటే బ్రతుక లేదు అనేపక్షంలో దానికొరకు సరి అయినస్థలం చూసి, తిరిగి నాటవచ్చు.

ప్రతిరోజు తులసికి తాజా గాలి, నీరు, సూర్యకాంతి తగిలేటట్లు చూడాలి. తులసిని సరిగా చూడకపోవడం, నిర్లక్ష్యం చేయడం, సరైన పద్ధతిలో నీరు పోయకపోవడం పెద్ద అపరాధం. అన్నీ చాలా శ్రద్ధగా చేయాలి.

తులసి సమస్తభక్తిమయకార్యాలసారం. తులసిపత్రాలు, పుష్పాలు, వేర్లు, బెరడు, కొమ్మలు, చెట్టుబోదె, నీడ అన్నియూ ఆధ్యాత్మిక మైనవి.

తులసిదేవి భగవంతునికి అత్యంతప్రియ మైనది. కనుక ప్రేమ, నిష్ఠ, స్నేహంతో తులసిదేవికి సేవ చేయడం అన్నిటికన్నా ముఖ్యమైంది.

## విదేశాలలో తులసి

ఈమధ్య జపాన్‌లో ప్రతిఇంటిలోను తులసిమొక్కలు పెంచుతున్నారట. ఎందుకో తెలుసా! తులసి లక్ష్మీస్వరూపం. తులసిచెట్టు దగ్గర ప్రాణాయామం, ధ్యానం, యోగా చేస్తే ఎక్కువ ఫలితం వస్తుంది. కారణం! సాధారణంగా అన్నిమొక్కలు, చెట్లు తాము పీల్చుకున్న మొత్తం కార్బన్-డై-ఆక్సైడ్‌ను ఉదయం పర్యావరణంలోకి విడిచిపెడతాయి. కానీ తులసిమొక్క మాత్రం రోజుకి 22 గంటలు ఆక్సిజన్‌ను విడిచిపెడుతుందని పరిశోధనలలో తేలింది. వృక్షజాతిలో మరే మొక్కకు ఈప్రత్యేకత లేదు. తులసి ఔషధనిధి. తులసిలో ప్రతిభాగం ఆయుర్వేదచికిత్సలో వాడుతుంటారు.

## తులసి నామాలు

భావప్రకాశనిఘంటువులో ఇలా చెప్పబడింది.

**శ్లో. తులసీ సురసా గ్రామ్యా, సులభా బహుమంజరీ ।**
**అపేతరాక్షసీ గౌరీ, శూలఘ్నీ దేవదుందుభిః ॥**

1) తులసి 2) సురస 3) గ్రామ్య 4) సులభ 5) బహుమంజరి 6) అపేతరాక్షసి 7) శూలఘ్ని 8) గౌరి 9) దేవదుందుభి – ఇవి తులసికి సంస్కృతపర్యాయపదములు.

వివిధభాషలలో తులసినామాలు ఇలా ఉన్నాయి.

హిందీ – బెంగాలీ – తెలుగు = తులసి
గుజరాతీ = కాలీ – ధోవీ తులసి
మరాఠీ = తులస, తులసి
కన్నడం = ఐరేడ తులసి
ఫారసీ = రోహాన్
అరబ్బీ = ఉల్సీవాదరుత
ఇంగ్లీషు = శ్వేతతులసి White Basil
కృష్ణతులసి Purple Slalked Basil
లాటిన్ = ఓసిమమ్ ఆల్బమ్ Ocymum Album
ఓసిమమ్ సేంకటమ్ Ocymum Sancturm

**శ్లో. తులసీ కటుకా తిక్తా, హృద్యోష్ణా దాహపిత్తహృత్ ।**
**దీపనీ కుష్ఠకృచ్ఛ్రాస్రపార్శ్వరుక్ కఫవాతజిత్ ॥**
**శుక్లా కృష్ణా చ తులసీ, గుణై స్తుల్యా ప్రకీర్తితా ॥**

**తులసి – ఆరోగ్యగుణాలు**

1) తులసి కొంచెం కారంగా, కొంచెం చేదుగా ఉంటుంది.
2) గుండెజబ్బులను నివారిస్తుంది.
3) ఉష్ణగుణం గలది.
4) దాహాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుంది.
5) జఠరాగ్నిమాంద్యం పోగొడుతుంది.
6) కుష్ఠం, మూత్రకృచ్ఛ్రం, ప్రక్కపోటు మొదలైనరోగాలు తగ్గిస్తుంది.



7) కఫం, వాతం తగ్గిస్తుంది.
నిత్యం తులసీతీర్థం సేవిస్తే ఈగుణాలు తప్పక కల్గుతాయి.
కృష్ణతులసికి, శుక్లతులసికి గుణాలు సమానం.

మనపూర్వీకులు దేనినైనా పూజించండి అని చెప్పా రంటే అందులో ఆధ్యాత్మిక, ఆరోగ్య, వైజ్ఞానిక కారణాలు తప్పకుండా ఉంటాయి. అవి మనకు తెలియవు. అందుకే పెద్దలమాట పెరుగన్నం మూట అన్నారు.

తులసికున్న ఘాటైనవాసన కారణంగా తులసివాసన వ్యాపించినంత వరకు ఈగలు, దోమలు, పాములు రావు. అందుకే మనసంప్రదాయంలో ఇంటిముందు, వెనుకా కూడా తులసిమొక్కను పెట్టి పూజించమన్నారు. ఫలితంగా ఇంట్లోకి పాములు రాకుండా ఉంటాయి. తులసిలో ఉన్న ఔషధ గుణాలవల్ల గొంతులో కఫం కరిగిపోతుంది.

ప్రపంచాన్ని హడలు గొట్టిన "స్వైన్‌ఫ్లూ" భారతదేశంలో వ్యాపించకుండా అడ్డుకున్నది తులసిమొక్కే నని తేలింది. ఎందుకంటే తులసిగాలి కారణంగా జనంలో "స్వైన్ ఫ్లూ" ను తట్టుకునే రోగనిరోధకశక్తి పెరిగిందట.

ఇంట్లో జనం ఆరోగ్యంగా ఉండాలంటే తులసిమొక్కల్ని ఎక్కువగా నాటాలి. తులసి కాలుష్యప్రభావాన్ని తగ్గిస్తుంది.

తాజ్‌మహల్ కాలుష్యం బారినపడకుండా, మసకబారకుండా ఉండడం కోసం, దానిప్రక్కనే లక్ష తులసిమొక్కలవనాన్ని ప్రత్యేకంగా పెంచుతున్నారు.

నల్గొండ జిల్లాలో "ఫ్లోరోసిస్" వ్యాప్తిని తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. తులసిఆకులు నీటిలోని ఫ్లోరోసిస్ వ్యాప్తిని తగ్గిస్తాయని ఈమధ్యే ధ్రువీకరించారు.

---ఇతి శమ్---